అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 27-3-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 34 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50

బంగారు నిఖత్




- రెండో పసిడి నెగ్గిన తెలంగాణ తేజం
- లవ్లీనా బొర్గొహైన్‌కు స్వర్ణ పతకం
- ప్రపంచ చాంపియన్లుగా నిఖత్, లవ్లీనా
- ఐబీఏ మహిళల వరల్డ్ చాంపియన్‌షిప్స్

10లో..

ఇక రైతు తుఫాన్

దాన్నెవరూ ఆపలేరు




- జాతి, మత వాదాలు కాదు రైతువాదం కావాలి
- మా పథకాలను అమలు చేసే దమ్ముందా ?
- తెలంగాణ తరహాలో అభివృద్ధి చేస్తే మహారాష్ట్రకు రాను
- మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరేస్తాం: కాందార్ లోహ బహిరంగ సభలో సీఎం కేసీఆర్


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో త్వరలో రైతు తుఫాన్ రాబోతున్నదనీ, దాన్నెవరూ ఆపలేరని బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. మత, జాతి వాదాన్ని విడిచిపెట్టి రైతు వాదంతో ముందుసాగాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ తరహాలో మహారాష్ట్రలో అభివృద్ధి చేస్తే ఆ రాష్ట్రంలో అడుగుపెట్టబోనని ఆయన స్పష్టం చేశారు. మహనీయులు పుట్టిన మహారాష్ట్ర గడ్డ విప్లవాలకు చిరునామా అని చెప్పారు. తెలంగాణలో అమలు చేస్తున్న కీలక పథకాలను అమలు చేసే దమ్ము మహారాష్ట్ర సర్కారుకుందా? అని సవాల్ విసిరారు. ఆదివారం మహారాష్ట్రలోని కాందార్ లోహలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. సభా వేదిక మీద ఏర్పాటు చేసిన మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్, బసవేశ్వరుడు, డాక్టర్ బీఆర్.అంబేద్కర్, అన్నా బాహు సాతే, మహాత్మా పూలే, అహిల్యాబాయి హెల్కర్, తదితర మహనీయుల విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'మహారాష్ట్రలో ఏం పని అని ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రశ్నిస్తున్నారు. నేను భారత పౌరుడిగా ప్రతిరాష్ట్రంలోనూ పర్యటిస్తా. నేను భారతదేశ బిడ్డను. తెలంగాణలో రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నాం. రైతుబంధు, రైతుబీమా అమలు చేస్తున్నాం. పండించిన ప్రతి పంటను కొనుగోలు చేస్తున్నాం. మహారాష్ట్రలో దళితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మా రాష్ట్రంలో దళిత బంధు అమలు చేస్తున్నాం. దళిత వజ్రం, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పుట్టిన గడ్డపై దళిత బంధు ఎందుకు అమలు చేయరు? తెలంగాణ తరహా పథకాలు మహారాష్ట్రలో అమలు చేయనంత వరకు నేను వస్తూనే ఉంటా' అని స్పష్టం చేశారు. 'స్వాతంత్ర్యమొచ్చి 75 ఏండ్లయినా పేదల బతుకులు మారలేదు. కాంగ్రెస్, బీజేపీలతో మన బతుకులు మారాయా? రెండు పార్టీల పాలనలో రైతుల పరిస్థితి ఎందుకు మారలేదు? నేను చెప్పేది నిజమో? అబద్ధమో? మీరే ఆలోచించండి' అని ప్రజలకు సూచించారు. ఫసల్ బీమా ఎవరికైనా అందుతా అని ప్రశ్నించారు. ఆ పథకమే ఒక నాటకమని విమర్శించారు.

'హర్యానాలో భూమిపుత్రుడు చోటురామ్ నుంచి మహేంద్రసింగ్ టికాయత్ వరకు, బెంగుళూరుకు చెందిన ప్రొఫెసర్ నంజుండ స్వామి నుంచి ఇక్కడ శరత్ జోషి కాలం వరకు రైతుల కోసం పోరాటాలు చేస్తూనే ఉన్నారు. అశోక్‌ధావలే నేతృత్వంలో రైతులు నాసిక్ నుంచి ముంబయి వరకు పది వేల మంది పాదయాత్ర చేశారు. అహ్మద్‌నగర్‌కు చెందిన దశరథ్ సావంత్ కాకా 84 ఏండ్ల వయస్సులోనూ ఇంకా పోరాడుతూ ఉన్నారు. ఉల్లి, చెరుకు, ఇలా అన్ని పంటలకూ మద్దతు ధర కోసం ఏటా మనం ఎందుకు పోరాటం చేయాల్సి వస్తోంది ? రోడ్లపైకి ఎందుకు ...9లో

దొంగలను విమర్శిస్తే

జైలుకా..?



మోడీజీ... ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలేవీ...?

- దేశంలో ఉన్నది 'మోదానీ' సర్కారు : జనచైతన్య యాత్రలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు విజ్జూకృష్ణన్



నేరేడుచర్ల నుంచి బి.బసవపున్నయ్య

దేశంలో దొంగలను దొంగ అన్నా...అలాంటి వారిని విమర్శించినా జైలుకు పంపుతున్నారని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు విజ్జూకృష్ణన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో ఇచ్చిన హామీ మేరకు కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ సర్కారు... ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వకపోగా, ఉన్న కొలువులను ఊడబెరుకుతున్నదని ఆయన వ్యాఖ్యానించారు. భారత్‌ను ప్రస్తుతం 'మోదానీ' ప్రభుత్వం పరిపాలిస్తున్నదని విమర్శించారు. దొంగలకు ఆశ్రయం కల్పిస్తున్న బీజేపీ సర్కారు... అలాంటి వారికి మంత్రి పదవులను కట్టబెడుతున్నదని విమర్శించారు. అంబానీ, అదానీలతో కలిసి మోడీ దేశాన్ని దోపిడీ చేస్తున్నారని నిరసించారు. సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన చైతన్య యాత్ర పదో రోజైన ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్, నేరేడుచర్లలో కొనసాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన మోటార్ సైకిల్ ర్యాలీలో విజ్జూకృష్ణన్ పాల్గొన్నారు. నేరేడుచర్ల చౌరస్తాలో సీపీఐ (ఎం) పట్టణ కార్యదర్శి కె.నగేష్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించారు. ప్రజల ఆస్తులను దోచి, కార్పొరేట్లను మేపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. మోడీ పాలనకు వ్యతిరేకంగా అందరూ ఐక్యం కావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. విదేశాల్లోని నల్లధనాన్ని ...2లో

పీక్ సమయంలో 20శాతమా?

విద్యుత్ చార్జీలు పెంచాలన్న కేంద్ర ప్రభుత్వం

వివరాలు 9లో

- ప్రజలపై భారమన్న.. విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి





ఇస్రో ఘన చరిత్ర

- మార్క్3-ఎం3 రాకెట్ ప్రయోగం విజయవంతం
- మరోసారి కక్ష్యలోకి దూసుకెళ్లిన 36 ఉపగ్రహాలు

శ్రీహరికోట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. జీఎస్ఎల్వీ మార్క్ 3 ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేశామని ఇస్రో చైర్మెన్ సోమనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఇస్రో పంపిన 36 ఉపగ్రహాలను ఎల్వీఎం-3 రాకెట్ కక్ష్యలోకి చేర్చినట్టు తెలిపారు. ఆదివారం ఉదయం శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం (షార్) లో ఎల్వీఎం-3 రాకెట్ ప్రయోగం జరిగింది. షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 గంటలకు షార్ ప్రయోగ వేదిక నుంచి ఎల్వీఎం-3 రాకెట్ వన్ వెబ్‌కు చెందిన ...9లో



పిరికి ప్రధాని

బీజేపీ భయపడుతున్నది.. అందుకే వేధిస్తున్నది

- దమ్ముంటే నాపై కేసు పెట్టండి
- మోడీ ప్రభుత్వతీరుపై గళమెత్తే సమయం ఆసన్నమైంది : కాంగ్రెస్ 'సంకల్ప సత్యాగ్రహ'లో ప్రియాంక గాంధీ
- ఢిల్లీలో రాజ్‌ఘాట్ వద్ద నిరసన
- పాల్గొన్న పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు
- రాహుల్‌ను రాజకీయాల్లో లేకుండా చేయాలని బీజేపీ కుట్ర : ఖర్గే

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎంపీగా రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ ఆయనకు సంఘీభావంగా కాంగ్రెస్ దేశవ్యాప్తంగా 'సంకల్ప సత్యాగ్రహ'ను చేపట్టింది. దేశంలో అన్ని రాష్ట్రాలు, జిల్లా కేంద్రాల్లో రాహుల్ అనర్హత వేటుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 10 గంటలకే ప్రారంభమైన ఈ నిరసన ప్రదర్శనలు సాయంత్రం 5 గంటల వరకు కొనసాగాయి.

ఢిల్లీలోని మహాత్మా గాంధీ సమాధి (రాజ్‌ఘాట్) వద్ద కాంగ్రెస్ సంకల్ప సత్యాగ్రహను నిర్వహించింది. రాజ్‌ఘాట్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు కాంగ్రెస్ పార్టీకి ఢిల్లీ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయనే కారణంగా అనుమతి ఇవ్వడం లేదని పోలీసులు కాంగ్రెస్ కార్యాలయానికి లేఖ రాశారు. రాజ్‌ఘాట్ ప్రాంతంలో సెక్షన్ 144 విధించినట్టు వెల్లడించారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. అయితే పోలీసుల ఆంక్షలు ఉన్నప్పటికీ కాంగ్రెస్ సత్యాగ్రహను చేపట్టింది.

తొలుత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, నేతలు కె.సి వేణుగోపాల్, ప్రమోద్ తివారి, రాజీవ్ శుక్లా, అధీర్ రంజన్ చౌదరి వంటి అగ్రనాయకులు రాజ్‌ఘాట్ చేరుకొని మహాత్మా గాంధీ సమాధికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ...9లో

మంగళూరులో రెచ్చిపోయిన కాషాయ మూకలు

'రంగ్ బర్సే' వేదికపై దాడి ... ఆరుగురి అరెస్టు



బెంగళూరు : బీజేపీ పాలిత కర్నాటకలో కాషాయ మూకలు మరోమారు రెచ్చిపోయాయి. మంగళూరులో 'రంగ్ బర్సే' పేరుతో నిర్వహించాల్సిన ఒక సాంస్కృతిక కార్యాక్రమాన్ని భౌతిక దాడులతో హిందూత్వ గూండాలు అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించిన వేదికను ధ్వంసం చేశారు. ఈ దాడికి సంబంధించి ఇప్పటి వరకు ...2లో

ఉపాధి తగ్గింది

నిధుల కోత, యాప్ ఆధారిత హాజరుతో ఇక్కట్లు




- జనవరిలో పదిశాతం పడిపోయిన పని
- నెట్‌వర్క్, ఇతర సాంకేతిక సమస్యలే కారణం
- వేతనాల చెల్లింపుల్లో ఆలస్యం
- ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పోర్టల్ సమాచారం

భారత్‌లోని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఉపాధికి హామీని కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) పని తీరు ఆశాజనకంగా కనిపించడం లేదు. ముఖ్యంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ చట్టాన్ని క్రమక్రమంగా నీరుగారుస్తున్నది. ఏటికేడూ బడ్జెట్‌లో కోతలు.. ఈ ఏడాది కొత్తగా తీసుకొచ్చిన యాప్ ఆధారిత హాజరుతో సాంకేతిక సమస్యలు.. లబ్దిదారులకు చెల్లింపులు ఆలస్యంగా జరపటం వంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో పథకం ఆశించిన లక్ష్యాలను చేరడం లేదు. లబ్దిదారుల ఉపాధికి గండి కొడుతున్నది.



న్యూఢిల్లీ : ఇటీవల ఉపాధి హామీ చట్టంలో మోడీ ప్రభుత్వం అనేక మార్పులను తీసుకొచ్చింది. ఎప్పటిలాగే ఈ పథకానికి ఇటీవల బడ్జెట్‌లోనూ భారీ మొత్తంలో కోతలను విధించి తక్కువ మొత్తంలో నిధులను కేటాయించింది. మరోపక్క, ఉపాధి పథకం కింద పనిని పొందే కుటుంబాలు, లబ్దిదారుల హాజరు కోసం యాప్ ఆధారిత హాజరును ప్రవేశ పెట్టారు. ఫలితంగా ఉపాధి హామీ పని ...9లో



కూపీ లాగుతున్న సిట్

గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో 100మార్కులకు పైగా వచ్చిన అభ్యర్థుల జాబితా సిద్ధం



హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్ కేసులో సిట్ దర్యాప్తు వేగంగా కొనసాగుతోంది. గ్రూప్-1 పరీక్షలో 100 మార్కులకు పైగా మార్కులు ఎవరికెవరికి వచ్చాయి..? ఎవరెవరు ఈ స్కాంలో ఉన్నారు..? ఇంకెంతమంది సూత్రధారులున్నారనే కోణంలో సిట్ కూపీ లాగుతోంది. ఇప్పటికే వందకు పైన మార్కులు వచ్చిన వారి జాబితాను సిట్ అధికారులు సిద్ధం చేశారు. టీఎస్‌పీఎస్సీ బోర్డు నుంచి అభ్యర్థుల సమాచారం సేకరించిన అధికారులు.. సిట్ కార్యాలయానికి రావాలని వారికి సూచించారు. ఆయా అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. విచారణకు వచ్చిన అభ్యర్థుల నుంచి 15 అంశాలపై వివరాలను సేకరిస్తున్నారు.

వివరాలన్నీ రికార్డు...

బయోడేటా ఆధారంగా ఎంతవరకు చదివారు? ప్రస్తుతం ఎక్కడ ఉద్యోగాలు చేస్తున్నారు? తదితర ...9లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

వచ్చే ఎన్నికల్లో బీజేపీని చిత్తు చిత్తుగా ఓడించండి



ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉన్నంతకాలం బీఆర్ఎస్‌ను సమర్థిస్తాం : సీపీఐ(ఎం) జన చైతన్య యాత్రలో తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా జన చైతన్య యాత్రను చేపట్టినట్టు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. 2023 ఎన్నికల్లో బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జన చైతన్య యాత్ర బహిరంగసభ జరిగింది. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ వాగ్దానాలను అమలు చేయడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వ్యాఖ్యానించారు. అవినీతిరహిత పాలన అందజేస్తామని చెప్పిన బీజేపీ సర్కార్ గుండుగుత్తగా ప్రజల ఆస్తులను అంబానీ, ఆదానీలకు పంచిపెడుతోందని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి తొమ్మిదేండ్లవుతున్నా ఆ వాగ్దానం అమలు చేయలేదని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల చొప్పున తొమ్మిదేండ్లలో 18 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా 18 వేల కొలువులు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పేదలకు ఇండ్లు కట్టించి ఇస్తామని చెప్పిన ప్రధాని ఒక్క ఇల్లును ఇవ్వకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చెప్పి నెరవేర్చలేదని అన్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో భారీ పోరాటం ద్వారా నల్ల రైతు చట్టాలను రద్దు చేసే వరకు ఉద్యమించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ సందర్భంగా 760 మంది చనిపోయినా వెనక్కి తగ్గలేదని వివరించారు. బుల్లెట్ రైలును మరిచిపోవాల్సిందేననీ, బ్యాంకుల్లో రూ.15 లక్షల సొమ్మును వేస్తామని చెప్పి దేశప్రజలను మోసం చేశారని విమర్శించారు.

కేసీఆర్ ప్రభుత్వం తప్పులు చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా కేసీఆర్ ఉన్నంత కాలం, ప్రజానుకూల విధానాలు అమలు చేస్తున్నంత కాలం బీఆర్ఎస్‌ను సమర్థిస్తామని ఈ సందర్భంగా తమ్మినేని చెప్పారు. దేశంలో దుర్మార్గమైన మనుధర్మాన్ని అమలు చేసే ప్రయత్నం జరుగుతోందనీ, దీన్ని అడ్డుకుంటామని చెప్పారు. రిజర్వేషన్లు కావాలని బీసీలు, మహిళలు ఎప్పటినుంచో అడుగుతున్నారనీ, మోడీ ప్రభుత్వం మాత్రం వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీజేపీని ఓడించేందుకు దేశంలో లౌకిక ప్రజాస్వామ్య శక్తులను కూడగడతామని చెప్పారు.

నితీష్ కుమార్, అఖిలేష్ యాదవ్, కేసీఆర్, స్టాలిన్, కేజ్రీవాల్ తదితర ప్రతిపక్షాల ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు కలిసి వస్తున్నారని చెప్పారు. వచ్చే సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో మిర్యాలగూడలో పోటీ చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్‌తో ఎన్నికల అవగాహన కుదుర్చుకునే ప్రయత్నం చేస్తామని చెప్పారు. పేపర్ల లీకేజీ మూలంగా అర్హులైన నిరుద్యోగ యువతకు నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

మిర్యాలగూడ మహా 'జనచైతన్య' సంద్రం

సీపీఐ(ఎం) జన చైతన్య యాత్రలో భాగంగా మిర్యాలగూడలో వందలాది మోటార్ సైకిళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. దాదాపు ఆరు కిలోమీటర్ల పాటు ఈ ర్యాలీ జరిగింది. బైక్‌లు, కార్లు, ఇతర వాహనాల్లో ప్రజలు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధానంగా విద్యార్థులు, యువత, మహిళలు ఎర్ర చొక్కాలు ధరించి ర్యాలీకి హాజరయ్యారు. మిర్యాలగూడలో ఎటు చూసినా ఎర్రజెండాలే కనిపించాయి. పట్టణమంతా ఫ్లెక్సీలు, బ్యానర్లతో ఎరుపెక్కింది. ఎన్ఎస్‌పీ క్యాంప్ ప్రాంగణంలో బహిరంగ సభ జరిగింది. రెండు గంటల పాటు జరిగిన ఈ సభకు మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి వేలాది మంది తరలివచ్చారు. ముఖ్యంగా ముస్లీం మైనార్టీలు, కాంట్రాక్టు వర్కర్లు, ఉద్యోగులు, టీచర్లు జన చైతన్య యాత్ర బృందానికి తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం, విజ్జు కృష్ణన్, పోతినేని సుదర్శన్ రావు, జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి తదితరులను స్థానిక పార్టీ శ్రేణులు సన్మానించారు. ఈ సందర్భంగా బహిరంగసభలో విజ్జు కృష్ణన్, పోతినేని సుదర్శన్, మల్లు లక్ష్మి, జూలకంటి రంగారెడ్డి మాట్లాడారు.

దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ

- ఎంసీపీఐ(యూ) ప్రధాన కార్యదర్శి అశోక్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని ఎంసీపీఐ(యూ) ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ విమర్శించారు. హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా అశోక్ ఓంకార్ మాట్లాడుతూ దేశ సంపదను బడా కార్పొరేట్, సంపన్న వర్గాలకు కేంద్రం కట్టబెడుతున్నదని చెప్పారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదని అన్నారు. కోర్టులు, పార్లమెంటు, ఈడీ, సీబీఐ, ఇతర చట్టబద్ధ సంస్థలను అక్రమంగా కేంద్రం తన చేతుల్లోకి తీసుకుని నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. నియంతృత్వ, కార్పొరేట్, మతోన్మాద సంస్థలు దేశంలో మతం పేరుతో ప్రజలను విభజించి రాజకీయం చేస్తున్నాయని చెప్పారు. కమ్యూనిస్టు, వామపక్ష, ప్రగతిశీల, సామాజిక శక్తులన్నీ కార్పొరేట్ నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించాలని కోరారు. వచ్చేనెలలో ఫూలే, అంబేద్కర్ జయంతి సందర్భంగా పేదల సమస్యలపై అధ్యయనం చేసి మండల, జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు చేపట్టేందుకు ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ తీర్మానించింది. ఆ పార్టీ నాయకులు వంగాల రాగసుధ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, కార్యదర్శివర్గ సభ్యులు వల్లేపు ఉపేందర్‌రెడ్డి, వనం సుధాకర్, కుంభం సుకన్య, వడితీయ తుకారాం నాయక్, వసుకుల మట్టయ్య, పెద్దారపు రమేష్, ఎస్‌రెడ్డి హంసారెడ్డి, కన్నం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య ప్రైమరీ విద్యార్థుల అద్భుత ప్రదర్శన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ఆదివారం శ్రీచైతన్య స్కూల్ తమ ఇంటర్ స్కూల్ స్టేట్ లెవెల్ కాంపిటీషన్ ఫియెస్టా- ఎ బోకె ఆఫ్ ఇన్‌హెరెంట్ టాలెంట్స్-2023 కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో నారథాన్- స్టోరీ నెరేషన్, అబాకస్, చిత్రకళ (డ్రాయింగ్) మూడు విభాగాలను స్కూల్ స్థాయి నుంచి జోనల్ స్థాయి, జోనల్ స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన తెలంగాణలోని 500 మందికిపైగా విద్యార్థులతో గ్రాండ్ ఫినాలే విజయవంతంగా నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు.


అది ఉగ్రవాద సంస్థ కాదు

- 'సనాతన్ సంస్థా'పై బాంబే హైకోర్టు వ్యాఖ్యలు
- ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించడం దాని లక్ష్యమని వెల్లడి

ముంబయి : ప్రముఖ హేతువాదులు నరేంద్ర దబోల్కర్, ఎం.ఎం కలబురగి, గోవింద్ పన్సారే, జర్నలిస్టు గౌరీ లంకేశ్ హత్య కేసులో కీలక పాత్ర పోషించిందన్న ఆరోపణలను ఎదుర్కొంటున్న హిందూత్వ సంస్థ సనాతన్ సంస్థాపై బాంబే హైకోర్టు ఆశ్చర్యకరమైన వ్యాఖ్యలు చేసింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద సనాతన్ సంస్థా అనేది ఉగ్రవాద సంస్థ కాదని వ్యాఖ్యానించింది. సమాజంలో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచే లక్ష్యంతో చారిటబుల్ ట్రస్టుగా ఇది నమోదైందని న్యాయస్థానం తెలిపింది. ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద నేరారోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు విజయ్ లోధికి బెయిల్ మంజూరు చేస్తూ న్యాయమూర్తులు జస్టిస్ సునీల్ శుక్రే, కమల్ ఖటలతో కూడిన డివిజన్ బెంచ్ పై విధంగా అభిప్రాయపడింది.

లోధి సనాతన్ సంస్థా క్రియాశీలక సభ్యుడు. మహారాష్ట్ర, దాని చుట్టుపక్కల రాష్ట్రాల్లో ఉగ్రవాద ముఠాను రహస్యంగా ఏర్పర్చడం ద్వారా హిందూ దేశాన్ని ఏర్పాటు చేయాలన్నది సదరు హిందూత్వ సంస్థ లక్ష్యం. లోధి దేశాన్ని అస్థిరపర్చే కుట్రలో భాగమయ్యాడని మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) ఆరోపించింది. హిందూత్వ సంస్థ కోసం తన ఇంటిలో ఆయుధాలు, పేలుడు పదార్థాల తయారీతో పాటు వాటిని నిల్వ చేశాడన్న ఆరోపణలపై ఏటీఎస్ ఆయనను అరెస్టు చేసింది. కాగా, బాంబే హైకోర్టుకు ముందు ప్రత్యేక కోర్టు లోధి దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

కరోనా కేసులు పెరుగుతున్నయ్



- కొత్తగా 1890 కోవిడ్ కేసులు నమోదు
- 149 రోజుల తర్వాత ఇదే అత్యధికం
- కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సమాచారం

న్యూఢిల్లీ : దేశంలో కరోనా కేసులు మళ్లీ పెరగడం ఆందోళన కలిగిస్తున్నది. భారత్‌లో కొత్తగా 1890 కేసులు నమోదయ్యాయి. 149 రోజుల తర్వాత దేశంలో ఇంత మొత్తంలో కేసులు అధికంగా నమోదుకావడం గమనార్హం. చివరగా గతేడాది అక్టోబర్ 28న దేశంలో 2208 కరోనా కేసులు నమోదయ్యాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ సమాచారాన్ని వెల్లడించింది.

కేంద్రం సమాచారం ప్రకారం.. భారత్‌లో ఏడు కరోనా మరణాలు నమోదయ్యాయి. ఇవి మహారాష్ట్ర(2), గుజరాత్ (2), కేరళ (3) రాష్ట్రాల నుంచి ఉన్నాయి. దీంతో కరోనా మహమ్మారి కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,30,831కి చేరింది. దేశంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 4.47 కోట్లకు పైగా (4,47,04,147 కేసులు) చేరుకున్నది. ఇందులో యాక్టివ్ కేసుల సంఖ్య 0.02 శాతంగా ఉన్నది. దేశంలో రోజువారీ పాజిటివిటీ రేటు 1.56 శాతంగా నమోదైంది. కోవిడ్-19 రికవరీ రేటు 98.79 శాతంగా ఉన్నది. 4,41,63,883 మంది కరోనా నుంచి కోలుకున్నారు. కరోనా మరణాల రేటు 1.19శాతంగా నమోదైంది. దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో భాగంగా 220.65 కోట్ల డోసుల కోవిడ్ వ్యాక్సిన్ అందించబడింది.

అప్పుడే.. ఫేమస్ అవుతారు



మంత్రి మల్లారెడి, సుమంత్ ప్రదీప్

లహరి ఫిల్మ్స్, ఛాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న చిత్రం 'మేమ్ ఫేమస్'. సుమంత్ ప్రభాస్ ప్రధాన పాత్ర పోషించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. అనురాగ్ రెడ్డి, శరత్, చంద్రు మనోహరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మంత్రి మల్లా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన ఈ చిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,"ఫేమస్ కావాలంటే కష్టపడాలి. యువత కష్టపడే తత్వాన్ని అలవరుచుకోవాలి' అని అన్నారు. 'జూన్ 2న మంచిగా కుదిరిన మటన్ లాంటి రుచికరమైన సినిమా చూపిస్తాం. మా సినిమాని ఆదరించండి' అని దర్శకుడు సుమంత్ ప్రదీప్ తెలిపారు.

దహనం.. అరుదైన సినిమా




ఆదిత్య ఓం

ఆదిత్య ఓం హీరోగా ఓపెన్ ఫీల్డ్ మీడియా పతాకంపై ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో డాక్టర్ శ్రీపెతకంశెట్టి సతీష్ కుమార్ నిర్మిస్తున్న చిత్రం 'దహనం'. ఈ నెల 31వ తేదీన ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ టీజర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. హీరో ఆదిత్య ఓం మాట్లాడుతూ, 'ప్రతీ శుక్రవారం సినిమాలు వస్తాయి. కానీ ఇలాంటి సినిమాలు ఏ ఐదేళ్లకో, పదేళ్లకో వస్తాయి. ఇది కమర్షియల్ ప్రాజెక్ట్ కాదు. ప్యాషన్‌తో తీసిన అరుదైన ప్రాజెక్ట్' అని అన్నారు. 'వర్తమాన, భూత, భవిష్యత్ కాలాల్లో నీరు, నిప్పు, గాలితో అవసరం ఉంటుందని చెప్పే కథ ఇది' అని డైరెక్టర్ చెప్పారు.

పోలీస్ స్టేషన్ ప్రైవేట్ లిమిటెడ్

మంత్ర ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రక్షిత్ అట్లూరి హీరోగా గొల్ల పాటి నాగేశ్వరావు దర్శకత్వంలో విశ్వేశ్వర శర్మ, రాజరాయ్ నిర్మిస్తున్న చిత్రం 'పోలీస్ స్టేషన్ ప్రైవేట్ లిమిటెడ్'. ఈ చిత్ర పూజా కార్యక్రమాలు రామానాయుడు స్టూడియోలో ఘనంగా జరిగాయి. ముహూర్తపు షాట్‌కు డైరెక్టర్ చందు మొండేటి క్లాప్ కొట్టగా, నిర్మాత ప్రసన్న కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ,' ఇలాంటి కథతో ఏ సినిమా రాలేదు. కొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న సస్పెన్స్, యాక్షన్ డ్రామా. పోలీస్ నేపథ్యంలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ని ఏప్రిల్ 15 నుండి స్టార్ట్ చేస్తాం' అని తెలిపారు. 'డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న సినిమా ఇది. అందరికీ ఈ సినిమా కనెక్ట్ అవుతుంది' అని హీరో రక్షిత్ అన్నారు.



రక్షిత్

నవచిత్రం

సంక్రాంతికి పక్కా మాస్ బొమ్మ



మహేష్ బాబు

'అతడు', 'ఖలేజా' సినిమాల తరువాత మహేష్ బాబు, త్రివిక్రమ్ కలయికలో రూపొందుతున్న చిత్రం 'ఎస్ఎస్ఎంబి 28' (వర్కింగ్ టైటిల్). హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్ పై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూజా హెగ్డే, శ్రీలీల కథానాయికలు. నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. తాజాగా ఈ సినిమా కొత్త విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. సంక్రాంతి కానుకగా 2024, జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల చేయబోతున్నట్లు తెలియజేస్తూ చిత్ర యూనిట్ ఆదివారం సాయంత్రం ఓ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. కూల్ గ్లాసెస్‌తో స్టయిలీష్‌గా సిగరెట్ కాలుస్తూ గుంటూరు మిర్చి ఘాటుని తలపిస్తూ మహేష్ మాస్ లుక్ అందర్నీ ఆకట్టుకుంటోంది. దీంతో ఇదొక పక్కా మాస్ బొమ్మ పోస్టర్ చెప్పకనే చెప్పింది

ఔత్సాహిక ఫిల్మ్ మేకర్స్ కోసం..



కమర్

అంతర్జాతీయ స్థాయికి తగ్గకుండా మంచి నిర్మాణ విలువలతో ప్రేక్షకులను అలరించాలనే సంకల్పంతో శుక్రవారం హైదరాబాద్‌లో కమర్ ఫిల్మ్ ఫ్యాక్టరీ విజయవంతంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా బాక్స్ క్రికెట్ లీగ్ ప్రొప్రైటర్, కమ్మర్ ఫిలిం ఫ్యాక్టరీ అధినేత కమర్ మాట్లాడుతూ,'త్రీ సంస్థ నిర్మాణంలో జరిగే సినిమాలను ఓటీటీ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తాం. కన్నడ, తెలుగు, తమిళం, హిందీ, మలయాళంలో సినిమాలు నిర్మించనున్నాం. ఫ్యాషన్ టీవీ ఇండియా, బాక్స్ క్రికెట్ లీగ్, ఫిల్మ్ ఫేయిర్ లాంటిసంస్థలను దిగ్విజయంగా నడుపుతున్న కమర్ ఫిల్మ్ ఫ్యాక్టరీ ద్వారా ఎంతో మందికి ఉపాధి లభించడం సంతోషంగా ఉంది. మా సంస్థలో నిర్మించబోయే సినిమాల కోసం వర్ధమాన ఫిల్మ్ మేకర్స్‌తో చర్చిస్తున్నాం. తెలుగులో పవన్ కళ్యాణ్‌తో సినిమా తీయాలని ఉంది' అని తెలిపారు.

దొంగలను విమర్శిస్తే జైలుకా..?



(మొదటిపేజీ తరువాయి)

తెప్పించి... ఒక్కో భారతీయుడి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామన్న మోడీ, ఇప్పుడా హామీని బుట్టదాఖలు చేశారని ఎద్దేవా చేశారు. ఉపాధి హామీ చట్టం కింద 200 రోజుల పని కల్పించాలనీ, అయితే ఆచరణలో కేవలం 50 రోజులకే దాన్ని పరిమితం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2014 నుంచి 2022 వరకు రైతులు, వ్యవసాయ కార్మికులు దేశంలో ఆత్మహత్యలు చేసుకున్నారనీ, ఇవన్నీ మోడీ ప్రభుత్వ హత్యలేనని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని ప్రజాస్వామ్యంపై ప్రస్తుతం దాడి జరుగుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల మహారాష్ట్రలో జరిగిన రైతు ఉద్యమం చారిత్రాత్మకమని చెప్పారు. నాసిక్ నుంచి ముంబయి వరకు నిర్వహించిన లాంగ్‌మార్చ్‌తోపాటు ఢిల్లీలో సరిహద్దుల్లో జరిగిన రైతు పోరాటాలు దేశానికి దిక్సూచి నిలిచాయని గుర్తు చేశారు. ఆ క్రమంలో కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి రైతులకు క్షమాపణ చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా విజ్జూకృష్ణన్ గుర్తు చేశారు. ఏప్రిల్ ఐదున రైతులు, కార్మికులతో దేశ రాజధాని ఢిల్లీలో భారీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు వివరించారు. ప్రత్యామ్నాయ పోరాటాలను బలోపేతం చేయటంలో భాగంగానే జనచైతన్య యాత్రను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు: పోతినేని

జనచైతన్య యాత్ర బృంద నాయకుడు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ... మోడీ దేశ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నేరవేర్చలేదన్నారు. పేదలకు పూర్తిస్థాయిలో ఇండ్లు ఇస్తామనే వాగ్దానం ఊసే లేదని గుర్తు చేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామనే మాట నీటి మూటే అయిందని విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని లేకుండా చేస్తూ మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. దేశ ఆస్తులను అప్పనంగా అంబానీ, ఆదానీలకు తెగనమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ప్రజల మీద అనేక రకాల పన్నులు విధిస్తూ నిత్యావసర ధరలను విపరీతంగా పెంచుతున్నారని వ్యాఖ్యానించారు. తద్వారా సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రధాని మోడీ నేతృత్వంలో దుర్మార్గపు పాలన సాగుతున్నదని విమర్శించారు. పలు రాష్ట్రాల్లో ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చివేశారని గుర్తు చేశారు. మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. వారికి చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లును తొక్కిపెడుతున్నారని విమర్శించారు.

అంధకారంలో ప్రజల భవిష్యత్తు : జూలకంటి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 135 కోట్ల మంది ప్రజల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నదని సీపీఐ(ఎం) రాష్ట కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దనోట్లను రద్దుచేసిన మోడీ, దేశంలో నల్లధనం పెరగడానికి కారణమయ్యారని విమర్శించారు. ఆ సందర్భంగా అనేక మంది సామాన్యులు చనిపోవడం దారుణమని తెలిపారు. కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రొత్సహిస్తున్న బీజేపీ సర్కారును ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. ఉత్తర భారతంలో రైతాంగం ఐక్యమై 13 నెలలపాటు కఠోర పోరాటం చేసి... మోడీ తెచ్చిన మూడు వ్యవసాయ నల్లచట్టాలను తిప్పికొట్టారని గుర్తు చేశారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వలేని మోడీ దుర్మార్గుడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, టీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి చిత్తలూరి సైదులు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, మండల కార్యదర్శి సిరికొండ శ్రీను, నాయకులు కోట రమేశ్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంగుళూరులో రెచ్చిపోయిన కాషాయ మూకలు

(మొదటిపేజీ తరువాయి)

ఆరుగురు భజరంగ్ దళ్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం..మంగళూరులోని మరోళిలో 'రంగ్‌బర్సే' పేరుతో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ ఒక వినోద కార్యక్రమం నిర్వహించాల్సివుండేది. అయితే కొంచెం ఆలస్యంగా మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ కార్యక్రమం ప్రారంభమయింది. ఆ కొద్ది సేపటికే భజరంగ్ దళ్ కార్యకర్తలు వేదికపై దూసుకొచ్చారు.

నిర్వాహకులతో వాదనకు దిగారు. 'ఇలాంటి కార్యక్రమాన్ని అనుమతించం' అంటూ రెచ్చిపోయారు. వేదికను ధ్వంసం చేశారు. 'రంగ్ బర్సే' ప్రచార పోస్టర్లు, ఫ్లెక్సీలను చింపివేశారు. కార్యాక్రమాన్ని జరగనీయకుండా అడ్డుకున్నారు. భజరంగ్ దళ్ కార్యకర్తలు సాగించిన ఈ విధ్వంసానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

భజరంగ్ దళ్ దాడిపై నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కంకనాడి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని పోలీస్ కమిషనర్ కులదీప్ కుమార్ ఆర్ జైన్ తెలిపారు. అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే 'రంగ్ బర్సే' నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

సహజవనరులను అదానీకి కట్టబెడుతున్న బీజేపీ

ప్రశ్నించినందుకే రాహుల్‌పై అనర్హత వేటు : గాంధీభవన్ వద్ద దీక్షలో రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలోని సహజ వనరులను అదానీకి కట్టబెడుతున్నారంటూ రాహుల్ గాంధీ మోడీ సర్కార్‌ను ప్రశ్నించినందుకే ఆయన లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు వేశారని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి విమర్శించారు. బ్రిటీష్ పాలకుల మాదిరిగా విభజించు...పాలించు విధానాన్ని అమలు చేస్తున్న బీజేపీ అంటే 'బ్రిటీషర్స్ జనతా పార్టీ' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వంపై అనర్హత వేటుకు నిరసనగా ఆదివారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన దీక్షా శిబిరంలో రేవంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతాలు, ప్రాంతాలు, కులాలు, భాషల మధ్య బీజేపీ చిచ్చుపెడుతున్నదని ఆరోపించారు. బ్రిటీషర్లను తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. సర్దార్ పటేల్‌కు బీజేపీకి ఏం సంబంధమో చెప్పాలంటూ అమిత్‌షాను ప్రశ్నించారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను సర్దార్ పటేల్ నిషేధించారని గుర్తుచేశారు. గాంధీ భవన్ నిర్మాణానికి పునాదులు వేసింది ఆయనేనని గుర్తుచేశారు. నాడు ఈస్ట్ ఇండియా కంపెనీ పేరుతో బ్రిటీషర్లు సహజ వనరులను కొల్లగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు బ్రిటిష్ జనతా పార్టీ ఆధ్వర్యంలో అదే సూరత్ నుంచి అదానీ కంపెనీ బయలుదేరిందని ఎద్దేవా చేశారు. ప్రధాని నయా నియంతగా మారి ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారన్నారు. బీజేపీ చెబుతున్న డబుల్ ఇంజిన్ అంటే ఆదానీ, ప్రధాని అని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీని ఎదుర్కొనే ధైర్యం లేకనే అనర్హత వేటు వేశారని రేవంత్ తెలిపారు. ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తెచ్చిన ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తున్నదని విమర్శించారు. సినీ నటుడు శివాజీ మాట్లాడుతూ, గాంధీ కుటుంబం కోసం, దేశం కోసం అందరూ కాంగ్రెస్‌తో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షా శిబిరంలో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మానిక్ రావ్ ఠాక్రే, ఎంపీలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీధర్ బాబు, సీతక్క, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్, మాజీ పీసీసీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, వీహెచ్, మాజీ సీఎల్పీ నేతలు జానారెడ్డి, షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యాగ్రహ దీక్షలు

రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వంపై అనర్హత వేటుకు నిరసనగా సోమవారం అన్ని జిల్లా కేంద్రాల్లోని గాంధీ విగ్రహం లేదా అంబేద్కర్ విగ్రహాల వద్ద సత్యాగ్రహ దీక్షలు చేయనున్నట్టు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి, కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మెన్ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీపై రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి అందరూ మద్దతుగా నిలవాలని కోరారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-మల్లాపూర్

అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానిక ఎస్‌ఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోరండ్ల రాజన్న (59) తనకున్న పొలంలో పెట్టుబడి పెట్టి పంటను సాగు చేశాడు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అప్పులపాలయ్యాడు. తన కూతుళ్ల పెండ్లిళ్లకు కూడా అప్పు చేశాడు. దాంతో తనకు ఉన్న భూమిని మొత్తం అమ్మేసినా అప్పులు తీరలేదు. ఉపాధి లేక చివరకు భూమిని కౌలుకు తీసుకొని పంట సాగు చేయగా అందులో కూడా నష్టపోయాడు. దాంతో జీవితంపై విరక్తి చెందిన రాజన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. మృతుని భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ నవీన్ కుమార్ తెలిపారు.ఓ

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కోదాదరూరల్

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీకి చెందిన నాగార్జునపు పాండు రంగాచారి(55) స్కూటీపై నయానగర్ నుంచి రంగా థియేటర్ వైపు వెళు తుండగా బస్టాండ్ ముందు ఏలూరు డిపోకు చెందిన బస్సు డ్రైవర్ రవి బస్సును అతివేగంగా నడుపుతూ స్కూటీని ఢీకొట్టాడు. దాంతో పాండురంగాచారికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి పంపించారు. మృతుని కుమార్తె నాగార్జునపు నాగసాయిశ్రీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లోకి డీఎస్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పీసీసీ మాజీ అధ్యక్షులు డి.శ్రీనివాస్ తిరిగి కాంగ్రెస్‌లో చేరారు.ఆదివారం గాంధీభవన్‌లో ఏఐసీసీ ఇన్ ఛార్జీ మాణిక్ రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, మాజీ పీసీసీ అధ్యక్షులు వి.హనుమంతరావు తదితరులు డీఎస్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు జానారెడ్డి, షబ్బీర్ అలీ, అంజన్ కుమార్ యాదవ్, పొన్నాల లక్ష్మయ్య రేణుకా చౌదరి తదితర నాయకులు పాల్గొన్నారు. డీఎస్‌తో పాటు ఆయన కుమారుడు ధర్మపురి సంజయ్, మేడ్చల్ సత్యనారాయణ కాంగ్రెస్‌లో చేరారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి

కంటోన్మెంట్ నాయకులు బీఆర్ఎస్ నేత గ్యారసాని రాంకుమార్ (కంటోన్మెంట్ మాజీ వైస్ చైర్మెన్ గ్యారసాని గౌరీశంకర్ కుమారుడు) కాంగ్రెస్ లో చేరారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

తెలంగాణ గర్వించదగ్గ బిడ్డ నిఖత్ జరీన్

రెండోసారి బంగారు పతకం రావడం పట్ల సీఎం కేసీఆర్ హర్షం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

న్యూఢిల్లీలోని కేడి జాదవ్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ ఫైనల్ పోటీల్లో 50 కిలోల విభాగంలో నిఖత్ జరీన్ స్వర్ణ పతకాన్ని సాధించడం పట్ల ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెను అభినందిస్తూ ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. వియత్నాంకు చెందిన బాక్సర్ న్యూయెన్‌పై 5-0 తేడాతో ఘనవిజయం సాధించి భారత్‌కు మరోసారి స్వర్ణ పతకం సాధించిన నిఖత్ జరీన్ తెలంగాణ గర్వించదగ్గ బిడ్డ అని పేర్కొన్నారు. వరుస విజయాలతో దేశఖ్యాతిని మరోసారి ఆమె ప్రపంచాని కి చాటి చెప్పారని తెలిపారు. ప్రపంచ చాంపియ న్‌షిప్ పోటీల్లో ఆమె కెరీర్‌లో ఇది రెండో బంగారు పతకం కావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. క్రీడాభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ దిశగా కృషిని కొనసాగిస్తూనే ఉంటామని సీఎం పేర్కొన్నారు.

నిఖత్ జరీన్‌కు మంత్రి సత్యవతి రాథోడ్ అభినందనలు

మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం కైవసం చేసుకున్న నిఖత్ జరీన్‌కు మంత్రి సత్యవతి రాథోడ్ అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గౌరవాన్ని చిరస్థాయిలో నిలిచిపోయేలా ఆమె ప్రతిభను కనబరుస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

ఫారెస్ట్ ట్రేక్ పార్కులో పక్షుల వీక్షణ కార్యక్రమం

- ప్రారంభించిన టీఎస్‌టీడీసీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.స్కైలాబ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ, హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని నార్సింగిలో ఫారెస్ట్ ట్రేక్ పార్క్‌లో బర్డ్ వాక్ (పక్షుల వీక్షణ) కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. టీఎస్‌టీడీసీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.స్కైలాబ్ బాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పార్కుకు వచ్చేవారందరికీ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ వైస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ..తాము అభివృద్ధి చేస్తున్న ప్రతి ఒక్క పార్కు కూడా పక్షులు, జంతువులు, లిజర్డ్స్, వీక్షకులకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్థానిక, నీడనిచ్చే జాతుల మొక్కలకు పార్కులో ఎక్కువగా నాటుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎకో టూరిజం ప్రాజెక్టు మేనేజర్ కల్యాణపు సుమన్, రేంజ్ ఆఫీసర్లు లక్ష్మారెడ్డి, మధు, సూపర్‌వైజర్ శ్రీకాంత్, బర్డింగ్ పాల్స్ కళ్యాణ్, విజయ్, స్వాతి. తదితరులు పాల్గొన్నారు.

మహిళా వికలాంగుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి

ఐద్వా ఉపాధ్యక్షులు టి జ్యోతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళా వికలాంగుల రక్షణకోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షులు టి జ్యోతి డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ), తెలంగాణ మహిళా వికలాంగుల సంఘం ఆధ్వర్యం లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ మహిళా వికలాంగులపై జరుగుతున్న దాడులను అరికట్టటంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అసమానతలు, వారి హక్కుల కోసం జరగాల్సిన మహిళా దినోత్సవాన్ని పాలకవర్గాలు తప్పుదారి పట్టిస్తున్నాయ ని చెప్పారు. దేశంలో మహిళలపై వివక్షత మరింత పెరుగుతుందనీ, అందులో మహిళా వికలాంగులపై వివక్షత , లైంగిక వేధింపులు , దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. చట్టసభల్లో మహిళల కు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. గత తొమ్మిదేండ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి మహిళా రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కార్యక్రమంలో తెలంగాణ మహిళా వికలాంగుల సంఘం రాష్ట్ర కోకన్వీనర్ కే నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె. వెంకట్, మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ సాయమ్మ, మహిళా విభాగం నాయకులు సావిత్రి , షైన్ బేగం, లలిత, కుసుమ, సత్తెమ్మ ఉష, సరిత, కోశాధికారి ఆర్.వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు, ఉపేందర్, దశరథ్ నాయకులు భుజంగరెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉద్యోగులను బెదిరించడం తగదు

- పాత పెన్షన్‌ను పునరుద్ధరించాల్సిందే : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలంటూ నిరసన కార్యక్రమాలు చేపడితే కఠిన చర్యలు తప్పవంటూ కేంద్ర ప్రభుత్వం బెదిరించడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అప్రకటిత ఎమర్జెన్సీ, నిరంకుశ పాలనకు నిదర్శనమని ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శతకోటీశ్వరులపై పన్ను విధించాలని కోరారు. దేశంలో పెరిగిన సంపదపై ప్రజలందరికీ హక్కు ఉంటుందని తెలిపారు. హక్కుల కోసం నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన హక్కనీ, దాన్ని కాలరాసే అధికారం ప్రభుత్వాలకు లేదని పేర్కొన్నారు. షేర్ మార్కెట్ జూదం లాంటిదనీ, దాని పెరుగుదల, తరుగుదలను కొన్ని కార్పొరేట్ శక్తులే నియంత్రిస్తాయని వివరించారు. ఇటీవల ఎల్‌ఐసీ డబ్బును అదానీ సంస్థలో పెట్టుబడి పెడితే నష్టాలొచ్చాయని గుర్తు చేశారు. ఆస్ట్రేలియాలో కూడా అదానీ సంస్థలో పెన్షన్ నిధులను పెట్టుబడులు పెడితే అవి తరిగిపోవడంపై ఆ దేశ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారని తెలిపారు. పెన్షన్ డబ్బును షేర్ మార్కెట్‌లో పెట్టడం వల్ల ఉద్యోగులకు భరోసా లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే పాత పెన్షన్ విధానాన్ని పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు పునరుద్ధరించాయని వివరించారు. సీపీఎస్ నిధులను వెనక్కి ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తున్నదని విమర్శించారు. దేశ భక్తులం అని చెప్పే బీజేపీ మాజీ సైనికులకు ఇచ్చే వన్ ర్యాంక్ వన్ పెన్షన్ (ఓఆర్ఓపీ) అమలు చేయడంలోనూ ఇబ్బందులు పెడుతున్నదని తెలిపారు. పాత పెన్షన్ విధానాన్ని దేశమంతా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఓపీఎస్ కోసం ఉద్యమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న డీవోపీటీ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు.

నేడు 'వెన్నెల' ఏసీ స్లీపర్ బస్సులు ప్రారంభం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌ఆర్టీసీలో సుదీర్ఘకాలం తర్వాత 'వెన్నెల' ఏసీ స్లీపర్ బస్సులు ప్రయాణీకులకు అందుబాటులోకి రానున్నాయి. సోమవారం ఎల్బీనగర్‌లో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, టీఎస్‌ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ వీటిని ప్రారంభించనున్నారు. మొదటి విడతగా 16 ఏసీ స్లీపర్ బస్సులను ప్రవేశపెడుతున్నారు. ఇవి కర్నాటకలోని బెంగుళూరు, హుబ్లీ, ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం, తిరుపతి, తమిళనాడులోని చెన్నై రూట్లలో నడుస్తాయి. ఇటీవల కాలం చెల్లి తుక్కు కింద మారిన బస్సుల స్థానంలో 630 సూపర్ లగ్జరీ బస్సులు, 8 నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సులు, నాన్ ఏసీ స్లీపర్ 4 బస్సులను ఆర్టీసీ యాజమాన్యం ప్రారంభించిన విషయం తెలిసిందే. వీటికి ప్రయాణీకుల నుంచి మంచి స్పందన వస్తున్నదనీ, ఈ నేపథ్యంలోనే దూర ప్రాంతాలకు వెళ్లే వారి కోసం అత్యాధునిక హంగులతో కొత్త ఏసీ స్లీపర్ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. ఈ బస్సులకు 'లహరి-అమ్మఒడి అనుభూతి' అని పేరుపెట్టారు. ఈ బస్సుల్లో ఉచిత వై-ఫై సదుపాయం ఉంటుంది. బస్ ట్రాకింగ్ సిస్టం, ప్యానిక్ బటన్ సదుపాయం ఉంటాయి. ఇవి టీఎస్‌ఆర్టీసీ కంట్రోల్ రూంకు అనుసంధానం చేసి ఉంటాయి. 12 మీటర్ల పొడవు గల ఏసీ స్లీపర్ బస్సుల్లో లోయర్ 15, అప్పర్ 15తో మొత్తం 30 బెర్తుల సామర్థ్యం ఉంది. బెర్త్‌ల వద్ద వాటర్ బాటిల్ పెట్టుకునే సదుపాయంతో పాటు మొబైల్ చార్జింగ్ సౌకర్యం ఉంటుంది. ప్రతి బెర్త్ వద్ద రీడింగ్ ల్యాంప్‌లు ఉంటాయి. ప్రయాణికుల భద్రతకు బస్సుల్లో సెక్యూరిటీ కెమెరాల ఏర్పాటుతో పాటు ప్రతి బస్సుకు రివర్స్ పార్కింగ్ అసిస్టెన్స్ కెమెరా కూడా ఉంటుంది. అత్యాధునికమైన ఫైర్ డిటెక్షన్ అండ్ అలారం సిస్టం(ఎఫ్ డీఏఎస్) ఏర్పాటు చేశారు. బస్సులో మంటలు చెలరేగగానే వెంటనే ఇది అప్రమత్తం చేస్తుంది. ప్రయాణికులకు సమాచారం చేరవేసేందుకు వీలుగా పబ్లిక్ అడ్రస్ సిస్టం కూడా ఈ బస్సుల్లో ఉంటుంది.

మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వాలి

- బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్‌ఆర్‌ఐ కో ఆర్డినేటర్ మహేష్ బిగాల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం సాగే పోరాటానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులు మద్దతివ్వాలని బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్‌ఆర్‌ఐ కో ఆర్డినేటర్ మహేష్ బిగాల కోరారు. బీఆర్ఎస్ ఆస్ట్రేలియా మహిళా వింగ్ అధ్యక్షులు సంగీత ధూపాటి ఆధ్వర్యంలో సిడ్నీ లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద మహేష్ రిజర్వేషన్ బిల్లుకోసం మొదటి సారిగాప్రచారాన్ని ప్రారంభించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం దేశవ్యాప్తంగా మహిళలను ఐక్యం చేసి బిల్లు ను సాధిస్తామని బీఆర్ఎస్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు కాసర్ల నాగేందర్‌రెడ్డి తెలిపారు. సిడ్నీలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రాజేష్ గిరి రాపోలు, కన్వీనర్ రవిశంకర్ ధూపాటి , అమ్రీన్, గుల్షన్ ఆర, స్వప్న నెల్లి, పరశరామ్ , అజాజ్, ఇస్మాయిల్, చిరాన్ పురంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నీళ్ళే సమస్త ప్రాణ కోటికి జీవనాధారమనీ, ప్రతీ బొట్టును ఒడిసి పట్టుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో నీటి ప్రాముఖ్యతపై చేపట్టిన జన చైతన్య ప్రచార యాత్రను హైదరాబాద్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలో ఆదివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సు, రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి కవిత్వ ఉత్సవంలో ఆయన మాట్లాడారు. నీటిని సంరక్షిస్తేనే భవిష్యత్తు ఉంటుందనిఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని కోరారు. నీటిని వృధా చేస్తే రేపటి తరాలకు మిగిలేది కన్నీరేనని హెచ్చరించారు.

కాంట్రాక్టు ఉద్యోగులను త్వరలోనే క్రమబద్ధీకరిస్తాం

- ఆర్జేడీసీఎల్ఏకు మంత్రి హరీశ్‌రావు హామీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను త్వరలోనే క్రమబద్ధకరిస్తామని వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి టి హరీశ్‌రావు చెప్పారు. 11,013 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆర్జేడీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (ఆర్జేడీసీఎల్ఏ) అధ్యక్షులు గాదె వెంకన్న నేతృత్వంలో ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి నివాసంలో హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందనీ, కాంట్రాక్టు ఉద్యోగులను త్వరలోనే క్రమబద్ధీకరణ చేస్తామనీ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, లవ్ కుమార్, సంపత్‌కుమార్, సంతోష్‌రెడ్డి, పున్నారావు, సత్యనారాయణ, నర్సింలు, విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నామరూపాల్లేకుండా పోవడం ఖాయం

నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- ఆమనగల్లులో హాత్ సే హాత్ యాత్ర ప్రారంభం



నవతెలంగాణ-మిర్యాలగూడ

1978 సంవత్సరంలో జనతా సర్కార్.. ఇందిరాగాంధీని పార్లమెంట్ నుంచి బహిష్కరించి.. నామరూపాలు లేకుండా పోయిందని, ఇప్పుడు రాహుల్‌గాంధీపై పార్లమెంట్‌లో అనర్హత వేటు వేసిన బీజేపీ ప్రభుత్వానికి కూడా అదే గతి పడుతుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలో ఆదివారం మిర్యాలగూడ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ బీఎల్ఆర్ చేపట్టిన జోడో యాత్రను ఎంపీ ప్రారంభించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. దేశంలోని అన్ని కులాల, మతాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, దేశం అభివృద్ధి చెందాలని, విద్వేషాలు విడనాడి.. సద్భావంతో ఉండాలనే లక్ష్యంతో రాహుల్‌గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 3500 కిలోమీటర్లు జోడో పాదయాత్ర చేశారని చెప్పారు. ఆ యాత్రకు కొనసాగింపుగా బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలను గ్రామగ్రామాన ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వివరించాలనే సంకల్పంతోనే నియోజకవర్గాల్లో జోడోయాత్రలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ జాతీయ సంపదను అదానీకి అప్పనంగా అప్పగించిన అవినీతిని పార్లమెంట్‌లో ప్రశ్నించినందుకే రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేశారని ఆరోపించారు. గుడి సాక్షిగా చెబుతున్నా.. 2024లో రాహుల్‌గాంధీ దేశ ప్రధాని అవుతారని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి జోడోయాత్ర ప్రారంభోత్సవానికి ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఎల్ఆర్, ఎంపీపీ సునీత కృష్ణయ్య నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, రామలింగయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తమ్మడబోయిన అర్జున్, పొదిల శ్రీనివాస్, చిలుకూరి బాలు, నూకల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నేడు, రేపు రాష్ట్రవ్యాప్త నిరసనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. లీకేజీపై సోమ, మంగళవారాల్లో రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. లీకేజీకి కారణమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేయాలని సూచించారు. లీకేజీకి కారణమైన కమిషన్ ఉద్యోగులను శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

నవతెలంగాణ-ఇల్లందు



స్థానిక జగదంబ సెంటర్ ఏరియాలో ఆదివారం రాత్రి 10:30 గుర్తుతెలియని వాహనం డి కొట్టడంతో సాయి తివారి అనే యువకుడు మృతి(25) మృతిచెందాడు.

నాగమణి బేకరీ వెనకాల గల వ్యక్తి పని నిమిత్తం బయటికి వెళ్లి ఇంటికి వస్తున్న క్రమంలో గవర్నమెంట్ హాస్పిటల్ వైపు నుంచి వస్తున్న వాహనం ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. తల్లి గృహిణి, తండ్రి హోటల్లో పనిచేస్తున్నాడు. సంఘటన స్థలానికి తల్లి రజిత, తండ్రి ఉమా శంకర్ చేరుకుని బోరు విలపించారు. అరుపులు, ఏడుపులతో ప్రాంతం ద్దరిల్లింది. పోలీసులు యువకున్నిఢీకొన్న వాహనం లారీని పట్టుకున్నట్లు సమాచారం.

సంపుదు పందెం...

మా పేదరికాన్ని కన్నీళ్లతో ఉతికి
దండెం మీద ఆరేత్తే
శిల్మువట్టి శీకిపోయిందని తెల్లగ్గాలే.....
మా బొక్కలన్నీ అరిగేటట్లు
ఏండ్ల సంది కట్టం సేస్కచ్చిన
ఆఖరికి అరుగుబండే మిగిలిందని
పెంకుటిల్లు పెద్దగ్గాలే....
మా బతుకు మెతుకుల్ని పొయ్యి మీద ఉడికిత్తే
అడుగంటి మాడిపోవుడే గానీ
దగ్గరవడి కడుపు నిండింది లేదు.....
మా పేదరికం ఆకాశమంత పెద్దగుంటది...
కానీ ఇంటికత్తే సాపేసి
కూకోవెట్టలేనంత జాగుండదు....
తలక్కాయెత్తి
లోపలికి పోయేంత గల్మలుండవు....
గోడకానుకొని కూకుంటే
సున్నం బిచ్చలు వీపుకత్తుకుంటవ్...
సుట్టాలింటికత్తే
ఇద్దరు సుక్కలు లెక్కవెట్టుకుంట
ఆవల పండాలే....
జోలె వద్ద సుల్కమంచం
భూమికి తాకి మా పేదరికాన్ని ఎక్కిరిచ్చిన...
మా దిగుట్ల గల్లగురిగి
కడుపు నింపుడైతే మర్శిపోము....
గోడకు సున్నమేసినట్లు
మా మాశిన పేదరికానికి కూడా
సున్నవేసుడుంటే మంచిగుండు...
పచ్చీసాటల సంపుడువందెం ఉన్నట్లు
పేదరికాన్ని సంపి
పెద్దింట్లకి పోవుడుంటే మస్తుండు.....
తాత వెట్టిన వేపసెట్టు
పెరిగి పెద్దగయిందని.....
తాతల నాటి తప్కుల సంసారం
అట్లనే ఉన్నది...
తడకలు వోయ్ పర్దలు తేలినయని...
రూపాయి బిళ్ళ పది రూపాయలు కాలే...
పేదోళ్ళకు "పేదరికం" బంకవట్టినట్లే వట్టుకుని...
సచ్చినంక బూడిదై కర్మ రోజు
కాకి కడుపు నింపుడు వరకేనని...
మా గల్లగురిగి మాత్రం నిండిది లేదు.....

– తుమ్మల కల్పన రెడ్డి, 9640462142

ఒంటరి బతుకు ..

మా ఊరి పాత చెరువు గట్టు మీద మామిడి చెట్టు
ఉగాది వచ్చిందంటే చాలు, ఊరు ఊరంతా
ఊరపిచ్చుకలై కొమ్మ కొమ్మకు వాలిపోతారు
మామిడాకుల తెంపులాటలు, పిందెలకై పోటీలు,
కాయల కోసం కొట్లాటలు
ఏడాదంతా ఎడారిలా ఒంటరి వేదనతో తను...
ఉగాది రోజు – బిడ్డల చేతిలో దోపిడీకి
గురవుతున్న సంవేదనగా తను...
ఐతే మాత్రం, ఆ రోజంతా తన ఊరితో పండగ సందడే తనకు–
తిరిగి ఏడాదంతా ఒంటరి బతుకు,
ఐనా –
తల్లిలా – పిల్లల గారాబాలు, మారాములు చూసి మళ్ళీ ఉగాది వరకు
సరిపడా ఆత్మీయతను గుండెల్లో నింపుకొని,
వసంతానికై ఆశలను కళ్ళలో ఒంపుకుని
మరో ఏడాది నిరీక్షణ

***

– డా. రూప్‌కుమార్ డబ్బీకార్
99088 40186

ఎద్దు కాలిగిట్టల శబ్దం

మూలసుక్క పొడిసిపొడవంగానే
మా పల్లెలో
కట్టెల పొయ్యి మీద
రొట్టెల సప్పుడు కునుకుబట్టిన చెవులకు
డప్పు సప్పుడైతది.

గొరుకొల్లు పడమట పందిరేయ్యగానే
పొలంబాట పట్టిన
ఎద్దుల కాలిగిట్టెల శబ్దం
మా పల్లెను నిద్రలేపుతుంది.

తూర్పు కొండల నుండి కరకరమంటూ
పొద్దు పొడసూపగానే
నెత్తిమీద సద్ది సంకలో సంటిపిల్లగానితో
పాద జాడలవెంట మ్యాకపిల్లలు
నడుస్తూ అడవితల్లిని నిద్రలేపుతాయి.

సద్దసేన్లో కలుపుదీయాలనో
పత్తి మొగ్గలు తీయాలనో
మా పల్లెతల్లులు సేనుసేనుకాడ
ఇరగగాసిన జొన్నకంకులౌతారు.

గింజుకోని గంజితాగి
పొద్దంతా తల్లిపిల్ల ఎంత రయ్యమైన
చేస్తున్న పనిని కష్టమనుకోకుండా
పొద్దుతిరిగినట్లు తిరిగే పొద్దుతిరుగుడు పువ్వులౌతారు.

బంధాల మీద ప్రేమ కలిగి
సుట్టమొచ్చిన పట్టమొచ్చిన
కట్టుకొచ్చిన సద్దిలనే నెత్తికింత పంచుకొని తింటరు.

సంటిపిల్లలుంటే
యాప కొమ్మలకు కట్టిన పాతచీరలో
పిల్లలు పొర్లుతుంటే గాలి దేవుడొచ్చి
ఊయలూపి మట్టిబిడ్డలమీద మమకారం చాటిపోతడు.

ఇంటి వాకిట్లో
ఇరుసులిరిగిన బండిలా
ముసలి పాణాలు
పల్లెకు దిక్కుదివానమౌతాయి.

నాగలి కర్రు పొలం దున్నినట్లు
కొడవలి వరికంకులను కోసినట్లు
శ్రమజీవుల దేహం నుండి చెమట చుక్కలు
ఆకాశం నుండి కురిసే వానచినుకులౌతాయి.

అందరికీ నుదుటన రాతవుంటే
ఒక్క రైతుకు మాత్రం
కందిపోయిన అరచేతుల్లో జీవిత అద్దం కనిపిస్తుంది.

– అవనిశ్రీ, 9985419424



సాహిత్యపు అస్తిత్వాన్ని చూపే దర్పణమే

'తెలుగు సాహిత్యం-మరో చూపు'

– ఎం.కురుమయ్య యాదవ్, 7799553493




20వ శతాబ్దపు పూర్వ భాగం దాకా సాహిత్యాన్ని కేవలం "శైలి, అలంకారం, రసం" మొదలైన కళాత్మక విలువల దృష్ట్యా మాత్రమే పరిశీలించడం జరుగుతూ వస్తున్నది. దానివల్ల సాహిత్యం ప్రామాణికతకు కొంత దూరమైంది. దీనిని పరిగణలోకి తీసుకొని "సామాజిక, రాజకీయ, చారిత్రక" భూమికతో తెలుగు సాహిత్యాన్ని పరిశీలించాలనే దృక్పథంతో రంగనాథాచార్యులు రాసినదే "తెలుగు సాహిత్యం – మరో చూపు" అన్న రచన. ఆనాటి సాహిత్య చరిత్రకు ఆవల ఉన్న వాస్తవిక సాహిత్య చరిత్రను చూపే దర్పణమే ఈ "తెలుగు సాహిత్యం- మరో చూపు" అన్న రచన. వీరు సాహిత్యాన్ని అందరు విమర్శకుల లాగా భావజాలం లక్షణ నియమాల ఆధారంగా కాక సాహిత్యంపై గల దేశ కాల, మత, ఆర్థిక సామాజిక వాస్తవిక అంశాల ప్రభావం దృష్ట్యా పరిశీలించారు.

ఒక భాష విశిష్టతను, గొప్పతనాన్ని తెలిపేది ఆ భాషలో వెలిసిన సాహిత్యమే. సాహిత్యం అంటే సంస్కృతిని ప్రతిబింబింపచేసేది అని అర్థం. ఒక జాతి, దేశ, సంఘం జీవన విధానాలు, వారి ఆచార వ్యవహారాలు, సామాజిక–ఆర్థిక స్థితిగతులు, కట్టుబాట్లు, కళలు మొదలగు అన్నింటి సమన్వయమే సంస్కృతి. అటువంటి సంస్కృతికి రూపం ఇచ్చి, వాటిని భద్రపరిచి, భవిష్యత్ తరాలకు సజీవంగా అందించేది సాహిత్యం మాత్రమే.

ముఖ్యంగా ఆ కాలం నాటి భారతదేశంలోని ప్రాంతీయ భాషా సాహిత్యాలు ఆస్థాన, ఆస్థానేతర సాహిత్యాలుగా అభివృద్ధి చెందాయి. ఆస్థాన సాహిత్యం ఫ్యూడల్ వ్యవస్థకు అనుకూలమై, దానిని బలపరచడానికి ఉపయోగిస్తే, ఆస్థానేతర సాహిత్యం ఫ్యూడల్ వ్యవస్థను, దాని కనుకులమైన కుల వ్యవస్థనూ వ్యతిరేకిస్తూనో, భక్తి సాహిత్యంగానో జనంలో వ్యాపించింది. ఆయా ప్రాంతాలకు సంబంధించిన ప్రత్యేకమైన చారిత్రక కారణాల వల్ల, ఫ్యూడల్ వ్యవస్థ ప్రభావం వల్ల కొన్ని భాషల్లోని లిఖిత సాహిత్య చరిత్రలో ఆస్థాన సాహిత్యానికి ప్రాధాన్యం ఏర్పడగా, కొన్ని భాషల్లో ఆస్థానేతర సాహిత్యానికి సమప్రాధాన్యం, మరికొన్ని చోట్ల అధిక ప్రాధాన్యం కనబడుతుంది. ఆస్థాన సాహిత్యానికైనా, ఆస్థానేతర సాహిత్యానికైనా మతమే ప్రధాన ప్రాతిపాదికగా కనిపిస్తుంది.

ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి సంబంధాల్లో కాలక్రమంలో వచ్చిన పరిణామాన్ని చెప్పటమే దేశ చరిత్ర అయితే, ఆ సంబంధాలు సాహిత్యంలో ఎలా ప్రతిబింబించాయో, దానికనుగుణంగా సాహిత్య రూపాలు ఎలా సంతరించుకున్నాయో చెప్పటమే సాహిత్య చరిత్ర. శిష్ట సాహిత్య రూపాన మనకి అందుబాటులో ఉన్న ఈ సాహిత్యం సాహిత్య చరిత్ర నిర్మాణానికి ఎంతవరకు ఉపకరిస్తుందో చెప్పటం కష్టమే. ఎందుకంటే ఆనాటి సంస్కృతిలో ఆధ్యాత్మిక విలువలు ప్రధానంగా ఉండి మతం, తత్వం, చట్టం, సాహిత్యం, సంగీతం, చిత్రకళ మొదలగు ఉపరితల విషయాలన్నింటిలోనూ ఆధ్యాత్మికతే ప్రతిబింబిస్తుందనే ఒక అభిప్రాయం కలదు. కానీ సంస్కృతి అంటే ఒక సమాజపు సంపూర్ణత్వాన్ని విశదీకరించగలగాలి. ఇది సగటు మానవుని సామాజిక, వాస్తవిక జీవన పరిస్థితులను, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, నమ్మకాలు, భావజాలం వంటి మౌలికాంశాలన్నింటి మధ్య గల సమన్వయ చిత్రీకరించగలగాలి. తొలినాళ్ళలో సాహిత్యం మత ఆధిపత్యంకు లోనైతే, తర్వాతి కాలంలో ఆర్థిక ఆధిపత్యానికి గురవ్వాల్సి వచ్చింది. ఆర్థిక ఆధిపత్యం మతం కంటే బలవత్తరమైనది.

ఒక విషయాన్ని అభివ్యక్తీకరించే పద్ధతిలోని కళాత్మక విలువలను బట్టి ఒక రచనను సృజనాత్మక రచన అని సాహిత్య రచన అని వర్గీకరిస్తారు. సృజనాత్మక రచనలో కేవలం రసానుభూతి,భావనశక్తి మాత్రమే ప్రధానంగా ఉంటాయి. సాహిత్య రచన అనేది సంస్కృతిని, సామాజిక అంశాలను మిళితం చేసిన సృజనాత్మక రచన. ఇందులో రసానుభూతి, భావనశక్తితో పాటు సమకాలీన సామాజిక స్పృహ, వాస్తవిక త వంటి అంశాలు అంతర్లీనంగా ఉంటాయి. సాహిత్య చరిత్ర రచనలో సింహభాగం ఇవ్వాల్సింది సాహిత్య రచనావళికే కానీ సృజనాత్మక రచనలకు కాదు. అయినప్పటికీ ఒక విషయాన్ని అభివ్యక్తీకరించే పద్ధతిని,రచన రూపాన్ని నిర్ణయించేది కవి సాంఘిక అస్తిత్వం, కవి ఆశించే ప్రయోజనం మాత్రమే. నన్నయ మహాభారతంను తెలుగులోకి అనువదించాలనుకున్నప్పటికీ అందులో సంస్కృత ప్రభావం, బ్రాహ్మణ మత ధర్మాలు గల ఒక లౌకిక కావ్య అంశాలు అధికంగా కనిపించడానికి కారణం ఆనాటి సమాజంలో అధికంగా గల సంస్కృత భాష, వర్ణ వ్యవస్థ ప్రభావమే. శివకవి యుగంలో వచ్చిన అనుభవ సాహిత్యం, దేశి సాహిత్యం, వీరశైవ మత ప్రభావం ఫలితంగానే పాల్కురికి సోమన్న తన రచనలలో దేశీయతను, అచ్చ తెలుగును పరచగలిగారు. అంతేకాక బసవ్వ వంటి సామాన్య వ్యక్తులను కన్నప్ప వంటి అటవీకులను, గంగిరెద్దులవారు మొదలగు జానపద కళాకారులను కథా వస్తువులలో భాగంగా ఎంచుకోవటం, సమాజంలోని అస్పృశ్యతను, వర్ణ వ్యవస్థను నిరసించడం వంటివి వారు ఆశించిన సంస్కరణ తత్వ ప్రయోజనాన్ని వెల్లడిస్తున్నాయి.



ఒక సాహిత్యంలోని మౌళిక సాహిత్య గ్రంథాలను సామాజిక విపరిణామం దృష్ట్యా పూర్తిగా వదిలేయాల్సిన అవసరం లేదు. దానిని చూసే దృష్టిని మార్చుకుంటే సరిపోతుంది. అందులో సమకాలీన సమాజానికి/ సాహిత్యానికి అవసరమైన అంశాలను వెతుక్కోగలగాలి. చారిత్రక ఆధారాలు, గ్రంథాలు లభించిన సందర్భాలలో ఈ సాహిత్య గ్రంథాలే చరిత్ర రచనకు/ఆనాటి ప్రజల జీవన విధానంను తెలుసుకోవ డానికి ఉపకరిస్తాయి.

"జొన్న కలి జొన్న యంబలి
జొన్నన్నము జొన్న పిసరు జొన్నలె తప్పన్
సన్నన్నము సున్న సుమీ
పన్నుగ బల్నాటి సీమ ప్రజలకు నెల్లను".

పై శ్రీనాధుని పద్యాన్ని చదివితే ఆనాటి ప్రజల ఆహార విధానాలు, వారి జీవన శైలి మనకు ప్రస్ఫుటంగా కనబడుతుంది.

సురవరం ప్రతాపరెడ్డి రాసిన ఆంధ్రుల సాంఘిక చరిత్ర అన్న గ్రంథానికి ఉపయుక్త ఆధారం ఆనాటి కొఱవి గోపరాజు రాసిన సింహాసన ద్వాత్రింశిక అన్న గ్రంథమే.

కవి తాను నివసిస్తున్న సమాజం, నాటి పరిస్థితులు, తాను ఎంచుకున్న సాహిత్య రచనకు మధ్య గల పరస్పర వైరుధ్యాలు కవిని నిరంతరం వెంటాడుతుంటాయి. తన కాలంనాటి సమాజం ఒకరకంగా ఉంటే తాను కోరుతున్నది, సాధించాలని ఆశిస్తున్న సిద్ధాంతాలు, భావాల మధ్య వైరుద్యాలు అతని లక్ష్యాన్ని కొంత అయోమయానికి గురి చేయవచ్చు. ఈ వైరుధ్యాలను గుర్తించి వేరు చేయగలిగినప్పుడే తన లక్ష్యానికి పరిపూర్ణత చేకూర్చగలరు.

పాల్కురికి సోమన్న దేశీ మార్గమని ద్విపదను అనుసరించినా, తొమ్మిది రసములు కొలుకాడు దాని, యిమ్మడి వర్ణన లెసగంగ ద్విగుణమగు నలంకారం బులసలారు దాని, దిగునార్థ భావములు దీటుకొనంగ అని సంస్కృత అలంకార శాస్త్ర మర్యాదల్ని పేర్కొనకుండా ఉండలేకపోయారు. అల్పాక్షరముల ననల్పార్థ రచన, కల్పించుటయే కాదే కవి వివేకంబు అంటూనే అలాంటి రచన చేయలేక పోయాడు. జాను జానుగు ప్రసన్నతకు కారణం అంటూనే సంస్కృత భూయిష్టమైన పండిత భాషనే వాడాడు. సమకాలంలో కవి అస్తిత్వం పైన ఆధారపడిన భావజాలం అందులో కనిపించే వైరుధ్యాలు సాహిత్యంలో ఎలా ప్రతిబింబిస్తాయో, సాహిత్య రూపాన్ని నిర్ణయించడంలో ఎలా ప్రధాన పాత్రను వహిస్తాయో చెప్పడానికి సోమన సాహిత్యం ప్రధాన నిదర్శనం.

> పాల్కురికి సోమన్న దేశీ మార్గమని ద్విపదను అనుసరించినా, తొమ్మిది రసములు కొలుకాడు దాని, యిమ్మడి వర్ణన లెసగంగ ద్విగుణమగు నలంకారం బులసలారు దాని, దిగునార్థ భావములు దీటుకొనంగ అని సంస్కృత అలంకార శాస్త్ర మర్యాదల్ని పేర్కొనకుండా ఉండలేకపోయారు. అల్పాక్షరముల ననల్పార్థ రచన, కల్పించుటయే కాదే కవి వివేకంబు అంటూనే అలాంటి రచన చేయలేక పోయాడు. జాను జానుగు ప్రసన్నతకు కారణం అంటూనే సంస్కృత భూయిష్టమైన పండిత భాషనే వాడాడు.

తెలుగు లిఖిత సాహిత్యం ప్రధానంగా ఆస్థాన సాహిత్యంగా, పండిత సాహిత్యంగా మొదలైనప్పటికీ ఆధునిక కాలంలో సామాజిక విలువలు, సమ సమాజ స్థాపనే ప్రధాన భూమికగా పరిణతి చెందింది. ఒక దశలో చాలా కృత్రిమంగా పరిణమించినా ఆస్థాన సాహిత్యంలోనూ కళా విలువలు ఉన్నతంగా రూపొందిన మాట కాదనటానికి వీల్లేదు. మధ్యలో సామాన్యుల కోసం శివకవులు తీర్చిదిద్దిన దేశీ కవిత్వం, అచ్చ దేశీయమైన భాషలో, జానపద బాణీలలో గీతాలు, కీర్తనలు రాసిన అన్నమయ్య వంటివారు, నిజమైన ప్రజాస్వామిక నిర్మాతలైన వేమన, వీరబ్రహ్మం వంటి వారు ప్రాచీన సాహిత్యంలోనూ ఆధునిక సంస్కరణ భావాలనీ తీర్చిదిద్దారు.

సమాజం–సాహిత్యం రెండు పరస్పర ఆధారితాలు. వ్యక్తులనే కాదు సమూహాలను, సమాజాలను సైతం ఆకర్షించగల శక్తి ఒక్క సాహిత్యానికే ఉంది. అందుకే శివకవులు, అన్నమయ్య, వీరబ్రహ్మం, వేమన వంటి వారు తమ భావజాల ప్రసరణకు సాహిత్యాన్నే మాధ్యమంగా ఎన్నుకున్నారు. అంతే కాదు వేమన, తిక్కన, గురజాడ కందుకూరి వంటి ఎంతో మంది కవులు సమాజంలోని అసమానతలు, కుల మత భేదాలను, లింగ అసమానతలు నిర్మూలించడానికి, తమ సంస్కరణ వాదానికి సాహిత్యాన్నే ఆయుధంగా మలుచుకున్నారు.

ఎందుకంటే సాహిత్యం మనసుకు మత్తుమందు చల్లడమే కాదు, సమాజానికి శస్త్ర చికిత్స చేయగలరు......!!

కవి కవిత్వంలో దొరుకుతాడు. కవిత్వం అంటేనే అంతరంగ ఆవిష్కరణ. ఓ భావోద్వేగ ప్రకటన. నిర్ద్వంద్వమైన ఓ ధిక్కార నిరసన. దేవరాజు మహారాజు కవిత్వం 'జన్యులిపి' లో ఇవన్నీ పుష్కలంగా దొరుకుతాయి.

సమాజపు డి.ఎన్.ఏ. - జన్యులిపి

– కె.శాంతారావు, 9959745723



2021 కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అయిన డా॥ దేవరాజు మహారాజు ఈ సమాజపు డి.ఎన్.ఎ నే 'జన్యులిపి' గా పాఠకులకు అందించారు. ఓ తాత్విక, హేతువాద, విజ్ఞాన శాస్త్ర రచయితగా దేవరాజు తెలుగువారికి సుపరిచితులు.

కవిత్వమే జీవ రహస్యమైతే / జీవ రహస్యమే కదా విజ్ఞానం / గుండెను పట్టుకోవడం జ్ఞానం అయితే / గుండె చప్పుడు వినగలగడమే కవిత్వం అని 'జీవ – జీవన రహస్యాలు' తెలుపుతారు.

గాలులు, కెరటాలు ఎవరికీ లొంగవని / గాలి ఎవరి పిడికిలిలో ఖైదీగా ఉండదని / దేశవ్యాప్తంగా సాగిన రైతు ఉద్యమాన్ని బలపరుస్తారు.

'వైరస్ – ఛాయ్‌వాలా లాగా వచ్చి / మన ఛాయ్ మనల్ని తాగనివ్వదు వైరస్ పోవడానికి దేశాన్ని శానిటైజ్ చేద్దాం' అని పిలుపిస్తారు.

'రచయితల హత్యలు / మేధావులపై దొంగ కేసులు / దొంగల రుణాల మాఫీ / వలస కూలీల బలులు / అణగారిన వర్గాలపై అఘాయిత్యాలు / హిందూత్వ ఎజెండా / సబ్ సాకాత్ సబ్‌కా వికాస్/ మిత్రో – జై శ్రీరామ్' అంటూ ఓ ఫ్లోలో ఆత్మనిర్భర్ భారత్‌ను వ్యంగ్యీకరిస్తారు.

తన క్రియా శూన్యత్వాన్ని / గంభీరోపన్యాసం కింద దాచేవాడే కదా / నేటి 'ప్రధాని' వక్త / అని 'మన్ కి బాత్' అర్థం వివరిస్తారు.

పిచ్చివాడా! నువ్వు అర్థం చేసుకుంటే / నిజాన్ని మించిన అందంలేదు / విజ్ఞానాన్ని మించిన కవిత్వం లేదు అంటూ 'హృదయంలో మేధస్సు'ను వర్ణిస్తారు.

మృత్యువు అంటే అభద్రత / మృత్యువు అంటే డబ్బు కూడబెట్టడం / అని చెబుతూనే ఎవరైనా కాస్త మృత్యువును వెదికిబెడతారా? అని 'బతుకు బాట'ను శోధిస్తారు.

అక్షరమే నా అస్తిత్వం / అక్షరమే నా బలం బలగం / అంటూ జనం కళ్ళతో స్పృశించే ప్రతి అక్షరానికి తిరుగే ఉండదని చాటుతారు.



ఏ ఆకృతి లేని చిన్న బండరాయిని / తొలిచి రూపం ఇచ్చేవాడు శిల్పి అయితే / అదీ అంతంలేని విశ్వాంతరాళాన్ని మానవ శ్రేయస్సు కోసం / నిరంతరం తొలుస్తున్నవాడు ఇంకా ఎంత పెద్ద శిల్పి? అంటూ శాస్త్రవేత్తను – కళాకారుణ్ణి సమాంతరంగా సమోన్నతస్థితిలో నిలబెడతారు.

ఇలాంటివి ఈ పుస్తకంలో ఏభై కవితా ఖండికలు ఉన్నాయి. గత అరు దశాబ్దాలుగా సాగిన వారి సారస్వత కృషిలో విభిన్న ప్రక్రియలకు సంబంధించి డా॥ దేవరాజు 87 గ్రంథాలు రాసారు. విభిన్న భాషల కవిత్వాన్ని, కథలను అనువదించి తెలుగు పాఠకులకు అందించారు. ప్రముఖ అనువాదకులు దండమూడి మహీదర్ వారిని అభినవ కొ.కొ. గా అభివర్ణించారు. ఇప్పుడు ఈ 'జన్యులిపి' కవిగా దేవరాజును పరిచయం చేస్తుంది.

ఆమె నిశ్శబ్దం

కథలెన్నింటినో చెబుతుంది
ఏకకాలంలో
విషాద సౌందర్యభరితాలైన
అమె నయనాల వలెనే !!

అతడు రాస్తాడు
తాను రాసే ప్రతి పదంలో
వెతికే ప్రేమ అమేనని !!

ఆమె కన్నుల్లో లిపి లేని
ఒక భాష దాగుంది
చదవగలిగితే సుదూరాన ఉన్న చుక్కల్తోనూ
మాట్లాడే నేర్పు నీకలవడుతుంది !

ఆమెకో చక్కని తోటుంది
తన హృదయంలో
నీ కోసమే నాటిన
నీ కొరకే వికసించే గులాబీల తోట !!

ఆమె తానెప్పుడూ
పాడుకునే గీతం ఒకటుంది
అర్ధరాత్రి నక్షత్రాలు
వేసవి వాన కలిపి
బాణీ కూర్చిన పాట అది

– హిమజ, 94414 92737

సాహితీ వార్తలు

కవితలకు ఆహ్వానం

విజయవాడ సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో 2022 ఏడాదిలో ఇ పత్రికలలో మాత్రమే ప్రచురితమైన కవితలను ఆహ్వాని స్తున్నారు. వీటన్నింటితో కలిపి సంకలనంగా తీసుకురానున్నారు. ఆసక్తి కలిగిన వారు ప్రచురితమైన కవితల ఫొటో కాపీలను పీడీఎఫ్ లేదా జేపీజీ ఫార్మాట్‌లో మార్చి 31లోగా editor.kavitha2022@gmail. com మెయిల్ ఐడీకి పంపవచ్చు. వివరాలకు 9490634849 నంబరు నందు సంప్రదించవచ్చు.

వేమూరి బలరామ్ 'స్వాతి చినుకులు' గ్రంథానికి పురస్కారం

జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, సినీ దర్శకులు, నవలా రచయిత డా॥ప్రభాకర్ జైనీ తన తండ్రి పేరుతో ఇస్తున్న 'లక్ష్మీనారాయణ జైనీ జాతీయ పురస్కారం' ఈ ఏడాది 'స్వాతి' సంస్థల అధినేత వేమూరి బలరామ్ రాసిన 'స్వాతి చినుకులు' గ్రంథానికి ఇవ్వనున్నారు. ఈ పురస్కార సభ మార్చి 30న గురువారం సాయంత్రం విజయవాడ, గాంధీనగర్ లోని హోటల్ ఐలాపురం ఏసీ ఆడిటోరియంలో నిర్వహిస్త న్నారు. ఇదే వేదికపై 'స్వాతి బలరామ్.. అతడే ఒక సైన్యం' బలరామ్ బయోపిక్ చిత్రం షూటింగ్ ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. వివరాలకు 9246415150 నందు సంప్రదించవచ్చు.

కథల పోటీకి ఆహ్వానం

న్యూ పూనేలోని తెలుగు భాషా వికాస పరిషత్ ఆధ్వర్యంలో కథల పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహు మతులుగా రూ.60,000/-, రూ.40,000/-, రూ.20,000/- అందివ్వనున్నారు. కథలు పంపాలనుకునే వారు డి.టి.పిలో 4 పేజీలు మించకుండా ఏప్రిల్ 30 సాయంత్రం 6 గం॥ లోపు mvsmurthypolice@gmail. com మెయిల్‌కు పంపవచ్చు.

31న 'ఊహలకే ఊపిరొస్తే' ఆవిష్కరణ

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, హైదరాబాద్ పాతనగర కవుల వేదిక, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో కె.హరనాథ్ "ఊహలకే ఊపిరొస్తే" కవితా సంపుటిని ఈ నెల 31న శుక్రవారం 10.30 గం.ని.లకు రవీంద్రభారతి సమావేశమందిరం మొదటి అంతస్తులో నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా టిఆర్ఎస్ ఎమ్మెల్సీ సురభివీదేవి హాజరై పుస్తకావిష్కరణ చేయనున్నారు. విశిష్ట అతిథిలుగా రాజధాని బ్యాంక్ చైర్మన్ వేమిరెడ్డి నరసింహారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరి గౌరీశంకర్, నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిటీ తెలంగాణ స్టేట్ వైస్ ఛైర్మన్ డా॥ కారుకాల అనితారెడ్డి, ఆత్మీయ అతిథులుగా మామిడి హరికృష్ణ, పులిపాక సత్యమూర్తి, సుధామ తదితరులు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఆశల పల్లకివై వస్తావని...

నల్లతాచు నిను తొంగిచూస్తుంది..
నీ కురులు తనలా ఎందుకున్నాయని.

ఎర్రని మందారాలు నీ అధరాలను
అదే పనిగా గమనిస్తున్నాయి.

వీస్తున్న గాలి నిను వాటేసుకుని..
నీ చుట్టే తిరుగుతుంది.

నువ్వు పాదం మోపిన నేల.
నీ అడుగుల శబ్దాన్ని వింటూ మైమరచిపోతుంది.

నీ అందాన్ని చూసి రంగుల సీతాకోకచిలుక..
మకరందంలా నిను జుర్రుకోవాలని..కళలుకంటుంది

నయాగార జలపాతం ..
నీ నడుము ఒంపులనిచూసి..
క్షణకాలం అలా నిలబడి చూస్తుంది.

నీ నడకనుచూసి...
నదులన్నీ నీ వెంటే పరుగులు తీస్తున్నాయి.

రవికిరణాలు నీ అందమైన తనువును తాకి..
చల్లని మంచుగడ్డలై పోతున్నాయి.

వెన్నెల వర్షం కురిపిస్తున్న నెలవంక
నీ చామనలుపు దేహానికి వెండిరంగులు అద్దుతుంది.

చీకటిలో నువ్వు మిణుగురులా మెరుస్తుంటే..
మిణుగురుసైతం ప్రకాశించడం మర్చిపోతుంది.

బంతిపువ్వుల గుంపంతా..
నీ నల్లని కురులలో ఒదిగిపోవాలని చూస్తున్నాయి.

చెలీ.. నా మనసు తలుపులు తెరిచి నిన్నే చూస్తున్నాను.
ఆశల దీపానివై వచ్చి..
తోడునీడవై ఉంటావని.

– అశోక్ గోనె, 9441317361

వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



మండల పరిధిలో గోళ్లపాడు - పోలేపల్లి యూత్ ఆధ్వర్యంలో గోళ్లపాడు, పోలే పల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, సుడా డైరెక్టర్ సంజీవరెడ్డి, గోళ్లపాడు సర్పంచ్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ బీమా చెక్కును అందజేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని ముగ్గు వెంకటాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ ముల్లంగి ముత్తారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా పార్టీ సభ్యత్వం ఉండడంతో 2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఆదివారం స్వగృహానికెళ్లి వారి సతీమణి రాధాకు సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పాలెపు రామారావు, జడ్పీటీసీ కట్టా అజయ్ కుమార్, ఎంపీపీ బీరవల్లి రఘు, మండల రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు లక్కినేని రఘు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావు, మండల పార్టీ కార్యదర్శి. కొరకొప్పు ప్రసాద్, బొప్పన రామారావు, గ్రామ సర్పంచ్ కొవ్వారపు విజయరావు, మాజీ జడ్పిటిసి మేకల కృష్ణ, సొసైటీ డైరెక్టర్ కట్ట ఆర్లప్ప, నానాజీ, సోషల్ మీడియా మండల అధ్యక్షులు సిహెచ్ కిరణ్ కుమార్, ఎస్టీ సెల్ మండల నాయకులు అజ్మీర జములయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు మహేష్, బానోత్ కృష్ణ, ప్రముఖ న్యాయవాది పప్పుల రత్నాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ కొట్టాలి

కేసిఆర్ వల్లే అన్ని విధాల అభివృద్ధి



- తెలంగాణ పథకాలు దేశంలో ఎక్కడా లేవు
- కేవలం 8ఏళ్లలోనే ప్రజల జీవన శైలిలో మార్పు
- పార్టీయే ఇంత పెద్ద కుటుంబాన్ని ఇచ్చింది
- బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ

నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్రంలో పార్టీ మూడవ సారి హ్యాట్రిక్ కొట్టాలని, అందుకు కార్యకర్తలు శక్తివంచన లేకుండా కషి చేయాలని, ఇప్పటి వరకు మనం చేసిన అభివృద్ధిని ప్రజలకు చెప్తేనే చాలు అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ చేపడుతున్న సంక్షేమం పథకాల వల్లే నేడు తెలంగాణ అన్ని విధాల అభివృద్ధి చెందిందని అన్నారు. ఆదివారం ఖమ్మం నగరం దోరేపల్లి ఫంక్షన్ హాల్ లో బిఆర్ఎస్ పార్టీ టూ టౌన్ కమిటీ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులను ఇక్కడ ఓ పండుగ వాతావరణంలో ఇంటిల్లిపాదితో అందర్నీ చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. బిఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పార్టీ ద్వారా నేడు నాకు ఇంత పెద్ద కుటుంబాన్ని ఇచ్చిన కేసీఆర్‌కి మొదటిగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఎంతో క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, ఎవరైనా నాతో పాటుగా కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని స్పష్టం చేశారు. పార్టీ పట్ల విధేయత, నాయకుని మాట జవదాటకుండా పూర్తి విశ్వాసంగా ఉండడం, ఎన్నుకున్న ప్రజలకు, నమ్ముకున్న కార్యకర్తలకు సేవ చేయాలని సూచించారు. మీ ప్రేమ, అభిమానం వల్లే నేడు నేను ఇక్కడ ఉన్నానని, మీ అజయ్ అన్న ఎమ్మెల్యేగా చేసుకోవాలని మీరు అనుకున్నారు నేను గెలిచాను.. గెలిచాను ముఖ్యమంత్రి కేసీఆర్ నాకు మంత్రిగా పని చేయగలిగే అవకాశం కల్పించారని అన్నారు. ప్రతి గడపకు కేసిఆర్ ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరుతున్నాయని, ఎవరు మంచి చేస్తున్నారో.. ఎవరు మాటలు చెప్తున్నారో విజ్ఞులైన ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు. నగరంలో వేల మందికి ఆసరా పెన్షన్‌లు ఇస్తున్నాం, కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాలను ద్విచక్ర వాహనంపై ఇంటింటికి వెళ్లి ఇస్తున్నాం.. ఇలా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక పథకాలు ప్రతి గడపకు అందిస్తున్నామన్నారు. త్వరలో ఎన్నికలు రానున్నాయని ,కొత్త కొత్త పగటి వేషగాళ్లు ఇళ్లకు వస్తుంటారని, వారి మాటలు నమ్మొద్దని, బీజేపీ, కాంగ్రెస్ అసత్య ప్రచారాలను బిఆర్ఎస్ శ్రేణులు సమర్థవంతంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ శ్రేణులకు భోజనాలు వడ్డించి వారితో పాటు కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి నామా నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార్, సూడా ఛైర్మెన్ విజయ్, ఏఎంసీ చైర్మన్ శ్వేత, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఆర్జీసి కృష్ణ, కార్పొరేటర్లు, పార్టీ వివిధ విభాగాల డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

సీపీఆర్ శిక్షణను ప్రారంభించిన మంత్రి పువ్వాడ



అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారిని ప్రాణాపాయం బారి నుండి కాపాడేందుకు వీలుగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వివిధ వర్గాల వారికి చేపడుతున్న వర్గాల సీ.పీ.ఆర్ శిక్షణ కార్యక్రమాన్ని ఖమ్మంలోని ఆదివారం దోరేపల్లి ఫంక్షన్ హాల్ లో బిఆర్ఎస్ పార్టీ టూ టౌన్ ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అవగాహన కల్పించారు. ఆకస్మికంగా గుండెపోటుతో ప్రాణాపాయ స్థితికి చేరిన వారికి సీ.పీ.ఆర్ ప్రక్రియను ఎలా అందించాలనే దానిపై ప్రయోగాత్మకంగా చేసి చూపిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ సిపిఆర్ అనే చిన్న ప్రక్రియ ద్వారా ఎన్నో విలువైన ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని అన్నారు. అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారిని గమనించిన వెంటనే, ఏమాత్రం తాత్సారం చేయకుండా సీపీఆర్ ప్రక్రియను అమలు చేయాలని సూచించారు.

నరసయ్యకు నెల్లూరులో ఘన సత్కారం

- కవి సమ్మేళనంలో కవిత గానం
- కట్టెకోలను ప్రశంసించిన నెరసం

నవతెలంగాణ-ఖమ్మం



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రమైన నెల్లూరులో ఖమ్మంకు చెందిన రచయిత, ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్ కట్టెకోల చిన నరసయ్యకు ఘన సత్కారం లభించింది. నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం టౌన్ హాలులో శోభకృతు నామ ఉగాది పురస్కారాలు, జాతీయస్థాయి కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కవి సమ్మేళనంలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన కవులు పాల్గొన్నారు. ఈ సమ్మేళనంలో కట్టెకోల మానవత్వాన్ని పరిమళించు అనే శీర్షికన రాసిన కవితను ఆలపించారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి మెమెంటోతో ఘనంగా సత్కరించారు.

సీపీఐ(ఎం) సీనియర్ నేత మృతి

- నివాళులర్పించిన నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-చింతకాని



మండల పరిధిలో నాగులవంచ గ్రామానికి చెందిన సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు బండి నాగేశ్వరరావు(55) ఆదివారం మరణించారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మృతదేహాన్ని సిపిఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, జిల్లా నాయకులు సామినేని రామారావు, ప్రముఖ న్యాయవాది తన్నీరు పాపయ్య, మండల కమిటీ సభ్యులు తోటకూరి వెంకట నరసయ్య, ఆలస్యం రవి, ఎంపీటీసీ మునుకుంట్ల నాగరత్నం, నాయకులు యరదేశి గోపాలరావు, బారాస నాయకులు ఖమ్మం మార్కెట్ కమిటీ డైరెక్టర్ వంకాయలపాటి వెంకట లచ్చయ్య తదితరులు ఉన్నారు.

ప్రజల అభివృద్ధి ఆకాంక్షించే వ్యక్తి మల్లు భట్టి విక్రమార్క

- సూరంసెట్టి కిషోర్

నవతెలంగాణ-మధిర

ప్రజల అభివృద్ధి ఆకాంక్షించే వ్యక్తి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అని కాంగ్రెస్ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ అన్నారు. మధిర మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉన్నటువంటి వ్యక్తి తెలంగాణ రాష్ట్ర సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మీ దగ్గర గెలిచిన ఎమ్మెల్యే ఎక్కడ అని ప్రశ్నించిన ఓ ఎమ్మెల్సీ తాతా మధు అకాల వర్షానికి జిల్లా మొత్తం పంట నష్టం జరిగితే ఎక్కడైనా మీ పార్టీ నాయకులు పంట పొలాలను పరిశీలించడం గాని రైతులను పరామర్శించడం గాని జరిగిందా..? ప్రతిపక్ష పార్టీలన్నీ పంటచేలు తిరిగి రైతులను ఓదార్చిన తర్వాత అధికారులు స్పందించి నివేదిక తయారు చేస్తే అప్పుడు ముఖ్యమంత్రి కెసిఆర్ పంట నష్టం జరిగిందని ఆలోచనతో జిల్లా పర్యటన చేయడం జరిగిందన్నారు. మీరు గాని మీ మంత్రులు గాని మీ నాయకులు గానీ ఎక్కడైనా ఏ పంట చేలోనైనా తిరిగినారా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిర్యాల వెంకటరమణ గుప్తా, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దార బాలరాజు, సైదల్లిపురం సర్పంచ్ పులి బండ్ల చిట్టిబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జహంగీర్, పట్టణం బీసీ సెల్ అధ్యక్షుడు బిట్రా ఉద్దండయ్యా, పట్టణ కాంగ్రెస్ నాయకులు కోటా నాగరాజు, మైలవరం చక్రి ,మొదలగు వారు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీ ధర్మ బిక్షం వర్ధంతి

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో నల్లగొండ మాజీ పార్లమెంటు సభ్యుల బొమ్మగాని ధర్మ బిక్షం 12వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు ఎంపీగా గెలిసి బడుగు బలహీన వర్గాల ప్రజల అణచివేతపై పోరాడిన యోధుడు బొమ్మగాని దర్మభిక్షం గౌడ్ చిత్రపటానికి కేత పనివాళ్ల సంఘం రాష్ట్ర నాయకులు బంధం నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బంధం నాగేశ్వరావు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అవిరాలంగా పోరాడిన చరిత్ర బొమ్మగాని ధర్మభిక్షానికి ఉందన్నారు. చాకలి ఐలమ్మలో పోరాట స్ఫూర్తిని నింపి దొరలకు, పెత్తందారులకు వ్యతిరేకంగా సామాన్యులు పోరాటం చేసేందుకుగాను శిక్షణ నిచ్చిన యోధుడు ధర్మబిక్షమన్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు జక్కా నాగభూషణం, ముష్టికుంట గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షులు ధారగాని నాగేశ్వరావు, వివిధ పార్టీల నాయకులు నాగులవంచ సొసైటీ డైరెక్టర్ పరస గాని లక్ష్మణ్ గౌడ్ బోయినపల్లి మురళి, సురభి నరసరావు గౌడ్, బంధం అర్చన గౌడ్, బంధం అంబయ్య గౌడ్, రవి గౌడ్, వేణు గౌడ్, బంధం రామచంద్ర, బంధం రాము గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడికి మాతృవియోగం

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి చెందిన, పోచవరం సొసైటీ అధ్యక్షులు నర్వనేని పెద్ద అంజయ్య మాతృమూర్తి నర్వనేని సూరమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పాలెపు రామారావు, జడ్పిటిసి కట్టా అజయ్ కుమార్, ఎంపీపీ బీరవల్లి రఘు, మండల టిఆర్ఎస్ కార్యదర్శి కొరకొప్పు ప్రసాద్, గ్రామ సర్పంచ్ మోదుగు సుబ్బారావు, ఎంపీటీసీ మర్శకట్ల మేరమ్మ, పెద్ద దర్గయ్య, కల్లూరు సొసైటీ అధ్యక్షులు బోబోలు లక్ష్మణరావు, జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండి ఇస్మాయిల్ , సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు

- గ్రా.పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి వెంకటరాజ్యం

నవతెలంగాణ-ఖమ్మం

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు సాగించనున్నట్లు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి వెంకట రాజ్యం తెలిపారు. ఆదివారం నగరంలోని గిరిప్రసాద్ భవన్లో పిట్టల మల్లయ్య అధ్యక్షతన ఏఐటియుసి విష్ణు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వెంకటరాజ్యం, ఇఫ్టు రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్ మాట్లాడుతూ ఈనెల 19న హైదరాబాద్లో జరిగిన జేఏసి మీటింగ్లో చర్చించిన అంశాలను కార్మికులకు వివరించారు. జిల్లాలో ఏఐటియుసి, సిఐటియు, ఇఫ్టు, బిఆర్ఎస్ యూనియన్ల జేఏసిగా ఏర్పడి గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై ఐక్య పోరాటాలు. సాగించనున్నట్లు తెలిపారు. త్వరలో అన్ని యూనియన్ల తరుపున కమిటీని ఏర్పాటు చేసుకుని సమస్యలతో పోరాడనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయితీ కార్మికులకు పెండింగ్లో ఉన్న జీతాలను వెంటనే -మంజూరు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని తెలిపారు. మల్టీ పర్పస్ విధానాన్ని సవరించాలని, పంచాయతీ కార్మికుల పై పని భారం తగ్గించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటియుసి రాష్ట్ర నాయకులు శింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, గాదె లక్ష్మీ పాల్గొన్నారు.

ముదిగొండ నూతన ఎస్సైగా గజ్జెల నరేష్

నవతెలంగాణ-ముదిగొండ

ముదిగొండ పోలీస్ స్టేషన్‌లో సుమారు 16 నెలల పాటు విధులు నిర్వహించిన ఎస్సై తోట నాగరాజును ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మధిర రూరల్ పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గజ్జెల నరేష్ ముదిగొండ పీఎస్‌కు రానున్నారు. ఈ మేరకు ఖమ్మం కమిషనరేట్ సిపి విష్ణు ఎస్ విష్ణువారియర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు వితరణ

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో మేడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పరశ సీతారత్నం ట్రస్ట్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు ట్రస్ట్ చైర్మన్ పరశ పుల్లయ్య పరీక్ష ప్యాడ్స్, స్కేల్స్ వితరణగా అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలిగి, ఉత్తమ ఫలితాలు సాధించి, ఉన్నత చదువులపై దృష్టి సారించాల న్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కే భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-పెనుబల్లి

భూమి కొనుగోలు వ్యాపారంలో బెదిరింపుకు పాల్పడిన పెనుబల్లి మండలం విఎం బంజర్ యారం వెంకటేశ్వరరావుపై పెనుబల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం వెంకటేశ్వర రావు ములకలపల్లికి చెందిన రాంబాబుకి తాళ్లపంట గ్రామంలో లోని నాలుగున్నర ఎకరాల భూమిని 2018లో విక్రయిం చాడు. అప్పట్లో రెండున్నర ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేయించి మిగిలిన రెండు ఎకరాలకు డాక్యుమెంట్ సక్రమంగా లేకపోవడం వలన రిజిస్ట్రేషన్ చేయ లేదని, పలుమార్లు రాంబాబు భూమి రిజిస్ట్రేషన్ చేయాలని వెంకటేశ్వరరావు కోరినప్పటికీ ప్రస్తుతం ఉన్న రేటు ప్రకారం తనకు డబ్బులు ఇస్తే రిజిస్ట్రేషన్ చేస్తానని తేల్చి చెప్పడంతో పాటు బెదిరించి దుర్భాషలకు పాల్పడటంతో రాంబాబు పోలీసుల ఆశ్రయించాడు. దీంతో పోలీసులు విచారించి వెంకటేశ్వ రరావు పై కేసు నమోదు చేశారు.

సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న జడ్పీటీసీ వెంకట ప్రవీణ్ కుమార్ నాయక్

నవతెలంగాణ-కామేపల్లి

గాంధీ భవన్ లో జరిగిన సత్యాగ్రహ దీక్షలో జడ్పీటీసీ సభ్యులు, ఇల్లందు నియోజకవర్గ నాయకులు బానోత్ వెంకట ప్రవీణ్ కుమార్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీని పార్లమెంటుకు అనర్హులుగా ప్రకటిం చడాన్ని నిరసిస్తూ గాంధీ భవన్ లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సత్యాగ్రహం నిర్వహించింది.

14 నుంచి సీపీఐ ఆధ్వర్యంలో...

ప్రచార యాత్ర ప్రారంభం

పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

- ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి
- విలేఖరుల సమావేశంలో సీపీఐ నేతలు భాగం హేమంతరావు, పోటు ప్రసాద్



నవతెలంగాణ-వైరాటౌన్

ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని అంటూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి రోజున ఏప్రిల్ 14న నుండి దేశవ్యాప్తంగా నెల రోజులపాటు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సిపిఐ జాతీయ కమిటీ నిర్ణయించిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. ఆదివారం వైరాలో సిపిఐ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌తో కలిసి భాగం హేమంతరావు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏప్రిల్ 14 నుండి 21 మండలాలలో ప్రచార జాత నిర్వహిస్తున్నామని, ఈ ప్రచార యాత్రలో ప్రజల పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బిజెపిని అధికారంలోకి రాకుండా చేయడంలో అందరూ ఏకం కావాలని, నరేంద్ర మోడీ తొమ్మిది సంవత్సరాల పరిపాలనా కాలంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచడం జరిగిందని, ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తాం అని ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, లాభాలలో నడుస్తున్న ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ సంస్థల ప్రయోజనం కోసం బిజెపి ప్రభ అమ్మి వేస్తుందని, మరలా బిజెపి అధికారంలోకి వస్తే దేశం చీకటి మయంగా మారిపోతుందని అన్నారు. టిఆర్ఎస్ పార్టీకి భారత కమ్యూనిస్టు పార్టీ మద్దతు తెలపడం జరిగిందని, మునుగోడు ఎన్నికల్లో మద్దతు తెలిపి గెలిపించడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ కూడా కమ్యూనిస్టులతో కలిసి పని చేస్తామని చెప్పారని, బిజెపి వ్యతిరేకంగా పోరాడే అందరినీ కలుపుకొని పోవడమే వామపక్ష పార్టీల ధ్యేయం అన్నారు. సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలు ఐక్యంగా కలిసి రాబోయే ఎన్నికల్లో గెలుపు ధ్యేయంగా పని చేస్తామని, అదేవిధంగా రైతుల రుణమాఫీ, రైతు బంధు, దళిత బంధు, డబల్ బెడ్ రూమ్ ఇండ్ల గురించి ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని, తాను గెలిచింది సిపిఐ పార్టీ ఓట్లతోనే అని గుర్తు పెట్టుకోవాలని పోటు ప్రసాద్ అన్నారు. వామపక్ష పార్టీలు ఎప్పుడు ప్రజల పక్షాన ఉంటాయని, అర్థం లేకుండా మాట్లాడే కందాల ఉపేందర్ రెడ్డి బేషరతుగా వామపక్ష పార్టీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్ర బాబు, దొండపాటి రమేష్, యమల గోపాలరావు, రంజిత్, వేములకొండ రమేష్, భారత్, మిట్టపల్లి రాఘవరావు, గారపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం మరొకరికి ప్రాణదానం : ఎమ్మెల్యే సండ్ర

లిటిల్ ఫ్లవర్ చర్చిలో మహా మెగా రక్తదాన శిబిరానికి అశేషప్రజాదరణ

నవతెలంగాణ-కల్లూరు

తల సేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం దానం చేయాలని దృఢ సంకల్పంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయటం ఎంతో అభినందనీయమని సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య, అన్నారు. ఆదివారం కల్లూరు లిటిల్ ఫ్లవర్ చర్చిలో విచారణ గురువులు ఫాదర్ విన్సెంట్ తపస్ కాల ఆరాధన శ్రమల కాలంలో భాగంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్త అందించటం ఎంతో అభినందనీయమని కొత్తగూడెం ప్రావిన్షియల్ సుపీరియర్ రెవరెండ్ ఫాదర్ బొల్లికొండ జయరాజు అన్నారు. లిటిల్ ఫ్లవర్ చర్చి మరియు లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఉచిత మెగా వైద్య శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించటం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ లూర్దు విచారణ, సహాయ గురువులు రెవరెండ్ ఫాదర్ దేవదానం, స్టైజర్ ఫార్మసీ నిర్వాహకులు నరేష్, తహసీల్దార్ జంగం బాబ్జీ ప్రసాద్, సత్తుపల్లి రూరల్ సీఐ హనూక్, కల్లూరు మండలం బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాలెపు రామారావు, కల్లూరు సొసైటీ చైర్మన్ బోగోలు లక్ష్మణరావు, వ్యవసాయ మార్కెట్ ఉపాధ్యక్షులు కాటమనేని వెంకటేశ్వరరావు, కల్లూరు మండలం రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు, మాజీ జడ్పిటిసి మేకల కష్ణ ప్యారిస్ కమిటీ ప్రెసిడెంట్ యనమాల రవీంద్ర, కార్యదర్శి కోట కిరణ్ కుమార్, లిటిల్ ఫ్లవర్ చర్చి సిస్టర్లు మర్యాదలం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్టులకు ఆయుర్వేద వైద్య శిబిరం విజయవంతం

నవతెలంగాణ-ఖమ్మం



ఎస్‌బిఐటి విద్యాసంస్థల చైర్మన్, జిల్లా బీఆర్ఎస్ నాయకులు ఆర్‌జెసి కృష్ణ సౌజన్యంతో ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, టియుడబ్ల్యూజే (ఐజేయు) ఖమ్మం నగర అధ్యక్షులు మైస పాపారావు సారథ్యంలో జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం విజయవంతమయ్యింది. ఆదివారం ఖమ్మం నగరంలోని ఆర్అండ్‌బి విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు కే.రామ్ నారాయణ, జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి కనకం సైదులు, ఖమ్మం నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్, ఆర్‌జెసి, ఎస్‌బిఐటి విద్యాసంస్థల చైర్మన్ ఆర్‌జెసి కృష్ణ, సమాచార శాఖ జిల్లా కార్యాలయం ఏపీఆర్ఓ వల్లోజు శ్రీనివాసరావు ప్రారంభించారు. జర్నలిస్టులు, జర్నలిస్టుల కుటుంబాలకు సుమారు 250 మందికి ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ పాములపర్తి రామారావు వెన్నెముక, డిస్క్, కండరాల సమస్యలకు తన చేతి వైద్యంతో పరిష్కారం చూపారు. అవసరమైన వారికి ఆయుర్వేద మందులు వాడాలని సలహా ఇచ్చారు. అనంతరం ఆయుర్వేద వైద్యులు డాక్టర్ పాములపర్తి రామారావును శాలువాలు, బొకేలతో జర్నలిస్టులు, సంఘ నాయకులు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా నాయకులు గోగి రెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏగినాటి మాధవరావు, మహేందర్, పోటు శ్రీనివాస్, రామకృష్ణ, రాయల బసవేశ్వర రావు, ఏలూరి వేణుగోపాల్, జనార్ధన చారి, ఖమ్మం ప్రెస్ క్లబ్ కోశాధికారి నామా పురుషోత్తం పాల్గొన్నారు.

సామియో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



మండల పరిధిలో ఏదులాపురం పంచాయతీ పరిధిలోని ఆదిత్యనగర్-2లో సామియో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిలుగా డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి లు హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అన్ని దానాల కంటే రక్తదానం చాలా గొప్పదని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని బ్రతికించడానికి ఉపయోగపడుతుందన్నారు. సరైన సమయాల్లో రక్తం అందక చిన్నారులు, తలసేమియా వ్యాధిగ్రస్తులు, గర్భిణీ స్త్రీలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ తమ జీవితకాలంలో అవకాశం ఉన్న ప్రతిసారి రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఉరడీ విజయ్ రెడ్డి, కార్యదర్శి ఉరడీ సుదర్శన్ రెడ్డి, పొన్నెకంటి నరసింహారావు, గడ్డం వీరబాబు, ఉమాకర్, పొన్నెకంటి అన్వేష్, ఏర్పుల జయప్రసాద్, జిన్నేక ఉపేందర్, అరేంపుల నరేష్, సాయి, గోపిఅశోక్ రెడ్డి, మురళి, యర్రయ్య, మురళీ, వంశీ, రవి, జగన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సానుభూతిపరులు సిద్ది రాధాకృష్ణ మృతి

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం నగరానికి చెందిన సిపిఐ సానుభూతి పరులు సిద్ది రాధాకృష్ణ (55) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సిద్ది రాధాకృష్ణ మృతి వార్త తెలుసుకున్న వెంటనే సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పంపింగ్ వెల్ రోడ్డులోని ఆయన నివాసానికి వెళ్లి సిద్ది రాధాకృష్ణ భౌతికాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిద్ది రాధాకష్ణ సోదరుడు సిపిఐ రాష్ట్ర నాయకులు సిద్ధి వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, నూనె శశిధర్ పాల్గొన్నారు.



అన్వార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖర్జూర పండ్ల బాక్స్‌లు పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగరంలోని స్థానిక గొల్లగూడెంలో మదర్సా తాళిముల్ ఇస్లాం నందు అన్వర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధార్మిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఇఫ్తార్ కోసం ఖర్జూరా పండ్ల బాక్స్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఖమర్, కార్పొరేటర్ శౌకత్ అలీ విచ్చేసి ఈ సభలో మాట్లాడుతూ అన్వార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. అనంతరం మదర్సా నిర్వాహకులు ముఫ్తి మొహమ్మద్ అబ్దుల్ రవూఫ్ అన్వార్ పాషా కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఎక్కువగా భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తూ సేవా కార్యక్రమంలో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమం లో అన్వార్ ఫౌండేషన్ చైర్మన్ షేఖ్ జిలాని, ఆల్ మేవ జిల్లా అధ్యక్షుడు షేక్ యాకూబ్ పాషా, అడ్వైజర్ ఎండి సలీం, ఎండి గౌస్, 38 డివిజన్ నాయకులూ గౌస్, ఖలీం, రాహిల్, తదితరులు పాల్గొన్నారు.

34 సంవత్సరాల అనంతరం అపూర్వ కలయిక

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988, 89 సంవత్సరాలలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అపూర్వ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన దగ్గుల కాంతారెడ్డి, హైమావతి, కిషోర్ బాబు, నరసింహారావు, దాసు తదితర ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతల మాట్లాడుతూ.. 34 సంవత్సరాల అనంతరం తమను గుర్తుంచుకొని ఆహ్వానించి సన్మానించిన పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు బెత్తం తీసుకొని తరగతి గదిలోకి వెళ్తుంటే ఆరవ తరగతి విద్యార్థిని బెత్తం ఎందుకు తీసుకుని వస్తున్నారని ఇప్పుడు ప్రశ్నించిందని, విద్యావ్యవస్థలో సమూల మార్పులు వచ్చాయని తదనుగుణంగా విద్యార్థులు చదువుతోపాటు సంస్కారం అలవర్చుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు.

శివాలయంలో మైక్ సెట్ ని ప్రారంభించిన ఎమ్మెల్యే కందాళ

నవతెలంగాణ -కూసుమంచి

సొంత నిధులతో శివాలయం అభివృద్ధికి కృషి చేయడం నిజంగా అభినందనీయమని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పురాతన చరిత్ర కలిగిన శివాలయంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు నాగిరెడ్డి, సునీత, రవీందర్ రెడ్డి, అర్వపల్లి వెంకట్, నెల్లూరి సత్యనారాయణ సుమారు రూ.2,0,5000 విలువ గల మైక్ సెట్ ను శివాలయానికి వితరణగా అందించారు. ఆ నూతన మైక్ సెట్ లను ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేముల వీరయ్య, కొక్కిరేణి సీతారాములు ,అర్వపల్లి,ఉపేందర్ శివాలయం కమిటీ చైర్మన్ కొక్కిరేణి వీరస్వామి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

8న బీసీ జర్నలిస్టుల మహా సమ్మేళనం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

రాష్ట్రంలో బీసీ జర్నలిస్టులను సంఘటితం చేసి, అందరినీ ఐక్యం చేయడమే లక్ష్యంగా బీసీ సమాజ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో భారీ సమ్మేళనం నిర్వహిస్తునట్లు బీసీ జర్నలిస్టుల పెక్స్ కమిటీ సభ్యులు సూర్యారావు, నాగ పరిమిళ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 8న జరగనున్న బీసీ జర్నలిస్టుల మహాసమ్మేళనానికి రాష్ట్రంలోని బీసీ జర్నలిస్టులందరూ తరలిరావాలని కోరారు. అనంతరం జిల్లా కన్వీనర్ గా టి రామకృష్ణ ను నియామకం చేశారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం నగరంలోని నిజాంపేటకు చెందిన బండి రమేష్‌కు ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును సిపిఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్ లో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సిఫారసు మేరకు సహాయనిధి చెక్కు అందజేసినట్లు తెలియజేశారు. లబ్ధిదారుడు బండి రమేష్, సిపిఎం పార్టీకి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్. ప్రకాష్, కొండల్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లి శ్రీధర్ కు నివాళులర్పించిన పువ్వాడ

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఆయన నివాసం వద్ద ఉంచిన కొల్లి శ్రీధర్ భౌతికాయాన్ని సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, విజయలక్ష్మీ దంపతులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొల్లి శ్రీధర్ వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, కెఎస్ బాల్జీ, టివి బాబు, బాగం కిషన్ రావు, అందరూ కలిసి కొల్లి శ్రీధర్ భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పలువురు దూదేకుల నాయకులు బహిష్కరణ

నవతెలంగాణ-ఖమ్మం

దూదేకుల సంఘం నుండి పలువురిని బహిష్కరిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ భాష ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది దూదేకుల నాయకులు అని చెప్పుకుంటూ దూదేకుల కులస్తులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముస్తఫా, రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు ఎస్.కె బడేసాహెబ్, ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం, అధికార ప్రతినిధి అన్వర్ పాషాలను సంఘం నుంచి బహిష్కరించడం జరిగిందని, వీరికి ఈ సంఘానికి ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

జమలాపురంలో సామూహిక కుంకుమార్చన

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న శ్రీ వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో బాగంగా పద్మావతి అమ్మ వారి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని కుంకుమ పూజ నిర్వహించారు. ఆలయంలో తెల్లవారు జాము నుండే ప్రత్యేక అర్చనలు, సుప్రభాత సేవ, వేద పారాయణం, అనుష్టములు, హోమముల నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజు చైత్ర శుద్ధ తదియ ఆదివారం ఉదయం 8 గంటలకు గోపూజ కార్యక్రమం, ఉదయం 10 గంటలకు పద్మావతి అమ్మవారి ఆలయం నందు సామూహిక ప్రత్యేక కుంకు మార్చన, పుష్పార్చన నిర్వహించారు.

జన చైతన్య యాత్ర జయప్రదం చేసిన అందరికీ ధన్యవాదాలు

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్ర జిల్లాలో జయప్రదానికి సహకరించిన అందరికీ సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 17న హన్మకొండలో ప్రారంభమైన యాత్ర 21న ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు మండలంలోకి ప్రవేశించి, 25వ తేదీ నేలకొండపల్లి వరకు ఐదు రోజుల పాటు 13 సెంటర్స్‌లో బహిరంగ సభలు జరిగాయని పేర్కొన్నారు. జిల్లాలో 350 కిలోమీటర్లు వరకు విజయవంతంగా సాగిందన్నారు. ఈ యాత్ర జిల్లాలో చాలా ఉత్సాహభరితంగా జరిగిందని, సభలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారని తెలిపారు. సీపీఐ, బీఆర్ఎస్, కాంగ్రెస్, టిడిపి తదితర పార్టీలు, ఇతర ప్రజా సంఘాల నాయకులు సంఘీభావంగా యాత్రలో పాల్గొన్నారని తెలిపారు. జిల్లాకు చెందిన అనేకమంది ప్రజా ప్రతినిధులు కూడా సంఘీభావంగా తెలిపి జయప్రదం చేశారు. యాత్రలో పాల్గొన్న ఇతర పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులకు, నాయకులకు ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

కుట్ర పూరితంగానే రాహుల్‌పై వేటు

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే
- భవిష్యత్ ఉండాలంటే కాంగ్రెస్‌ని గెలిపించాలి : రేణుకాచౌదరి
- జోడో యాత్రలో అపశృతి

నవతెలంగాణ-వైరా

బీజేపీ ఆగడాలను ఎదిరిస్తున్న రాహుల్ గాంధీపై కుట్ర పూరిత కేసు పెట్టి జడ్జీలను కొని, పదవులు ఆశ చూపి తప్పుడు జడ్జిమెంట్ ఇప్పించి జైలుకు తరలించాలని చూస్తున్న బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే హెచ్చరించారు. కాంగ్రెస్ కార్యకర్తలతో దేశ వ్యాపితంగా జైల్ భరో నిర్వహిస్తామన్నారు. ఆదివారం పీసీసీ కార్యదర్శి కట్టా రంగారావు అధ్యక్షతన పట్టణంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్రోద్యంలో పాల్గొని సాధించిన కాంగ్రెస్ పార్టీని ఏదో చేయాలని చూస్తున్న నరేంద్రమోడీ ధన మదం, అధికార మదం కాంగ్రెస్ ను కదిలించడం అసాధ్యం అన్నారు. తెలంగాణలో కెసిఆర్ అరాచక పాలన సాగుతుందన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ఖిల్లా అని నినాదాలు చేయించారు. గెలిచిన ఎమ్మెల్యేలు ఏ పని అడిగినా డబ్బు అడుగుతున్నారని అన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు నిధులు రాక, చేసిన పనులకు బిల్లులు కాక ఆత్మహత్యలు



చేసుకుంటున్నారన్నారు. ఖమ్మంలో దుర్మార్గ పాలన చేస్తున్న వారికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు వేల కిలోమీటర్లు పాదయాత్ర హాత్ సే హాత్ జోడో యాత్ర చేసి దేశ పరిస్థితులను గమనించారని, కాంగ్రెస్ కు పూర్వ వైభవం తెచ్చిన సమయంలో మోడీ ప్రభుత్వం కుట్ర పన్ని తప్పుడు కేసులు, తప్పుడు తీర్పుతో ఇబ్బందులకు గురిచేయడం దివాళ కోరు తనం అన్నారు. కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధమై రాహుల్‌కు మద్దతుగా నిలిచేందుకు సిద్ధమయ్యారని, బీజేపీ దుర్మార్గాలను ప్రపంచం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ సభలో ఏఐసిసి కార్యదర్శులు రోహిత్ చౌదరి, నబీద్ జావేద్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు భవిష్యత్ ఉండాలంటే కాంగ్రెస్ కు ఓటేయాలి :

వైరాలో ఫైర్ బ్రాండ్ రేణుకా చౌదరి సంచలన వ్యాఖ్యలు

దేశంలో, రాష్ట్రంలో భావితరాలకు భవిష్యత్ ఉండాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మాజీ కేంద్రమంత్రి, ఫైర్ బ్రాండ్ గారపాటి రేణుక చౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి హత్ సే హత్ కార్యక్రమంలో భాగంగా వైరాలో రామ్మూర్తి నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ల రంగారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె ప్రసంగించారు. మూడు రంగుల జెండాలో గాంధీ కుటుంబ రక్తం ఉందని, ఆయనను జైలుకు పంపితే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. దేశంలో ఉన్న సంపదనంతా అంబానీ, ఆదాని కుటుంబాలకు కట్టబెడుతూ ఇదేమని ప్రశ్నించిన రాహుల్ గాంధీపై అనర్హత వేటువేయడం ప్రజల గమనిస్తున్నారన్నారు. ప్రధాని మోడీకి దేశ ప్రజలే తగిన శిక్ష వేస్తారని అన్నారు. దేశంలో గతంలో కుల, మతాలు ఘతీతంగా ప్రజలు స్నేహభావంతో ఉన్నారని, బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మత విద్వేషాలు పెంచుతూ ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు.

వైరాలో జోడోయాత్రలో అపశృతి

కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి నడుపుతున్న ట్రాక్టర్ టైరు కింద ప్రమాదవశాత్తు ఖమ్మం కార్పొరేట్ భర్త ముస్తఫా పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ఏవీఎస్‌కు నివాళి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవడం కోసం పోరాటాలు చేయడమే ఉపాధ్యాయ ఉద్యమ ఆదర్శనేత, అమరజీవి అప్పారి వెంకటస్వామికి ఘనమైన నివాళి అని ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. టీఎస్ యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి (ఏవీఎస్) 22వ వర్ధంతి సభ స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాల్ లో సంఘం జిల్లా అధ్యక్షుడు జీవీ నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సభకు నర్సిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రాంతాలు, కేడర్లు, మేనేజ్ మెంట్ల వారీగా ఉపాధ్యాయ ఉద్యమం చీలిపోయిన సందర్భంలో అందర్నీ ఏకతాటిపైకి తెచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ను స్థాపించి, అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా రాష్ట్రంలో అగ్రగామి సంఘంగా ఏవీఎస్ తీర్చిదిద్దారన్నారు. ఉపాధ్యాయుని సామాజిక హోదా పెంపుదలకు, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉద్యమాలు రూపొందించడంలో అప్పారి కీలక భూమిక పోషించారన్నారు. ఉద్యమ కార్యకర్తలలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, శాస్త్రీయ వైఖరులు పెంచడానికి కృషి చేశారన్నారు. పౌరులు, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచడం రాజ్యాంగం



ప్రకారం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఎవియస్ స్ఫూర్తితో ఆ విధమైన కృషి చేయాలని నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 1974లో యూటీఎఫ్ స్థాపనలో కీలక భూమిక పోషించి, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కీలక పాత్ర పోషించిన సీనియర్ నాయకులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. చనిపోయిన వారికి అశ్రునివాళులు అర్పించారు. ఈ సభలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావా రవి, రాష్ట్ర నాయకులు చావా దుర్గాభవాని, రాజు, పి.మాణిక్ రెడ్డి, ఎస్ కే మహబూబ్ అలీ, బండి నరసింహారావు, పారుపల్లి నాగేశ్వరరావు, కిషోర్ సింగ్, కృష్ణ, జిల్లా నాయకులు బుర్రి వెంకన్న, షమీ, వి.రాంబాబు, షేక్ రంజాన్, కె.గీత, జీఎస్ఆర్ రమేష్, పి.సురేష్, వీవీ రామారావు, బి.రాందాస్, ఎస్ సతీష్, కె. శ్రీకాంత్, మంగీలాల్, రాందాస్, కళ్యాణం నాగేశ్వరరావు, పూర్వ నాయకులు జి.రాజశేఖర్, ఎన్ వీరబాబు పాల్గొన్నారు.

పాలేరు పంచాయతీకి జాతీయ స్థాయి అవార్డు



అవార్డు ప్రదానం చేసిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని పాలేరు గ్రామపంచాయతీ జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికయింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చేతుగా గ్రామపంచాయతీ సర్పంచ్ యడవల్లి మంగమ్మకు, గ్రామ కార్యదర్శి నరేష్‌కు ఉత్తమ జాతీయ గ్రామ పంచాయతీ అవార్డును, ప్రశంసా పత్రాన్ని ప్రదానం చేశారు. అనంతరం ఇరువురికి రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, ఎమ్మెల్సీ తాతా మధు, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్, పలువురు పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు. సందర్భంగా సర్పంచి మంగమ్మకు, గ్రామ కార్యదర్శి నరేష్‌లకు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలియజేశారు.

ప్రజల మనిషి నర్సింగ్ ఉమ

నివాళ్లు అర్పించిన ఎంపీ వద్దిరాజు రవీంద్ర, సీపీఎం నేత నున్నా

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి మండల ప్రజల సాధక బాధకాలలో వెన్నంటే ఉండే మాజీ జర్నలిస్టు నర్సింగ్ ఉమామహేశ్వరరావు (ఉమా)ను కోల్పోవటం దిగ్భ్రాంధికరమని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శనివారం రాత్రి మృతి చెందిన నర్సింగ్ ఉమామహేశ్వరరావు మృతదేహాన్ని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సందర్శించి నివాళ్లు ఆర్పించారు. దహన ఖర్చులకు రూ.20వేలు ఆర్థిక సాయం చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆదివారం ఉమా అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ(ఎం)లో ఉంటూ కార్యక్రమాల్లో చురుకుగా ఉండే వారన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరి సమస్యను సానదానం విని దాని పరిష్కారం కోసం పని చేస్తూ అందరి అభిమానాన్ని చూరగొన్నారన్నారు. కాన్సర్ మహమ్మారి తో బాధపడుతూ జీవితాన్ని చాలించటం విచారకరమన్నారు. ఉమా కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. నివాళ్లు అర్పించిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, దుగ్గి కృష్ణ, జిల్లా నాయకులు కే.నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, వజ్జా రామారావు, వడ్డే అజయ్‌బాబు, తలారి దేవప్రకాశ్, తుమ్మోజు రాంమూర్తి మెరుగు రమణ, ఉమావతి, పండగ కొండయ్య, సీపీఐ నాయకులు ఉన్నారు.

9 ఏళ్ల పాలనలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రజలను మోసం చేశాయి

- మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్

నవతెలంగాణ-కల్లూరు

9 ఏళ్లుగా కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో కొనసాగుతూ ప్రజలకు ఎలాంటి న్యాయం చేయకపోగా భారాలను మోపుతూ మోసం చేశారని ఏఐసీసీ సభ్యులు, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు శ్రీ సంభాని చంద్రశేఖర్ ఆరోపించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి హాత్ సే హాత్ జోడోయాత్ర ఆదివారం సాయంత్రం కల్లూరు మండలంలోని ముచ్చవరం గ్రామ ప్రజలతో చేయి చేయి కలుపుతూ, గడప గడపకు తిరుగుతూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, రాహుల్ గాంధీ సందేశ పత్రాన్ని అందిస్తూ యాత్రను సాగిస్తున్నారు. ఈ సందర్భంగా సంభాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు. కాంగ్రెస్



పాలనలో వ్యవసాయాన్ని పండుగలా చూశారని తెలిపారు. అయితే, ప్రస్తుతం పనికిరాని ఆంక్షలతో రైతులపై బీఆర్ఎస్ భారం మోపుతోందని పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని, లక్షల ఇందిరమ్మ ఇళ్లు, వేలకోట్ల రూపాయల పంట రుణాలు మాఫీ చేశామని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం తెచ్చామని, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలని ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు బైరెడ్డి మనోహర్ రెడ్డి, స్టేట్ ఎస్సీ డీపీటీ కన్వీనర్ కొండూరు కిరణ్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కీసర శ్రీనివాస రెడ్డి, మాజీ ఎంపిపి గోపాలస్వామి, మాజీ ఎంపిటిసి కృష్ణారెడ్డి, మాజీ ఎంపిటిసి పుల్లారావు, దారా రంగా, చుక్కా, పోతురాజు నరేంద్ర, శీలం జమలయ్య, శీలం రాములు, కృష్ణయ్య, శీలం పెద్ద దర్గయ్య, గోసు కృష్ణ యాదవ్, శీలం నరసింహా రావు, సాదం వెంకటేశ్వరరావు, గోసు భద్రయ్య ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు

విలేకరుల సమావేశంలో బండి లక్ష్మణ్

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

అక్రమ కలప వ్యాపారం నాది కాదని, అన్ని అనుమతులతో గత 25 ఏళ్ల నుండి కట్టెకోత మిషన్ నడుపుకుంటున్నానని విలేకరుల సమావేశంలో బండి లక్ష్మణ్ తెలిపారు. గాడికొయ్య హనుమంతరావు కావాలనే చెడ్డపేరు తేవాలని గల్లా సత్యనారాయణపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బోనకల్లు గ్రామానికి చెందిన బండి లక్ష్మణ్ అన్నారు. ఖమ్మం నగరంలోని స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బండి లక్ష్మణ్ మాట్లాడుతూ.. వైరా మండలం పాలడుగు గ్రామానికి చెందిన గాడికొయ్య హనుమంతరావు నా దగ్గర పదేండ్లుగా పని చేశాడని పేర్కొన్నారు. గాడికొయ్య హనుమంతరావుపై అనేక ఆరోపణలు, పోలీస్ స్టేషన్లలో కేసులు అవుతుంటే పనిలో నుండి తీసేసానని అన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని గల్లా సత్యనారాయణను అక్రమ వ్యాపారం చేస్తున్నారనే నెపంతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని దుయ్యబట్టారు. నిజాయితగా ఉన్న సత్యనారాయణపై ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



పురుగు మందు తాగి హాస్పిటల్ లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ లో ఆదివారం కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన బోక్షం రాజేశ్(38) కొన్నేళ్లుగా చెడు అలవాట్లకు,మద్యానికి బానిస అయ్యాడు. ఆరోగ్యం కూడా క్షీణించింది. మద్యానికి బానిసై అనారోగ్య పరిస్థితుల వల్ల బాధపడుతూ ఈనెల 21న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు.విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. సంఘటనపై మృతుని భార్య శాలిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

కోడి పందెల స్థావరంపై దాడి

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండలంలోని కాచవరం గ్రామం వద్ద కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు స్థావరాలపై దాడి చేసి పలువురుని అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక ఎస్సై సురేష్ తెలిపారు. 12 మందిని పట్టుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో 9 బైకులు, రూ.22,190 రూపాయల నగదును సీజ్ చేసి రెండు కోడి పుంజులను స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది ప్రకాష్, నరేష్, రాములు, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వర మాధురి కల్చరల్ తృతీయ వార్షికోత్సవం

నవతెలంగాణ ఖమ్మం

స్వర మాధురి కల్చరల్ యూనిట్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఖమ్మం భక్తరామదాసు కళా క్షేత్రంలో సంగీత విభావరి నిర్వహించారు. తొలుత తెదేపా సీనియర్ నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు, కేతి నేని హరీశ్, ఎన్.బి.కె సేవా సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నల్లమల రంజిత్ కుమార్‌లు పాల్గొని నందమూరి తారకరామారావు ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలనాటి మధుర గీతాలను సింగర్లు ఆలపించారు . అనంతరం చిన్నారుల నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఆకుల గణపతి రాజు, వివి రెడ్డి, కే జనార్దన్ రావు, పిన్నెల్లి యాదగిరి, జాఫర్, ప్రకాష్, మోహన్ కష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వివాహిత మృతి

నవతెలంగాణ-ముదిగొండ



మండల పరిధిలో మేడేపల్లి గ్రామానికి చెందిన పోతునూక స్వాతి(28) ఆదివారం గుండెపోటుతో మృతి చెందింది. పోతునూక నరేష్ స్వాతి దంపతులు ఖమ్మంలో నివాసం ఉంటున్నారు. మృతురాలు స్వాతికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మిత్రుడి పాడె మోసిన మంత్రి పువ్వాడ

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



తన బాల్య మిత్రుడైన కొల్లి శ్రీధర్ అకాల మరణం పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతి తనను కలచివేసిందని కంటతడి పెట్టుకున్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీ నందు తన నివాసం వద్ద ఉంచిన పార్థివ దేహాన్ని మంత్రి పువ్వాడ సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాడే మోసి కడసారి వీడ్కోలు పలికారు.



రామశెట్టి రోశయ్య రచన పుస్తకాల ఆవిష్కరణ

నవతెలంగాణ-మధిర

మధిర పట్టణంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారి కల్యాణ మండపంలో ఇటీవల కాలంలో మరణించిన గజల్ కవి బైరి ఇందిరాకి సంతాపం తెలిపారు. ఈ సభ రిటైర్డ్ ఇంటర్మీడియట్ బోర్డ్ జాయింట్ సెక్రెటరీ కర్నాటి రామ్మోహన్ రావు అధ్యక్షతన ఉత్సాహభరితంగా పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యవేత ప్రముఖ కవి పలు విద్యాసంస్థల అధినేత వచన కవులు మువ్వా శ్రీనివాసరావు 'పాత చెప్పులకు పాలిష్, ఇక సాగవు... సాగవు, నూతన వెలుగులు, ఇల్లూరి మాస్టారు, ధిక్కార స్వరాలు అనే రచనలు రోశయ్య కలము నుండి వెలువడిన ఈ ఐదు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖమ్మం కవిరత్నం హెచ్‌విఎల్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ కవులు కళాకారులు మధిర, ఎర్రుపాలెం ప్రాంతాల నుండి ఉద్భవించినారని ఈ సందర్భంగా వారిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ అనుమలు భాస్కరరావు, మరొక వక్త సాహితీ అభిమాని అట్లూరి వెంకటరమణ, పద్య, వచన, కావ్య కర్త, నాటక కర్త, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు అనేక అంతర్జాల తెలుగు పత్రికల్లో వ్యాసకర్త, సాహిత్య విమర్శకులు, గేయ రచయిత ప్రముఖ కార్టూనిస్ట్ వనం వేంకట వరప్రసాదరావు, తిరుమల తిరుపతి దేవస్థానం వ్యాఖ్యత శ్రీ హరి శంకర శర్మ తెలంగాణ రాష్ట్ర ప్రజా సాంస్కృతిక కేంద్ర, రాష్ట్ర బాధ్యులు శ్రీమన్నారాయణ సాహితీ అభిమాని జి.యాదగిరిరావు మొదలగువారు పాల్గొని రోశయ్య రచించిన పుస్తకాలపై సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమానంతరం అతిధులను చిరు సత్కారాలతో సత్కరించారు. రామిశెట్టి చైతన్య వందన సమర్పణ తో సభ ముగిసింది.

సాగు భూములకు పట్టాలు ఇప్పించాలని వినతి

త్వరలోనే సమస్యను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని లక్ష్మీపురం, కొత్తబోడెమల్లె, గ్రామాల్లో సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇప్పించాలంటూ గ్రామంలోని రైతులు ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దృష్టికి తీసుకొచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను అతి త్వరగా పరిష్కరిస్తానని తనను కలిసిన ప్రజలకు హామీ ఇచ్చారు. ఆదివారం సండ్ర వెంకట వీరయ్య మండల పరిధిలోని కొత్త బోడిమల్లె గ్రామానికి చెందిన టీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండుగా పరామర్శించి ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్త తీసుకోవాలని సూచించి ఆర్థిక సహాయం అందించారు. అనంతరం గ్రామస్తులతో మాటామంతి కలిపి ముచ్చటించారు. గ్రామానికి వచ్చిన శాసనసభ్యులు గ్రామస్తులు గ్రామంలో సిమెంటు రహదారి నిర్మించాలని, తమ సాగు చేసుకుంటున్నా భూములకు పట్టాలు ఇప్పించాలని కోరడంతో లక్ష్మీపురం, కొత్త బోడి మల్లె గ్రామ పరిధిలోని సాగు చేసుకుంటున్నా రైతులందరికీ ప్రభుత్వం తరఫున పట్టాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా వారసత్వ పట్టాలను కూడా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావు, మండల యువజన శాఖ అధ్యక్షులు పెడకంటి రామకృష్ణ, మండల పార్టీ కార్యదర్శి కొరకొప్పు ప్రసాద్, రాచమల్ల నాగేశ్వరరావు, పుచ్చకాయల సత్తిరెడ్డి, సోషల్ మీడియా మండల అధ్యక్షులు సిహెచ్. కిరణ్ కుమార్, మండల ఎస్టీ సెల్ నాయకులు అజ్మీర జమలయ్య, నాగిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీరంగం, దనేకుల నాగేశ్వరరావు, వేము యోహాను రాజ్, కనుమతి కృష్ణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



జెడ్పీ ఛైర్మెన్ కోరం దంపతుల సుడిగాలి పర్యటనలు

ఆశీర్వాదాలు, పరామర్శలు

నవతెలంగాణ-ఇల్లందు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ ఛైర్మన్ కోరం కనకయ్య, లక్ష్మీ దంపతులు ఆదివారం మండలంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందిరానగర్ గ్రామ పంచాయ తీ సర్పంచ్ పాయం లలిత భార్గవ్ దంపతుల కుమార్తె చెవులు కుట్టు వేడుకకు హాజరైయ్యారు. చిన్నారి సార్థికవర్ధిని ఆశీర్వదించారు. అనంతరం ఆత్మ కమిటీ ఛైర్మెన్ అజ్మీర భావ్ సింగ్ శాంత కుమారి దంపతుల కుమార్తె అన్న ప్రాసన వేడుకకు హాజరై చిన్నారి ఆధ్యశ్రీ నిఆశీర్వదించారు. అదేవిధంగా అనారోగ్యానికి గురై ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకులు నెల్లూరి సైదులును పరామర్శించి, ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. సుభాష్ నగర్ గ్రామ పంచాయతీకి చెందిన ఇందూరి పోశం కుమారుడు ఇందూరి మధు ఆత్మహత్య చేసుకుని మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ కార్యాక్రమంలో వారివెంట సర్పంచులు తాటి చుక్కమ్మ,కల్తీ పద్మ, ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్, ఉప సర్పంచ్ ఎల్లయ్య, నాయకులు చిట్టిబాబు, నూతలపాటి ఫణి, మడుగు సాంబమూర్తి, బోళ్ళ సూర్యం, చిల్లా శ్రీనివాస్, తాటి బిక్షం, సువర్ణపాక సత్యనారాయణ, ఊరుగొండ ధనుంజయ్, బోర్ రమేష్, గుగ్లోత్ నాగార్జున, రావూరి సతీష్, కుంటా రాజు, ప్రసన్న కుమార్ యాదవ్, శివ, అజ్జు, సాయి తదితరులు పాల్గొన్నారు.



రామారావు స్ఫూర్తితో పోరాడుదాం

సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని

నవతెలంగాణ-సుజాతనగర్

చింతలపూడి రామారావు స్ఫూర్తితో పోరాడదామని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య అన్నారు. ఆదివారం ఆయన సంసరణ సభలో మాట్లాడుతూ 1980లో తాను సుజాతనగర్‌కు వచ్చిన సమయంలో తనకు అండగా ఉండి పార్టీ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. రైతాంగ పోరాటం, కూలి రేట్ల పెంపు, పెత్తందారి వ్యవస్థ పై ప్రజలలో చైతన్యం నింపి పెద్ద ఎత్తున జన సమీకరణ చేసేవాడని అన్నారు. భూస్వామ్య వ్యవస్థ పై పోరాటంలో చింతలపూడి సోదరులు పోరాటంలో కీలక పాత్ర వహించే వారిని అన్నారు. ఆయన ఆశ సాధనకై పోరాడటమే మనమిచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. వీరికి పార్టీలో ప్రత్యేకమైన స్థానం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, కొత్తగూడెం సొసైటీ ఛైర్మన్ మండే వీర హనుమంతరావు, ఆత్మ కమిటీ ఛైర్మన్ బత్తుల వీరయ్య జిల్లా నాయకులు అన్నవరపు సత్యనారాయణ, వీర్ల రమేష్, బీఆర్ఎస్ నాయకులు లావుడియా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలు ఉన్నవారికి ఉచితంగానే ఆపరేషన్లు

నేత్ర వైద్యులు సంజీవరావు

నవతెలంగాణ-పినపాక



కంటి సమస్యలు ఉండి కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు ప్రభుత్వం నుండి చేపిస్తామని నేత్ర వైద్యులు సంజీవరావు తెలియజేశారు. ఆయన పినపాక మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం మాట్లాడారు. పినపాక, కరకగూడెం, మణుగూరు, అశ్వాపురం మండలాల్లో కంటి శుక్లాలు ముదిరిన వారు సోమవారం, బుధవారం మణుగూరు ఏరియా ఆసుపత్రికి వచ్చి కంటి వైద్య పరీక్షలు చేయిచుకోవాలన్నారు. ఆరోగ్య శ్రీ కార్డ్, ఆధార్ కార్డ్ తప్పకుండా తీసుకొని రావాలని నేత్ర వైద్యులు జి.సంజీవరావు కోరారు. ప్రతివారం కంటి వైద్య శిబిరాలు ప్రతి మండలంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బియ్యం వితరణ

నవతెలంగాణ-మణుగూరు

వై ఫర్ యు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసరకులు పంపిణీ చేశారు. ఆదివారం మణుగూరు మండల పరిధిలోని రామానుజవరం గ్రామంలో నివాసం వుంటున్న వసంతమ్మ, రోషమ్మ అనే వృద్ధులకు వై ఫర్ యు చారిటబుల్ ట్రస్ట్ తరుపు నుంచి బియ్యం, నెలకు సరిపడా నిత్యావసరాలను అందించడం జరిగింది. అనంతరం ట్రస్ట్‌ను ఉద్దేశించి ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ... ఎవరూ లేని వృద్ధులకు, నిరుపేదలకు సహాయం అందించడం చాలా ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో ఇలాంటి సహాయ కార్యక్రమాలు మరెన్నో చేయదలిచామని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలంటే ఇటువంటి సహాయ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని తెలిపారు.

జీవన్ శ్రీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

నవతెలంగాణ-అశ్వారావుపేట



మండలంలోని గుమ్మడవల్లిలో అశ్వారావుపేట నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో వైద్యసేవలు అందిస్తున్న జీవన్ శ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ కడిమి సీత ప్రారంభించారు. ఈ శిబిరంలో చుట్టూ పక్కల ఉన్న గ్రామాల నుండి అధిక సంఖ్యలో గిరిజనులు హాజరు అయ్యారు. వీరి అందరికీ వైద్య శిబిరం నందు ఉచితం గా వైద్య పరీక్షలు నిర్వహించి బీపి, షుగర్, వివిధ రకాలైన మందులు ఉచితంగా పంపిణీ చేసారు. ఆరోగ్యం పట్ల సరియైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జీవన్ శ్రీ మల్టీ స్పెషాలిటీ వైద్యులు పూర్ణ చంద్, భవ్య సుధ శ్రీ, ఎంపీటీసీ తిరుపతి రావు, పుట్ట సత్యనారాయణ, బండి చెన్నారెడ్డి, శ్రీను, వెంకటేష్ హాస్పిటల్ సిబ్బంది కిషోర్, సురేష్, బిందు, రత్నవాణి, నర్సింహారావు, కాశీమ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

హమాలీల సంక్షేమాన్ని.. గాలికొదిలిన పాలకులు

- రక్తాన్ని చెమటగా మార్చి ప్రజలకు ప్రభుత్వాలకు సేవలు
- ప్రభుత్వానికి హమాలీ శ్రమనుండి కోట్ల ఆదాయం
- సంక్షేమం కోసం నయాపైసా కేటాయించని ప్రభుత్వాలు
- ఆందోళనకు సిద్ధమవుతున్న హమాలీలు
- సీఐటీయూ ఆధ్వర్యంలో రేపే కలెక్టరేట్ ధర్నా

నవతెలంగాణ-పాల్వంచ

హమాలీలు రక్తాన్ని చెమటగా మార్చి ప్రజలకు, ప్రభుత్వాలకు అనేక సేవలు అందిస్తున్నా పాలకులు మాత్రం వీరిని గాలికి వదిలేసారు. కనీస వేతనాలు లేక కుటుంబాలను గడపలేక అష్టకష్టాలు పడుతున్నారు. కండలను పిండిచేస్తూ అనారోగ్యాల పాలవుతూ, కుటుంబ పోషణ భారం అవుతుంది. అనేకసార్లు సమస్యలపై ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకునే నాధుడే కనిపించడం లేదు. దీంతో ఓపిక నశించిన హమాలీలు తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమయ్యారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 లక్షల మంది హమాలీలు పనిచేస్తున్నారు. ప్రభుత్వ ప్రయివేటు సంస్థలు సివిల్ సప్లయ్ ఎఫ్‌సిఐ, జీసీసీ మార్కెట్ యార్డ్ కోల్డ్ స్టోరేజ్, సిమెంట్ గోదాంలు కూరగాయాలు పండ్లు మార్కెట్ రైస్ ఆయిల్ దాల్ మిల్స్, ఇసుక కంకర క్వారీలు రైల్వే ఆర్టీసి గ్రామీణ బజార్ హమాలీలు ఐకేపి హమాలీలు స్టోర్ వర్కర్స్ ప్రజా పంపిణీ వ్యవస్థలో అనేకరకాల పనులు చేస్తూ రోజుకు 10 నుండి 12 గంటలు ప్రజలకు ప్రభుత్వానికి అనేక రకాల సేవలు చేస్తున్నారు. హమాలీలు నిత్యం బరువులు మోయడం వల్ల శరీరం బండబారిపోతుంది. నడుములు వంగిపోయి నరాలు చచ్చుబడిపోతున్నాయి. దుమ్ముధూలి గాలి వెలుతురు లేక గోదాంలలో పనిచేయడం వల్ల ఊపిరితిత్తులు జబ్బుల బారిన పడుతున్నారు. పనిచేసే క్రమంలో ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. గాయాలపాలై కాల్లు చేతులు విరిగి మంచాలకు పరిమితమై జీవశ్చవంలా మారి హమాలీల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. 50 కిలోలకు మించి హమాలీలతో బరువులు మోయించవద్దని ఐఎల్ఓ తీర్మాణం ఉన్నప్పటికి అధిక బరువులు మోయడం వలన 30 నుండి 40 సంవత్సరాల వరకే ముసలివారవుతున్నారు. ప్రభుత్వానికి హమాలీల శ్రమ నుండి కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా హమాలీల సంక్షేమం కోసం నయాపైసా బడ్జెట్ కేటాయించకపోవడం తీవ్ర అన్యాయం.

కార్మికచట్టాలను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రధానమంత్రి మోడీ కార్మిక వర్గం స్వాతంత్ర్యానికి ముందే సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తున్నాయి. 29 కార్మిక చట్టాలను మార్చి 4 కార్మిక వ్యతిరేక లేబర్ కోట్స్‌ను తెచ్చింది. ఇవి అమలు అయితే కార్మిక హక్కులన్ని హరించుకుపోతాయి. సంఘం పెట్టుకునే హక్కు సమ్మె చేసుకునే హక్కు యజమానులతో బేరసారాలు ఆడే హక్కు 8 గంటల పని విధానం కనీస వేతనాలు ఈపిఎఫ్ ఈఎస్ఐ వంటి చట్టబద్ధ హక్కులు ఎలాంటి సౌకర్యాలు లేకుండా యజమానులకు కట్టుబానిసలుగా మార్చే చర్యలకు మోడి ప్రభుత్వం పూనుకుంది. అసంఘటిత రంగ కార్మికులకు 2008లో తీసుకవచ్చిన సామాజిక భద్రత చట్టాన్ని కూడా ప్రశ్నార్ధకంగా మార్చారు. ప్రభుత్వరంగ సంస్థలకు కారుచౌకగా బడాబాబులకు కట్టబెడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి నిత్యావసర ధరలు పెంచి సామాన్యులపై బారాలు మోపుతున్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం 2014 ఎన్నికల్లో తెలంగాణా ఏర్పాటులో అసంఘటిక కార్మికుల శమ కష్టం ఉంది. వారి సమస్యలు పరిష్కరి స్తామని చెప్పి 9 సంవత్స రాలు కావస్తున్నా పట్టించు కోకపోవడం దారుణ మన్నారు.

ఆందోళనకు సిద్ధమయిన హమాలీలు

హమాలీల గోడును అనేకసార్లు సమస్యలు ప్రభుత్వాల దృష్టికి తీసుకు పోయినా పట్టించు కోకపోడంతో ఆందోళనకు సిద్ధమవుతున్నారు. హమాలీలు అందరికి భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని 50 కేజీలకు మించిన బరువులు నిశేదించారని పనిగంటలకు పనిభద్రత గుర్తింపుకార్డులు కనీస వేతనాలు పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి చట్టబద్ధ హక్కులు కల్పించాలని, ప్రభుత్వ గోదాంలలో పనిచేస్తున్న హమాలీలను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని హమాలీలు అందరికి ఇండ్ల స్థలాలు ఇచ్చి డబుల్ బెడ్‌రూం ఇచ్చి తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 28న కలెక్టరేట్ వద్ద ధర్నాలు, ఏప్రిల్ 27న హైదరాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా తెలంగాణ ఆల్ హమాలీ వర్కింగ్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో కార్యాక్రమాలు చేయనున్నారు.

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి



ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థల్లో హమాలీ కార్మికులు శ్రమ చేస్తున్నారు. ప్రభుత్వానికి సంబంధించి జిసిసి సివిల్ సప్లై, బేవరేజ్ ఎఫ్‌సిఐ వ్యవసాయ మార్కెట్ తదితర సంస్థలతోపాటు ప్రైవేటు విభాగాలు తెలంగాణ రాష్ట్రంలో లక్షల మంది హమాలీ కార్మికులు శ్రమ చేస్తున్నారు. వీరి శ్రమ వల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూర్తుంది. హమాలీ కార్మికులకు ఎటువంటి భద్రత లేక ఇబ్బంది పడుతున్నారు. భవన నిర్మాణ కార్మికుల వలె హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ప్రతి హమాలీ కార్మికుడికి 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్‌ని, పిఎఫ్, ఈఎస్ఐ పెన్షన్స్ సౌకర్యాలను కల్పించాలి. హమాలి కార్మికులకు భద్రత కల్పించడం ప్రభుత్వాలు తమ బాధ్యతగా గుర్తించాలి. హమాలీ కార్మికులకు ప్రభుత్వం అమలు జరిపే అన్ని రకాల సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.

నరేంద్రమోదీ కుట్రలకు ఖండన

నవతెలంగాణ-ములకలపల్లి



రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు భాగంగా నరేంద్ర మోడీ కుట్రలను జెడ్పీటీసీ సున్నం నాగమణి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావులు తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి సున్నం నాగమణి మాట్లాడుతూ రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు పెట్టి, గుజరాత్, సూరత్ కోర్టులో రెండు సంవత్సరాల జైలు శిక్ష పడేలా చేసి, కోర్టు ఇచ్చిన తీర్పులోనే హైకోర్టుకు వెళ్లడానికి నెల రోజులు సమయం ఇచ్చినప్పటికీ లోక్ సభ స్పీకర్ ఆ నెల రోజులు ఆగకుండా రాజ్యాంగ స్ఫూర్తిని పరిగణలోకి తీసుకోకుండా పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. దేశ ప్రజాస్వామ్యం కోసం రాహుల్ గాంధీ కుటుంబం రక్తం ధారబోసింది. అలాంటి ప్రజాస్వామ్యాన్ని అణచివేసేందుకు మోడీ సర్కారు ప్రయత్నిస్తుందన్నారు. ప్రాణ త్యాగం చేసిన ప్రధాని కుమారుడైన రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయడం కక్ష సాధింపు చర్యగా భావిస్తున్నామన్నారు. రాహుల్ గాంధీ చూస్తుంటే మరో మహాత్మా గాంధీని మళ్లీ చూస్తున్నట్టే కళ్ళు చెమ్మగిల్లుతున్నాయన్నారు. ఈ రోజుల్లో రాహుల్ గాంధీ లాంటి నిజాయితీగల నాయకుడు దేశంలో ఉన్నందుకు మేము గర్విస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి రత్న భూషణం, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పామర్తి కృష్ణారావు, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమల నరసింహారావు, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అచ్చన వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, కొంద్రు రవి, మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, ఖాదర్ బాబా, గుంటూరు ముత్తయ్య, మేడిశెట్టి సూరయ్య, నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు.

బస్తీలలో నీటి ఎద్దడి

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- సమస్య పరిష్కరిస్తాం : కమిషనర్

నవతెలంగాణ-ఇల్లందు



మున్సిపాలిటీ పరిధిలో 4, 5, 6 వార్డుల్లో నీటి ఎద్దడి నెలకొన్నది. గత నాలుగు రోజులుగా నీటి సరఫరా కావడం లేదు. దీంతో మహిళలు బిందెలు పట్టుకొని నీటికోసం బోర్లు బావులున్న చోటుకు వెళుతున్నారు. ఇంట్లో నీరు లేకపోవడం తో మహిళలు పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. అప్పుడప్పుడు ఏదో ఒక వార్డుల్లో పైపులు పగులుతూనే ఉన్నాయి. మున్సిపల్ సిబ్బంది రిపేర్లు చేస్తూనే ఉన్నారు. ఏటా లక్షల రూపాయలు ఖర్చు అవుతూనే ఉన్నది. నాలుగు రోజులుగా పంపులు రాకపోవడంతో వేసవి సమీపించక ముందే నీటి కష్టాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేవలం ఒక మిషన్ భగీరథ వాటర్ ద్వారానే నీటి సప్లై ఇవ్వడం వల్ల పైప్ లైన్లు పగిలినప్పుడు లేదా పై నుండి గోదావరి నుంచి వచ్చే వాటర్ ఆగినప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో బోర్ లైన్ ద్వారా లేదా చెరువు ద్వారా, కోటి లింగాల ద్వారా వాటర్ సప్లై జరుగుతున్నప్పటికీ సమర్థవంతంగా జరుగుతున్న వాటర్ సప్లై నిలిపివేసి కంప్లీట్‌గా ఒక్క మిషన్ భగీరథ వాటర్ మీద ఆధారపడడంతో భవిష్యత్తులో మరిన్ని సమస్యలు ఎదుర్కోక తప్పదని పరిస్థితి ఉంది.

సమస్య పరిష్కరిస్తాం : కమిషనర్

మిషన్ భగీరథ పైపులు పగిలిపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని సమస్య పరిష్కరిస్తామని కమిషనర్ అంకుల్ షావలి నవతెలంగాణకు తెలిపారు. సోమవారం నుండి నీటి సరఫరా యధావిధిగా జరగనుంది అనేది తెలిపారు.



బెక్కంటికి నంది పురస్కారం

నవతెలంగాణ-భద్రాచలం

తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలలో ఆదివారం జరిగిన జాతీయ కూచిపూడి ఉత్సవంలో నంది పురస్కారంతోపాటు బంగారు కంకణాన్ని భద్రాచలం పట్టణానికి చెందిన టీచర్ బెక్కంటి శ్రీనివాసరావు అందుకున్నారు. జాతీయ నృత్య కళాకారుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత వేదాంత వేదాంతం రాకేష్ శ్యామ్ చేతుల మీదుగా బెక్కంటి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు బెక్కంటిని అభినందించారు.

నిరుపేదలకు అన్నదానం చేయడం సంతోషకరం

నవతెలంగాణ-చర్ల



అర్ధాకలతో అలమడిస్తున్న నిరుపేదలకు అన్నదానం చేయడం చాలా సంతోషకరంగా ఉందని సీనియర్ పాత్రికేయులు జవ్వాది మురళీకృష్ణ అన్నారు. ప్రతి వారాంతపు సంతలో జరిగే అన్నదాన కార్యక్రమానికి మీకోసం మేమున్నాం కమిటీ నిర్వహించే ఆదివారం అన్నదానం 71వ వారం కార్యక్రమంలో భాగంగా, దాతలు 1985-86 పదవ తరగతి బ్యాచ్ సాకారంతో ఆ బ్యాచ్ విద్యార్థి అయిన జవ్వాది మురళీకృష్ణ (మున్ని) మాట్లాడారు. చర్ల పూర్వ విద్యార్థుల వితరణతో ఆదివారం మధ్యాహ్నం 12.30కు చర్ల గాంధీబొమ్మ సెంటర్ వద్ద సుమారు 350 మందికి అన్న సంతర్పణ చేయడం జరిగిందని సంస్థ ఛైర్మన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ... మండుటెండలో సంతకు వచ్చే ఆదివాసీలకు భోజన వసతి కల్పించడంలో సహకరిస్తున్న మిత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని, మనం అనవసర ఖర్చులు తగ్గించుకొని, ఈ విధంగా పేదవారి ఆకలి తీర్చడం అనేది మహాద్భుతమని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిటాల రమణ మాష్టారు, జవ్వాది మురళీకృష్ణ, ఉమ్మలేటి మల్లికార్జునరావు, దొడ్డి రమణారావు, మర్ల రాజా, ప్రసాద్ మాష్టారు, దొడ్డి తాతారావు, కొమరవరపు రవి, మండలోజు చారి,, సాయి, కొంగూరు రమణారావు, మహబూబ్ ఖాన్, రవి,సూరిబాబు, పంపన రాము తదితరులు పాల్గొన్నారు.



మానవత్వానికి మారుపేరు ఫ్రెండ్స్ యూత్ ట్రస్ట్

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లి బంజర్ గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదివారం కొత్తగూడెంకు చెందిన ఫ్రెండ్స్ యూత్ ట్రస్ట్ పరీక్ష సామాగ్రి అయిన, ఫ్యాట్స్, పెన్నులు, పెన్సిల్లు, జామెంట్రీ బాక్సు మెటీరియల్‌లను అందించి మానవత్వానికి మారుపేరుగా నిలిచారు. ఈ ట్రస్ట్ కరోనా, గోదావరి వరదల సమయంలో కూడా అనేక సేవా కార్యక్రమాలు అందించి పలువురు అభాగ్యులకు ఆహారం అందించి అన్నదాతలుగా మిగిలిపోయారు. అదేవిధంగా తలసీమియా వంటి వ్యాధి సేకరణ రోగులకు వైద్య ఖర్చులకోసం అనేక సేవా కార్యక్రమం చేపట్టారు. మానవసేవే మాధవసేవ అనే లక్ష్యంతో ఈ ఫ్రెండ్స్ యూత్ ట్రస్ట్ వారు ముందుకు సాగుతున్నారు. అనంతరం ట్రస్టు సభ్యుడు నందు మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రతి విద్యార్థి కూడా బంగారు బాట వేసుకోవాలని అందుకు కావలసిన వసతులు సమకూర్చుకునే విధంగా కృషి చేయాలని ఆయన అన్నారు. విద్య పట్ల తాము ఎప్పుడు సహాయ సహకారాలు అందించ డానికి సిద్ధంగా ఉన్నా మన్నారు. భవిష్యత్తులో ప్రతి విద్యార్థి మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సుమారు 30 మంది విద్యార్థులకు పరీక్ష సమగ్రని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కే.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు టి.మోహన్ బాబు, బాలు, అనురాధ, భాస్కర్, ఫ్రెండ్స్ యూత్ ఫౌండేషన్ ఫౌండర్ సిహెచ్ శ్రీకాంత్, సభ్యులు శివ జస్సు నాని మోహన్ నందు, చేయూత ట్రస్ట్ ఫౌండర్ జక్కిరెడ్డి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాముని సేవలో శ్రీ నృసింహసేవా వాహిని

నవతెలంగాణ-భద్రాచలం

శ్రీ సీతారామ కళ్యాణం, 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పుష్కర పట్టాభిషేకం సందర్భంగా భద్రాద్రి విచ్చేస్తున్నటువంటి భక్తులకు శ్రీ నృసింహ సేవా వాహిని ఆధ్వర్యంలో సుమారు 200 మంది వాలంటీర్లు గత మూడు రోజులుగా వివిధ రకాలైన సేవలను అందిస్తున్నారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు కృష్ణ చైతన్య స్వామి మాట్లాడుతూ ఈ భద్రాద్రి పుణ్యక్షేత్రంలో ఈ సంవత్సరం శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేకం సందర్భంగా విచ్చేస్తున్నటువంటి భక్తులకు సేవలందించడం మా పూర్వజన్మ సుకతంగా భావిస్తున్నామని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎంతోమంది శ్రీ నృసింహసేవాహిని సభ్యులు వాలంటీర్లుగా తమ తమ సేవలను అందిస్తున్నారని అన్నారు. రాములోరి కళ్యాణం, పుష్కర పట్టాభిషేకం వరకు తమ సేవలను అందించనున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, వాలంటీర్లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన భద్రాద్రి

నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున భద్రాచలం వచ్చి భద్రాద్రి రాముని దర్శించుకున్నారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం రామున్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం 27 మార్చి 2023

విద్య ఆరోగ్యంతోనే ఉజ్వల భవిష్యత్తు

- హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు



నవతెలంగాణ-సుజాతనగర్

విద్య, ఆరోగ్యం, ఉపాధితోనే ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలంగాణ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించి మాట్లాడారు. తనను ఒక కుటుంబ సభ్యుడిగా భావించి తను వేసే ప్రతి అడుగులో ప్రజలందరూ భాగస్వాములై ముందుకు నడిపించాలని కోరారు. తాను పుట్టి పెరిగిన ప్రజలకు ఈ విధంగా సేవ చేసుకోవటం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. మెగా క్యాంపులో పాల్గొన్న స్టార్ హాస్పిటల్స్ హైదరాబాద్, కిమ్స్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ మెగా క్యాంపులో మొత్తం 3652 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుజాతనగర్ సర్పంచ్ సికా కృష్ణవేణి, ఉప సర్పంచ్ లింగం పిచ్చి రెడ్డి, జడ్పీఎస్ స్కూల్ చైర్మన్ కె.కృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ బోడ హరి, ఆర్ఎంపీ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడే కలెక్టరేట్‌లో ప్రజావాణి

నవతెలంగాణ-పాల్వంచ

27వ తేదీ సోమవారం ఐడిఓసి (కలెక్టరేట్) కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని డిఆర్ఓ అశోక్ చక్రవర్తి తెలిపారు. ప్రజలు వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదును అందచేయాలని ఆయన చెప్పారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

ఆరోగ్యశ్రీలో పనిచేస్తున్న వారికి తక్కువ వేతనాలు ఇస్తున్నారని, వారికి కనీస వేతనాలు ఇవ్వాలని యూనియన్ నాయకులు అన్నారు. ఆదివారం వారు మాట్లాడారు. 15 ఏండ్ల నుండి ఆరోగ్య శ్రీలో పనిచేస్తున్న వారికి జీతాలు పెంచాలని, ఆరోగ్య మిత్రులు అందరూ డిగ్రీ, పీజీలు చదివి కంప్యూటర్ నాలెడ్జ్ కలిగి ఉన్నారని, స్కిల్ ఎంప్లాయ్‌గా గుర్తించాలన్నారు. ఆరోగ్య మిత్రుల జీతాలు, ఔట్సోర్సింగ్ ద్వారా కాకుండా ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా ఇవ్వాలని, ఆరోగ్యశ్రీ ఉద్యోగులందరికీ భద్రత కల్పించాలన్నారు. డ్యూటీ సమయంలో మరణించిన ఆరోగ్య మిత్ర కుటుంబాన్ని ఆదుకోని, వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాన్నారు. ప్రభుత్వ హాలిడేస్ ఆరోగ్యశ్రీ ఉద్యోగులకి వర్తించేలా చేయాలని యూనియన్ నాయకులు తెలిపారు.

ఈ నెల 28న సంత వేలం పాట

నవతెలంగాణ-టేకుల్లపల్లి

మండల కేంద్రమైన టేకులపల్లిలోని శ్రీ కోదండ రామాలయం ఆవరణలో జరిగే శనివారం వారంతపు సంత వేలంపాట ఈ నెల 28న నిర్వహించబడునని టేకులపల్లి, గోలియా తండా పంచాయతీ కార్యదర్శులు సంయుక్త ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఆసక్తి గలవారు ఉదయం 11 గంటలకు గోలియా తండా గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచుల అధ్యక్షతన జరిగే వేలంపాట రాగలరని తెలిపారు. వేలం పాటలో కమిటీ నియమించిన నిబంధనలకు కట్టుబడి ఉండాలని సూచించారు.

కంటి ఆపరేషన్స్ చేయించుకోవాలనుకొనే వారికి శుభవార్త

నవతెలంగాణ-మణుగూరు

కంటి ఆపరేషన్ చేయించుకోవాలని అనుకునే వారికి శుభవార్తని ఏరియా కంటి వైద్య నిపుణులు జి.సంజీవరావు అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పినపాక, కరకగూడెం, మణుగూరు, అశ్వాపురం మండలాల్లో కంటి శుక్లాలు ముదిరిన వారికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సోమ, బుధవారం మణుగూరు ఏరియా ఆసుపత్రికి వచ్చి కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్స్ చేస్తున్నారు. ఆరోగ్య శ్రీ కార్డ్, ఆధార్ కార్డ్ తీసుకొనిరాగలరని తెలిపారు.

వైద్యశిబిరానికి అపూర్వ స్పందన

నవతెలంగాణ-ములకలపల్లి

మండల పరిధిలోని తోగ్గూడెంలో పాల్వంచకు చెందిన గౌరీ హాస్పటల్ వైద్యులు సోమరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి ఆదివారం అపూర్వ స్పందన లభించింది. శిబిరానికి 345 మంది హాజరై తమ వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో వైద్యులు సోమరాజు దొర, శ్రీనివాస్, సింధులు 345 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, చిన్నారులకు బీపీ, షుగర్, ఆస్తమా, థైరాయిడ్ పరీక్షలతో పాటు జ్వరం తదితర పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు సోమరాజు మాట్లాడుతూ నాలుగేళ్ల కాలంలో 11 ఉచిత శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, కరోనా సమయంలో 15 గిరిజన గ్రామాలకు నిత్యావసర సరుకులు అందించామని, ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్న ప్రతి రోగికి మామిడిమొక్కను పంపిణీ చేయడం జరిగిందని, టీబీ వ్యాధిపై గిరిజన గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ శిబిరంలో సర్పంచ్ గడ్డం భవానీ, నాతనేలు, సోయం చిన్నారి, వెల్కం నగేష్, సున్నం నగేష్, ఊకే కృష్ణ, మడకం చిరుమప్ప, భీమన్న, గుంటూరు సాయి, రాంబాబు, సత్యనారాయణ, ప్రసాద్, రవి, మిత్రసేన, గౌరీ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్టు పంపిణీ

నవతెలంగాణ-పినపాక

పినపాక మండలం జానంపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఎస్సీ కాలనీలో యువతకు వాలీబాల్ నెట్, వాలీ బాల్‌లను పాయం యువసేన ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. పినపాక మాజీ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు అందజేసినట్లు తెలియజేశారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా యువతకు వాలీబాల్ ఇట్లు అందజేసినట్లు తెలిపారు. యువత క్రీడల్లో రాణించి జానంపేట గ్రామపంచాయతీకి పినపాక నియోజకవర్గం పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. త్వరలో నియోజకవర్గ పరిధిలో వాలీబాల్ టోర్నమెంట్ సైతం ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఎస్ఆర్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఆలయానికి వంట పాత్రలు అందజేత

నవతెలంగాణ-చండ్రుగొండ



మండలంలోని పోకల గూడెం గ్రామ ప్రధాన సెంటర్లో శ్రీపెద్దమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో ప్రతి ఆదివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి వంట పాత్రలు పోకలగూడెం వాస్తవ్యులు కీ.శే.వీరమళ్ళ లక్ష్మయ్య జ్ఞాపకార్థం వారి మనవలు వీరమళ్ళ పవన్, ఫణీంద్రలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ బూరుగు వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ సభ్యులు గుగులోతు శ్రీనివాస్, వీరమల్ల సత్యనారాయణ, జంపుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి చెందిన షాపులు వేలం

నవతెలంగాణ-చండ్రుగొండ

చండ్రుగొండ పంచాయతీకి చెందిన కాంప్లెక్స్‌లోని షాపులను శనివారం అద్దె నిమిత్తం వేలంపాట నిర్వహించారు. కాంప్లెక్స్‌లో మొత్తం గదులు ఉండగా 2వ గదిలో ఉండగా 1, 3, 4 నెంబర్లు గల షాపులకు వేలంపాట నిర్వహించారు. అయితే 1, 3వ నెంబర్ గదులకు మాత్రమే వేలంపాట జరిగిందని పంచాయతీ కార్యదర్శి ఉపేందర్ తెలిపారు. నాలుగవ నెంబర్ షాపు కోసం ఎవరూ రాలేదని ఆ కారణంగా సోమవారం మిగిలిన గదిని కూడా వేలంపాట నిర్వహిస్తామన్నారు. 1వ నెంబర్ షాపు రూ.65వేలు, 3వ నెంబర్ షాపు రూ.64వేలకు పాడుకున్నారని అన్నారు. ఈ వేలం పాటలో పంచాయతీ ఉపసర్పంచ్ బాబురావు, వార్డు నెంబర్లు స్వర్ణం నాగభూషణం, నీలవర్మ, పంచాయతీ కో ఆప్షన్ సభ్యులు బుంగ శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువకులపై కేసు నమోదు

నవతెలంగాణ-అశ్వారావుపేట

విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌ను అడ్డుకున్న ముగ్గురు యువకులపై ఆదివారం కేసు నమోదు అయింది. ఎస్‌హెచ్‌ఓ ఎస్ఐ బి.రాజేష్ కుమార్ తెలిపిన సమాచారం ప్రకారం పట్టణంలోని చింతలబజారులో కానిస్టేబుల్ సంతోష్ పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తుండగా, ఇదే ప్రాంతానికి చెందిన సీహెచ్ సతీష్, గోపి, నర్సింహారావు అనే యువకులను అక్కడి నుంచి వెళ్లి పోవాల్సిందిగా సూచించాడు. దాంతో ఆ ముగ్గురు యువకులు కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగారు. విధులకు ఆటంకం కలిగించారు. దీనిపై కానిస్టేబుల్ చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘోర రోడ్డు ప్రమాదం



నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు మండలం విజయనగరం ప్రధాన రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టిన సంఘటనలో ముగ్గురికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఆదివారం తెల్లాపురం పంచాయతీ విజయనగరం పెట్రోల్ బంక్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఆ వాహనాలపై ప్రయాణించే ముగ్గురు వ్యక్తులు అపస్మార్క స్థితిలోకి వెళ్లారు. వారిని మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించి అక్కడి నుండి భద్రాచలం మెయిన్ ఆసుపత్రి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వారి వివరాలు తెలియాల్సి ఉన్నది. కారణంగా పోలీసులు వెల్లడించలేకపోయారు. భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారుపూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్



కొత్తగూడెంలో మాట్లాడుతున్న భూపాల్

నవతెలంగాణ-కొత్తగూడెం

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక లేబర్ కోడ్‌లకు, విద్యుత్ చట్ట సవరణకు ఏప్రిల్ 5న ఛలో డిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియూ రాష్ట్ర ఉపాధ్యాక్షులు భూపాల్ పిలుపు నిచ్చారు. ఆదివారం కొత్తగూడెంలో జిల్లా సిఐటియూ కార్యాలయంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (ఎస్సీకేఎస్) రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం దూలం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా రెడ్ కార్పెట్స్ వేసి, దేశ సంపదను దోచి పెట్టేందుకే 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలకు మోడీ ప్రభుత్వం వేగం పెంచిందన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకం చాలా రక్షణగా ఉంటే, కేవలం రూ.65 వేల కోట్లను మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారని ఆరోపించారు. రైతులకు అండగా ఉంటామని, మద్దతు ధర ఇస్తామని చెప్పిన మోడీ రైతు వ్యతిరేఖ విధానాలను అమలు చేస్తున్నారన్నారని మండి పడ్డారు. ప్రభుత్వం అదానీకి దేశ సంపదను ఇప్పటికే దోచి పెడుతుందని విమర్శించారు. ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నించిన వారిని దేశ ద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని, కేసులు పెట్టి, వేధిస్తున్నారని అన్నారు. ఈ విధానాలను ప్రశ్నించి, ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళే కృషి చేస్తున్నామన్నారు. సంపద సృష్టి కర్తలుగా ఉన్న కార్మిక, వ్యవసాయ కార్మికరైతుల పట్ల, వారి పోరాటాల పట్ల తీవ్ర అణచివేత చర్యలకు పాల్పడుతున్నాయన్నారు. ఈ విధానాలను తిప్పి కొట్టేందుకు ఏప్రిల్ 5న ఛలో డిల్లీ కార్యక్రమం 5 లక్షల మందితో జరుగుతుందని, ఈ కార్యక్రమంలో వేలాది మంది కార్మిక వర్గం రాష్ట్రం నుండి పెద్ద ఎత్తున బయలు దేరుతున్నారాన్నారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు, సిఐటియూ రాష్ట్ర కార్యదర్శి ఏజె.రమేష్, ఎస్సీకేఎస్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ యరగాని కృష్ణయ్య, గడ్డల శ్రీనివాస్, సూరం ఐలయ్య, కుమార్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : రైతు చట్టాలకు తూట్లు పొడుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా కార్మిక, కర్షక, రైతు హక్కులకై ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, సీఐటీయూ డివిజన్ కన్వీనర్ ఎస్.ఏ.నబి పిలుపునిచ్చారు. ఆదివారం ఏలూరు భవనం నందు ప్రజాసంఘాల పోస్టర్ అవిస్కరించి వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పరిపాలన వచ్చిన తర్వాత ప్రైవేట్ కార్పొరేషన్ శక్తులకు లోబడి రైతు, కార్మికలకు వ్యతిరేకంగా అనేక చట్టాలు తెచ్చి వారిని ఇబ్బందులు గురి చేస్తున్నారని, వీరి అరాచక పాలనకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొని రైతు, కార్మిక, కర్షకులందరు ఢిల్లీలో ముక్తకంఠంతో నినాదిస్తూ మోడీ విధి విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.



ఇల్లందు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-అశ్వారావుపేట

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..ఏపీలోని ఏలూరు జిల్లా టీ.నర్సాపురం మండలం మక్కినవారిగూడెంకు చెందిన రామారావు, సోమాలమ్మ దంపతుల కుమారుడు గుడిదల ప్రభాస్ (21) గడిచిన ఏడాది కాలంగా అశ్వారావుపేట మండలంలోని పేరాయిగూడెంలో గల అమ్మమ్మ నార్లపాటి సూరి బాయమ్మ వద్ద ఉంటూ స్థానికంగా ఓ మెకానిక్ షెడ్డులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం ఇంటి వద్ద నుంచి జంగారెడ్డిగూడెం రోడ్లో గల పెట్రోల్ బంకు వద్దకు ద్విచక్రవాహనం పై వెళ్తుండగా వెనుక వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన గుర్తు తెలియని కారు ఢీ కొట్టగా ఎదురుగా వచ్చిన లారీ కింద పడిపోయాడు. లారీ ముందు టైర్లు ప్రభాస్ పై ఎక్కడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి శవ పంచనామా జరిపించారు. మృతుని సమీప బంధువు ఫిర్యాదు మేరకు ఎస్.ఎచ్.ఒ ఎస్.ఐ బీ.రాజేశ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్క కాటు బారిన పడకుండా రక్షణ చర్యలు చేపట్టాలి

- సమస్యాత్మక ప్రాంతాన్ని గుర్తించి దృష్టి సాధించాలి
- కలెక్టర్ అనుదీప్



నవతెలంగాణ-పాల్వంచ

ప్రజలు కుక్క కాటుకు గురయ్యే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ప్రజలు కుక్కకాటుకు గురయ్యే ప్రాంతాల గుర్తింపు, వైద్య సేవలు, వృద్ధి నియంత్రణకు శస్త్ర చికిత్సలు నిర్వహణ తదితర అంశాలపై మున్సిపల్, పంచాయతీ, వైద్య, పశు సంవర్ధక అధికారులతో టెలి కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కల కాటు బారిన పడకుండా రక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. కుక్కల వృద్ధిని తగ్గించేందుకు ప్రతి రోజు లక్ష్యాన్ని నిర్దేశించుకుని వృద్ధి నియంత్రణకు నియంత్రణ ఆపరేషన్లు చేయాలని చెప్పారు. సోమవారం నుండి ఆపరేషన్లు ముమ్మరం చేసేందుకు అదనపు వైద్య టీములను ఏర్పాటు చేయాలని పశు సంవర్ధక అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు. కుక్కల రవాణాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని చెప్పారు. కుక్కలు పట్టుకునే వారిని ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్క కాటుకు గురైన ప్రజలకు వేసే వాక్సిన్, మందులను అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ కాన్ఫెరెన్సులో డీపీఓ రమాకాంత్, జిల్లా వైద్యాధికారి డా.శిరీష, ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.రవి బాబు, పశు సంర్ధక శాఖ డీడీ డా.పురందర్, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్



నవతెలంగాణ-కొత్తగూడెం

అవినీతి రహిత సమాజం కోసం ప్రతీఒక్కరూ కృషి చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ పిలుపు నిచ్చారు. ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో అవినీతి పేరుకుపోయిందని దాన్ని అంతమొందిచాలని అక్రమార్కులు, అవినీతి పరులు అడ్డదారిలో సంపాదించిన సొమ్ముతో రాజకీయాల్లోకి వచ్చి వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు డబ్బు సంచులతో ఊర్లలో మకాం వేసి ఓట్లను డబ్బులతో కొనుగోలు చేసి రాజకీయ పబ్బం గడుపుకిని సేవా దృక్పదంతో చేయాల్సిన రాయకీయా సేవను బ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. బ్యూరో క్రాట్, కార్పొరేట్ వ్యవస్థ ముసుగులో ఉండి అక్కడ సంపాదించిన అక్రమ సంపాదన పెట్టుబడిగా పెట్టి రాజకీయ వ్యభిచారం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఈ ప్రయత్నాలు తిప్పి కొట్టాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న వారిని, యువతను వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే కొత్తగూడెం అభివృద్ధి దిశగా దూసుకుపోతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న వారికి, స్థానికంగా ఉండే వారికి మాత్రమే అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయి, చెనిగారపు నిరంజన్ కుమార్, సందేల సందీప్, తాటి పాముల హరికృష్ణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ అనుదీప్



నవతెలంగాణ-పాల్వంచ

గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, చిన్న పిల్లలు కౌమారదశలో ఉన్న బాలికలలో పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడానికి నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఐడీఓసీ సమావేశపు హాలులో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషన్ పక్వాడా కార్యక్రమం ఈ నెల 20వ తేదీ నుండి నుండి వచ్చే నెల 3వ తేదీ వరకు 15 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పోషణ లోపం నివారణకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేసి పరిపూర్ణ ఆరోగ్య వంతులను తయారు చేయాలని ఆయన చెప్పారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా సంక్షేమాధికారి లేనీనా, జడ్పి సీఈఓ విద్యాలత, డీఆర్డీఓ మధుసూదన్ రాజు, డీపీఓ రమాకాంత్, డిపిఆర్ శ్రీనివాస్, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి ఎటువంటి నష్టం లేదు

- అన్నె సత్యనారాయణ మూర్తి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

పొంగులేటి ఆత్మీయ సమ్మేళనంతో మండలంలో బీఆర్ఎస్ పార్టీకి ఎటువంటి నష్టం లేదని పార్టీ మండల అధ్యక్షులు అన్నే సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం లక్ష్మీనగరం పార్టీ మండల కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీకి చెందిన కొందరు ప్రజా ప్రతినిదులు వారి వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీని వీడినంత మాత్రాన పార్టీ తగ్గదని, వాళ్ళని ప్రజాప్రతినిధులుగా గెలిపించిన గ్రామ స్థాయి నాయకత్వం పార్టీకి అండగానే ఉన్నారన్నారని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం పనిచేస్తుందని అన్నారు. మండల అధ్యక్షులు అన్నె సత్యనారాయణ మూర్తి అన్నారు. సీఎం కేసీఆర్ ప్రజా శ్రేయస్సు కోసం అనేక సంక్షేమ పథకాలు చేపన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతీ కార్యకర్తలు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మీ, మండల ప్రధానకార్యదర్శి కణితి రాముడు, అధికారప్రతినిది జానీపాషా, ఉపాధ్యక్షులు తునికి కామేష్, ఎంపీటీసీ తెల్లం భీమరాజు, సర్పంచ్ అండ్ దిశ కమిటీ సభ్యులు మట్ట వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ అప్పారావు, కార్యదర్శులు కణితి లక్ష్మణ్, కెళ్ల శేఖర్, ప్రచార కమిటీ అధ్యక్షులు దామెర్ల శ్రీనివాస్, మోత్కూరి శ్రీకాంత్, గిరిజన సంఘం నాయకులు పోడియం సుబ్బారావు, సోడి సురేష్, నాయకులు జిలకర గంగరాజు, రాము, సవలం భద్రయ్య, కోటేశ్వరరావు, రాంబాబు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జానంపేట పంచాయతీలో ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-పినపాక



పినపాక మండలం జానంపేట పంచాయతీలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీటీసీ పొలిశెట్టి హరీష్ ఆధ్వర్యంలో యువతకు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ పరిధిలోగల గ్రామాలలో యువతతో ఆయన జానంపేటలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలను ప్రతిదీ తెలియజేయాలని కోరారు. అర్హులకు పింఛన్ రాకుండా ఉన్న ఇతర సమస్యలను తెలియజేస్తే అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శశికాంత్, సంకీర్త, మడి అరుణ్, దొరబాబు, కళ్యాణ్, సాయి, కన్నారావు, వినయ్, సురేష్,శివ, నరేష్, అశోక్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానంకు 50 క్వింటాల బియ్యం వితరణ

నవతెలంగాణ-భద్రాచలం

మణుగూరుకు చెందిన సుబ్బారావు అనే భక్తులు శ్రీరామ నవమి సందర్భంగా అన్నదన నిమిత్తం 50 క్వింటాల్ బియ్యం విరాళంగా ఈఓ రమాదేవికి అందించారు. ఈ బియ్యం భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

సీతారామరావును పరామర్శించిన బీఆర్ఎస్ మండల నాయకులు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై భద్రాచలంలోని ఓ ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్తూరి సీతారామారావును బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ఆదివారం దుమ్ముగూడెం గ్రామంలోని ఆయన నివాస గృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకోవడంతో పాటు కొన్ని రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షులు అన్నె సత్యనారాయణ మూర్తి, ఎంపీపీ రేసు లక్ష్మీ, పార్టీ మండల కార్యదర్శి కణితి రాముడు, పార్టీ అధికారప్రతినిది ఎండి జానిపాషా, నాయకులు తునికి కామేష్ ప్రచారకమిటీ అధ్యక్షులు దామెర్ల శ్రీనివాసరావు, పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కెల్లా శేఖర్, పోడియం సుబ్బారావు జిలకర గంగరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఇల్లందు

కార్మికవర్గ హక్కుల సాధనకోసం, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిరంతరం చిత్తశుద్ధితో పోరాడుతున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టియు) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ హమాలి అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలు లింగయ్య, సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి కొండపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఐఎఫ్టియు రాష్ట్ర మహాసభల గోడ పత్రికను ఇల్లందులో హమాలీ వర్కర్స్ యూనియన్, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 2న కొత్తగూడెంలో వేలాదిమంది కార్మికులతో మహాప్రదర్శన నిర్వహించబడుతుందని అనంతరం కొత్తగూడెం క్లబ్లో నిర్వహిస్తున్న బహిరంగ సభలో ఐఎఫ్టియు జాతీయ అధ్యక్షులు సాదినేని వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్, లక్ష్మీనారా యణ, పశ్చిమబెంగాల్ కార్మిక నాయకులు అమితాబ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆరేల్లి కృష్ణ, ఎం.శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.అనురాధ, సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాసుద్దిన్ ప్రసంగిస్తారని వారు తెలిపారు.

భద్రాద్రి రామునికి ముత్తంగి కవచాలు సమర్పణ

నవతెలంగాణ-భద్రాచలం

హైదరాబాద్ వాస్తవ్యులు సంతోష్ రెడ్డి దంపతులు ప్రతి సోమవారం శ్రీ రామచంద్ర మహాప్రభు వారికి అలంకరించు ముత్తంగి అలంకారం నిమిత్తం నూతన ముత్తంగి కవచాలను అందజేశారు. ఆదివారం భద్రాచలం వచ్చిన వారు రామాలయం యాగశాల వద్ద ఈవోకి సమర్పించారు. దీని విలువ సుమారు 30 లక్షల రూపాయలు ఉంటుందని వారు వెల్లడించారు.

కొత్తగూడెంలో బీఆర్ఎస్ పార్టీకి ఎదురు లేదు

- అభివృద్ధిని తట్టుకోలేక తప్పుడు ప్రచారాలు
- ప్రతిపక్షాల విమర్శలను తిప్పి కొట్టండి
- పాండురంగాపురం ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే



నవతెలంగాణ-పాల్వంచ

కొత్తగూడెం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ఎదురులేదని, అభివృద్ధిని తట్టుకోలేకనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పాల్వంచ మండలం పాండురంగాపురం ఆత్మీయ సమ్మేళనంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని ప్రసంగిస్తూ అన్ని సర్వే రిపోర్టులు మనకే అనుకూలంగా ఉన్నాయన్నారు. ప్రతిపక్షాలు చేస్తూ విమర్శలు అన్నిటిని కార్యకర్తలకు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లడమే ధ్యేయం అని తెలిపారు. పార్టీకి బలం-బలగం కార్యకర్తలే అందుకే కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనాలు అన్నారు. ఒకవైపు అభివృద్ధి, ఇంకోవైపు పార్టీ అభివృద్ధి నా ధ్యేయం చెప్పారు. కార్యకర్తలను కుటుంబంగా చూసుకుంటాం. ఏ ఆపద వచ్చినా వనమా కడుపులో పెట్టుకొని చూసుకుంటాడని చెప్పారు. వచ్చేది మరల మన ప్రభుత్వమే అన్నారు. 3000 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి శరవేగంగా సాగుతున్నదన్నారు.

పక్కా ప్రణాళికతో రాష్ట్రం అభివృద్ధి

కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో ముందుకు పోదాం..ప్రాణం ఉన్నంతవరకు తుది శ్వాస ఉన్నంతవరకు ప్రజలకు సేవ చేస్తా.. కొత్తగూడెం పాల్వంచ పట్టణాలను జంట నగరాలుగా తీర్చిదిద్దుతున్నా అని తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పూసల విశ్వనాథం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వనమా రాఘవేంద్రరావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీపీ సరస్వతి, వైస్ ఎంపీపీ మార్గం గురవయ్య, పెద్దమ్మతల్లి గుడి చైర్మన్ మహిపతి రామలింగం, సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, పట్టణ అధ్యక్షులు మంతపురి రాజుగౌడ్, మండల అధ్యక్షులు మల్లెల శ్రీరామ్మూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ భుక్యా రాంబాబు, ఎంపీటీసీ ఉంద్రాతి రవి, పెద్దమ్మతల్లి డైరెక్టర్లు ఎస్విఆర్కె ఆచార్యులు, ఆడెపు చిన్న వెంకటరామయ్య, ముత్యాల ప్రవీణ్, బండి చిన్న వెంకటేశ్వర్లు, బేతంశెట్టి విజయ్, పాయం పాపయ్య, సర్పంచులు అజ్మీర జగదీష్, భూక్య రమేష్, కొమరం రాణి, జీవన్ రెడ్డి, గుగులోత్ రాంబాబు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఈ పండ్లు తినండి

ఈ వేసవిలో డీహైడ్రేషన్ బారిన పడకూడదన్నా... ఆరోగ్యంగా ఉండాలన్నా కొన్ని పండ్లను తప్పక తీసుకోవాలంటున్నారు పోషకాహార నిపుణులు. అవేంటి? వాటితో ప్రయోజనాలేమున్నాయో తెలుసుకుందామా!

✧ పండ్లరాజుగా పిలిచే మామిడి పండుని మెచ్చనివారెవరు? 82 శాతం నీటిని కలిగిన ఈ పండ్లు ఆకలిని పుట్టిస్తాయి. జీర్ణ ప్రక్రియను సాఫీగా జరిగేలా చేస్తాయి. ఇందులోని విటమిన్ ఎ, సిలు కంటిచూపుని మెరుగుపరుస్తాయి. ఈ పండుని తినడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయులు అదుపులో ఉంటాయి.

✧ ఈ పండులోని పోషకాలు గుండె పనితీరుని సరిచేస్తాయి. శరీరంలో ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గిస్తాయి. నారింజలో ఉండే 85శాతం నీరు... నిస్సత్తువ రాకుండా చూస్తుంది.

✧ మెగ్నీషియం, పొటాషియంలు మెండుగా ఉండే ఈ పండుని తినడం వల్ల రక్తపోటు, మధుమేహం అదుపులో ఉంటాయి. వడదెబ్బ నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఈ పండుకి ఉన్న యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాల వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగానూ ఉంటుంది.

✧ తొంభైశాతం నీటితో నిండి ఉండే పుచ్చకాయని ఈ కాలంలో తప్పక తినాలి. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ క్యాన్సర్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు కలిగి ఉన్న ఈ పండు... ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యంగా శరీరంలో నీటి నిల్వలు తగ్గకుండా చూస్తుంది. చెమట కారణంగా కోల్పోయిన విటమిన్లు, ఖనిజాలనుభర్తీ చేస్తుంది. రకమేదైనా ఈ పండుని పచ్చిగా తీసుకున్నా, సలాడ్లలో కలుపుకొన్నా మంచిదే. పొటాషియం, విటమిన్ కె, యాంటీ ఆక్సిడెంట్లు ఇందులో పుష్కలంగా దొరుకుతాయి. ఎండబారిన పడకుండా కాపాడతాయి.

ప్రణాళిక వేసుకోండి..



గృహిణిగా ఇంటిపని, వంట, పిల్లలను స్కూల్‌కు పంపడం వంటివాటితో రోజు ఎలా గడుస్తుందో తెలియదు. అయితే అవే పనులను కొందరు సంపూర్ణంగా పూర్తిచేయగలిగి, మిగతా సమయాన్ని తమకు నచ్చినట్లుగా వినియోగించుకుంటారు. అలాగే మరికొందరికి చేయాల్సిన పనే.. మిగిలిపోతుంటుంది. వీటన్నింటికీ సమయపాలన పాటించాలని గట్టిగా అనుకోవాలి. ఫలానా టైంలోనే పూర్తిచేయాలని ప్రణాళిక వేసుకొని అమలు చేయడానికి ప్రయత్నించాలి. దీనికి తేలికైన పద్ధతులను కనిపెట్టి అవలంబించాలి.

❑ పని మొత్తం మీరొక్కరే చేయకుండా, అవసరమైతే ఇంట్లో మరొకరి సాయాన్ని తీసుకొని పూర్తిచేయగలగాలి. ఇదొక అభ్యాసంగా మారి క్రమేపీ అనుకున్న సమయంలోనే పనులన్నీ పూర్తవుతాయి. మిగిలిన సమయాన్ని వ్యక్తిగత అభిరుచులు లేదా మనసుకు నచ్చిన కెరియర్‌కు వినియోగించొచ్చు.

❑ ఉద్యోగం చేసే వారికి ఇల్లు, ఆఫీస్ పని మాత్రమే బాధ్యత కాదు. ఆరోగ్యానికి కూడా సమయాన్ని కేటాయించుకోవాలి. లక్ష్యాలను చేరుకోవాలన్నా.. ఉద్యోగం, ఇంటి పనులు అనుకున్నట్లుగా పూర్తిచేయాలన్నా.. శారీరక సామర్థ్యం తోడైతేనే వీలవుతుంది. ఉదయం లేదా సాయంత్రం అరగంట వ్యాయామాలకు కేటాయించాలి. రోజంతా పని చేయడంతో శరీరం అలసిపోయింది లేదా అదే పెద్ద వ్యాయామం అనుకుంటే పొరపాటే. మొత్తం రోజులో ఎక్కడ సమయం వృథా అవుతుందో గుర్తించి దాన్ని మిగిల్చే ప్రయత్నం చేయాలి. వ్యాయామాల కోసం దాన్ని వినియోగిస్తే కండరాలు బలోపేతమవుతాయి. ఆరోగ్యం సొంతమై, అది లక్ష్యాలను సాధించడానికి తోడ్పడుతుంది.

❑ ఆ రోజు హాజరుకావాల్సిన సమావేశాల వివరాలను ముందురోజే సేకరించాలి. వాటికి సంబంధించిన సమాచారాన్ని, పూర్తి చేయాల్సిన బాధ్యతలను డైరీలో ముందుగానే పొందుపరుచుకోవాలి. ప్రాజెక్ట్ గురించి సహోద్యోగులకు సమాచారాన్ని అందించాల్సి వస్తే ముందురోజే పూర్తిచేయాలి. ఆఫీస్‌కెళ్లిన తర్వాత చేయాల్సిన పని గురించి ఆలోచించకుండా, వెళ్లేటప్పుడే ఎక్కడి నుంచి పని ప్రారంభించాలో ప్రణాళిక వేసుకోవాలి. ఏ పనికి ఎంత సమయం పడుతుందో అవగాహన ఉంటే చాలు. సక్రమంగా చేస్తే, పనులన్నీ విజయవంతంగా పూర్తవుతాయి.

పచ్చని చెట్లు కార్బన్ డయాక్సైడును పీల్చుకుని ఆక్సిజన్‌ను ఇచ్చే ప్రాణదాతలని చెప్పుకుంటాం కదా! చెట్లకు ఆకులు, పూలు, కొమ్మలు, రెమ్మలు, వేర్లు విత్తనాలు, కాయలు, పండ్లు వంటివన్నీ ఉంటాయి కదా! ఇలా చెట్ల భాగాలతో, ఎండు పుల్లలతోనూ ఎన్నో బొమ్మలు చేసుకోవచ్చు. పచ్చని ఆకులతో ఎలా చేసుకుంటామో ఎండు వాటితో కూడా అలాగే చేసుకోవచ్చు. కాఫీ ఆకులు, గింజలు, అవకాడో కాయ, అగ్ని పూలు, సంపెంగ ఆకులు, మిరియాల ఆకుల వంటి అనేక అరుదైన చెట్ల భాగాలతో ఎన్నో బొమ్మలు చేశాను. 690 బొమ్మలు, అలంకారాలు పూర్తయ్యాక తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం అప్లై చేశాను. వాళ్ళు రికార్డు ఇచ్చే టైముకు 750 చిత్రాలు దాటాయి. లవంగాలు, యాలకులు, రెడ్ బెర్రీస్, బ్లూ బెర్రీస్ వంటి మసాల దినుసులు డ్రై ఫ్రూట్స్‌తో కూడా చిత్రాలు అలంకారాలు చేశాను. ఎండిన చెట్ల వేర్లు, బెరడు, పూ మొగ్గలు, శంకులు వంటివన్నీ ఉపయోగించారు. ఈ రోజు చెట్లు భాగాలతో చేసిన చిత్రాలను గమనిద్దాం. ప్రయత్నిద్దాం.

నేర్చుకుందాం

ఎండు చెట్ల చిత్రాలు

పెద్ద వృక్షాలకు బెరడు ఉంటుంది. ఆ బెరడుతో కూడా అలంకారాలు చేయవచ్చు. రోడ్డు పక్కన ఉన్న చెట్లను కొట్టేస్తున్నారు. అందులో ఒకతను నా బొమ్మల్ని చూసి ఉండటంతో చెట్టు బెరడును తీసి ఇచ్చాడు. 'ఏమైనా బొమ్మ చేసుకుంటారా' అని చాలా మంది ఇలాంటి వస్తువులు తెచ్చివ్వడం పరిపాటే. అందుకే ఆశ్చర్యపడకుండా ఏం బొమ్మ చేస్తే బాగుంటుందా అని ఆలోచించాను. వెడల్పుగా ఉన్న బెరడును నిలువుగా రెండు ముక్కలు చేశాను. ఒక వెడల్పాటి పాత్రను తీసుకుని దానిలో ఈ రెండు నిలువుగా ఉన్న బెరడులను నిలబెట్టాను. నిలబెడితే మామూలుగా పడిపోతాయి కదా! అందుకే అడ్డంగా ఒక పుల్లను పెడితే రెండు బెరడ్లు నిలబడతాయి. ఇప్పుడు రెండు రాళ్ళు తీసుకొని మధ్యలో పెడితే ఏదో రాళ్ళ గుట్టలాగా కనిపిస్తుంది. చిన్న చిన్న గడ్డి మొక్కలు, చిన్న పూల కొమ్మల్ని అతికిస్తే అందంగా కనువిందు చేస్తుంది. ఇలాంటి అలంకరణలు నాలుగైదు రోజులు ఉంచుకోవచ్చు. అప్పుడు కొమ్మలు తీసేస్తే బెరడ్లతో వేరే అలంకరణ చేయవచ్చు.

కాయలున్న చెట్టు



ఎండిపోయిన చెట్లతో కూడా అలంకారం చేయవచ్చు. కాక పోతే కాస్త వెరైటీగా చేద్దాం. కుండీల్లో ఎండిపోయిన మొక్కల్ని పీకి పక్కనుంచుకోవాలి. బాగా ఎండలో ఎండబెట్టాలి. వాటికి నల్ల రంగును వేసుకోవాలి. రంగు వేశాక మళ్ళీ ఎండ బెట్టాలి. ఇప్పుడు దానికి కాయలు కాసినట్టుగా పెట్టాలి. దాని కోసం బెలూన్లు తెచ్చుకోవాలి. బెలూన్‌ను సగానికి కత్తిరించి దానిలో దూదిని పెట్టాలి. బెలూన్ లావుగా అవుతుంది. దాని చివర గట్టిగా లాగి ముడేయాలి. ఈ బెలూన్‌కు మధ్యలో దారంతో కుట్టేయాలి. అప్పుడు యాపిల్ లాగా కనిపిస్తుంది. దీనికి మూడు ఆకులు పెట్టాలి. ఆకుల కోసం క్రేప్ పేపర్‌ను వాడుకోవాలి. ఆకుపచ్చ క్రేప్ పేపర్‌ను కత్తిరించి ఆకుల్లాగా చేసుకుని యాపిల్‌కు అడుగున పెట్టాలి. మళ్ళీ ఒక కుట్టు వేయాలి. దీనిలో ఇంతకు ముందు నల్లరంగు వేసుకున్న ఎండు చెట్టును పెట్టాలి. ఆ చెట్టుకు అక్కడక్కడా ఈ యాపిల్ కాయల్ని అతికించాలి. కాయలున్న చెట్టులాగా కనిపించి అందంగా ఉంటుంది. ముళ్ళ చెట్లకు కూడా రంగులు వేసి పువ్వులు అతికించవచ్చు. జపాన్ ముళ్ళున్న కొమ్మకు నలుపు రంగువేసి దానికి పూసలు గుచ్చాలి. ఇలా ఏదో ఒకటి చేసి అందంగా అలంకరించవచ్చు. ముళ్ళ కొమ్మతో బొమ్మలు చేస్తే చాలా జాగ్రత్తగా ఉండాలి.

కోడి బొమ్మను చేద్దాం



రోడ్డు పక్కన ఎన్నో చెట్లు కనిపిస్తాయి. నేను కారులో ప్రయాణం చేస్తు న్నపుడు రోడ్డు పక్కనున్న చెట్లను గమనిస్తూ ఉంటాను. ఈ చెట్లు ఎండిపోయి గుబురుగా కనిపించాయి. వీటి పేరేమిటో నాకు తెలియదు. బాగా ఎండి కుచ్చు కుచ్చుగా ఉంది. బొమ్మకు పనికొస్తాయని తెచ్చుకున్నాను. కోడి బొమ్మను గీసుకొని దాని లోపల ఈ ఎండిన ఆకుల్ని అతకించాను. దీనికో కన్ను పెట్టాను. ఎర్రరంగు కాగితాన్ని కత్తిరించి ముక్కు, నెత్తి మీద తురాయిని పెట్టాలి. ఈ కోడికి పిల్లలున్నాయి. పిల్లల్ని చూపించడానికి పల్లీ తొక్కల్ని వాడుకోవాలి. మూడు, నాలుగు పల్లీ తొక్కల్ని అతికించాలి. దానికి కాళ్ళు, కన్ను, ముక్కు పెట్టాలి. తర్వాత వాటి నోట్లో కాయలున్నట్లుగా స్కెచ్‌తో గీయాలి. ఇలా కోడినీ, దాని పిల్లల్నీ తయారు చేయాలి.

పూల కుండీలు



ఎండి పోయిన కొబ్బరి కాయలు, చెట్టు మీద ఎండి పోయి కింద రాలిపోతుంటాయి. అలాంటి ఎండు కొబ్బరి కాయలతో పూల కుండీ చేయవచ్చు. ఎండిన కొబ్బరి కాయను మధ్యకు రంపంతో కొయ్యాలి. దాంట్లో ఉన్న పీచు భాగాన్ని అలాగే ఉంచి విడ దీయాలి. కాయను విడిగా తీయాలి. చిప్పను పక్కనుంచి దాని మీద పురికొసను చుట్టి అతికించాలి. పీచు భాగాన్ని సగానికి కత్తిరించినపుడు పడవ ఆకారంలో ఉంటుంది. దీని లోపల మట్టి పోసి దానిలో చెట్టు పెట్టుకోవచ్చు. ఈ మట్టి పోసిన కొబ్బరి పీచు కాయను కొబ్బరి చిప్ప మీద పెట్టి అతికించాలి. ఎండిన చెట్ల కాయలతో ఇలాంటి బొమ్మలు చేసుకోవచ్చు.

గుడ్ల గూబను చేద్దాం



సీతాఫలాలు తెచ్చుకున్న న్యాన్నా పండ్లు తినేసి విత్తులు దాచుకున్నాను. వీటిని కడిగి ఎంబడెట్టి దాచుకుంటే బొమ్మలు చేసుకోవచ్చు. ముందుగా ఒక పెన్సిల్‌తో గీసుకొని దానిపై ఈ విత్తుల్ని పేర్చుకుంటూ రావాలి. దాని రెక్కలకు శంకు చెట్ల కాయల్ని వాడాను. ఇంకా పిస్తా పొట్టును కూడా వాడుకోవచ్చు. చూడండి గుడ్లగూబ ఎలా ఉన్నదో!

పూలతో ఏనుగు



భూమ్మీద అతి పెద్దదైన జంతువు ఏనుగును సున్నితమైన పూలతో చేయడం విచిత్రంగా ఉంది. మా కుండీల్లో బిళ్ళ గన్నేరు పూలు బాగా కాస్తున్నాయి. ఆ పూలను కోసుకొచ్చి ఏనుగుకు రేఖల్లాగా అమర్చాలి. మధ్యలో శరీరాన్ని నింపడానికి బంతి పూల రెక్కల్ని వాడాలి. మా ఇంట్లో ఎరుపు పసుపు బంతిచెట్లు ఉన్నాయి. ఆ పూల రెక్కల్ని తెంపి ఏనుగు శరీరంను తయారు చేశాను. పూల ఏనుగు బాగుందా!

– డా. కందేపి రాణీప్రసాద్

ఇక రైతు తుఫాన్



(మొదటిపేజి తరువాయి)

రావాల్సి వస్తున్నది? ఈ ఒక్క విషయం గురించి మీరు ఆలోచించండి చాలు. రైతన్నలు రోడ్డెక్కుతుంటే... మనం ఎన్నుకున్న ఎమ్మెల్యేలు ఎక్కడ పడుకుంటున్నారు? నాది ఒక్కటే విన్నపం... మీరు జీవితకాలం పోరాడుతూనే ఉంటారా? ఢిల్లీలో 13 నెలల పాటు జరిగిన రైతాంగ పోరాటంలో 750 మంది రైతులు చనిపోయినా ప్రధాని నోరు తెరవలేదు. ఎన్నికలు వస్తే మాత్రం ఆయన కథ వేరుగా ఉంటుంది. ఉత్తరప్రదేశ్, పంజాబ్ లో ఎన్నికలు వస్తే తీయ తీయటి మాటలతో రైతులకు క్షమాపణ చెప్పాడు మన ప్రధాని. మనం పిచ్చివాళ్ళం. అబద్ధపు కథలు విని తిరిగి ఓట్లు వేశాం. ఏమైనా ఫలితం వచ్చిందా?' అని ప్రశ్నించారు. ' రైతులు, కార్మికులు, దళిత బిడ్డలకు నేను ఒక్కటే విషయం చెప్తున్నాను. మనం ఎవరిని ప్రాధేయపడాల్సిన అవసరం లేదు. మనం ఎవరికో ఓటు వేసి.. దరఖాస్తులు పట్టుకొని బిచ్చగాళ్ళలా వారి వెంట పడడమెందుకు ? మనమే స్వయంగా ఎమ్మెల్యేలమవుదాం. ఎంపీలమవుదాం. మనలో ఆ బలం లేదా? మన చేతిలో ఓటు అనే తాళం చెవి ఉంది. దాన్ని ఉపయోగిద్దాం. ఎప్పటిదాకా మనం కులం, మతం పేరు మీద విభజింపబడి పాలింపబడతామో అప్పటిదాకా మనం ఇలాగే మదనపడాల్సి వస్తుంది. రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుంది. మనం ఏకమై ముందుకుపోతే మంచి ఫలితాలు వస్తాయి' అని చెప్పారు.

మహారాష్ట్రలో ప్రతి ఎకరానికి నీరందిస్తాం..

'అమెరికా, చైనా కంటే నాణ్యమైన భూమి మనకుంది. కాంగ్రెస్ 54 ఏండ్లు, బీజేపీ 14 ఏండ్లు పాలించి ఏం చేశాయి? ఏటా 50వేల టీఎంసీల నీరు సముద్రం పాలవుతున్నది. మహారాష్ట్రలో కృష్ణా, గోదావరి నదులున్నా రైతులకు ఎందుకు మేలు జరుగట్లేదు? సాగు, తాగు నీరు చాలాచోట్ల అందుబాటులో లేదు. మన కండ్ల ముందే నీరు సముద్రంలో కలిసిపోతున్నది. ఎంత మంది పాలకులు మారినా ప్రజల తలరాతలు మారలేదు. నేతలు తలచుకుంటే దేశంలో ప్రతి ఎకరాకు నీరివ్వొచ్చు. మహారాష్ట్రలో ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తాం. ప్రతి ఎకరానికి రూ.10వేలు ఇచ్చే వరకు కొట్లాడుతాం. దేశంలో సమృద్ధిగా సహజ వనరులున్నాయి. దేశంలో 360 బిలియన్ టన్నుల బొగ్గు ఉంది. దాని ద్వారా 24 గంటల పాటు విద్యుత్ సులభంగా ఇవ్వొచ్చు. 125 ఏండ్ల పాటు విద్యుత్ ఇచ్చేంత బొగ్గున్నా కరెంట్‌ను ఎందుకు ఇవ్వలేకపోతున్నారు? పీఎం కిసాన్ కింద రూ.6 వేలు కాదు..కనీసం రూ.10 వేలు ఇవ్వాలి. ఉల్లి, చెరుకు రైతులు ధరల కోసం ఏటా పోరాడాల్సిందేనా? ఇది రాజకీయ సభ కాదు. బతుకులపై ఆలోచన సభ. ఇన్నేండ్లు నేతల మాయమాటలకు మోసపోయాం. ఇక మేల్కొందాం. మహారాష్ట్ర ప్రజల్లారా. నాతో కలిసి రండి. నీళ్ల కోసం కొట్లాడుదాం' అని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. త్వరలో మహారాష్ట్రలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ పోటీచేస్తుందనీ, బీఆర్ఎస్ జెండాను ఎగురేస్తామని నొక్కి చెప్పారు. మాజీ ఎమ్మెల్యే, ఎన్సీపీ కిసాన్ సెల్ మాజీ అధ్యక్షులు శంకరన్న ధోండ్గే, మాజీ ఎంపీ హరిభావ్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు హర్షవర్ధన్ జాదవ్, డాక్టర్ వసంత రావు బోండే, దళిత నేత సురేష్ గైక్వాడ్, రాష్ట్ర నాయకులు నాగ్ నాథ్ ఘిసేవాడ్, యశ్ పాల్ భింగే, జకీర్ చావ్స్, మాజీ జెడ్పీ చైర్మెన్ ప్రహ్లాద్ రొఖండో, దీపక్ అరవింద్ కాంతే తోపాటు జిల్లా నాయకులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కేసీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బహిరంగ సభలో ఎంపీలు జోగినపల్లి సంతోష్ కుమార్, దీవకొండ దామోదర్ రావు, ఎమ్మెల్సీలు మధుసూదన చారి, దేశపతి శ్రీనివాస్, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్ రెడ్డి, బాల్క సుమన్, షకీల్ అహ్మద్, బీఆర్ఎస్ కిసాన్ సెల్ అధ్యక్షులు గుర్నామ్ సింగ్, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ హిమాంశు తివారి, ఒడిషా బిఆర్ఎస్ నాయకుడు అక్షయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే దీపక్ అత్రమ్, మాజీ ఎంపీ హరిబన్ రాథోడ్, టీఎస్ఐఐసీ చైర్మెన్ గ్యాదరి బాలమల్లు, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మెన్ వెంకటేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అమృత్ లాల్ చౌహాన్, భాస్కర్ గుడాల, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

పిరికి ప్రధాని

(మొదటిపేజి తరువాయి)

జరిగే 'సంకల్ప సత్యాగ్రహ' యాత్రలో పాల్గొన్నారు.

బీజేపీపై ప్రియాంక తీవ్ర ఆగ్రహం

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ మాట్లాడుతూ మోడీ సారథ్యంలోని బీజేపీపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గాంధీ కుటుంబంపై నిరంతరం దాడులు చేస్తూ, కాశ్మీర్ పండిట్ వారసత్వాన్ని అవమానిస్తూనే ఉన్నదని మండిపడ్డారు. రాహుల్‌ను "అమరవీరుని కుమారుడు"గా అభివర్ణిస్తూ, ఆయనను (రాహుల్) ప్రతిరోజూ అవమానిస్తూ, చివరకు నెహ్రూ–గాంధీ కుటుంబాన్ని కూడా విడిచిపెట్టలేదని అన్నారు. "మీరు నా సోదరుడు, అమరవీరుని కుమారుడిని ద్రోహి అంటున్నారు. మీర్ జాఫర్‌తో పోలుస్తున్నారు. మీరు ఆయన తల్లిని అవమానించారు. మీ ముఖ్యమంత్రే స్వయంగా రాహుల్‌కు అతని తల్లి ఎవరో తెలియదంటూ వ్యాఖ్యానించారు. మీరు నా కుటుంబాన్ని ప్రతిరోజూ అవమానిస్తూనే ఉన్నారు. అయినా ఎవరిపైనా ఒక్క కేసూ నమోదు కాలేదు. ఎవరినీ జైలుకు పంపలేదు. సభ్యత్వాన్ని రద్దు చేయలేదు" అని ప్రియాంక అన్నారు.

దమ్ముంటే...నాపై కేసుపెట్టండి.

ఇప్పటి వరకు మేం మౌనంగా ఉన్నామనీ, అందుకే మీరు మా కుటుంబాన్ని అవమానిస్తూనే ఉన్నారని ప్రియాంక గాంధీ అన్నారు. " మీరు ఒక మనిషిని ఎంత అవమానిస్తారని నేను అడగాలనుకుంటున్నాను. నాపై కేసు పెట్టండి. ఈ దేశ ప్రధాని పిరికివాడు అన్నది మాత్రం నిజం" అని ఆమె వ్యాఖ్యానించారు..



రాహుల్‌ను ఎంతగా హేళన చేసినా...

రాహుల్ గాంధీ తన విద్యాభ్యాసం రెండు ప్రపంచ ప్రతిష్టాత్మక సంస్థలైన హార్వర్డ్, కేంబ్రిడ్జి యూనివర్సిటీలో పూర్తి చేశారనీ, అలాంటి ఆయనను వాళ్ళు (బీజేపీ) పప్పు అని పిలిచారనీ, ఆ తర్వాత ఆయన పప్పు కాదని, సామాన్య ప్రజానీకం సమస్యలపై అవగాహన కలిగిన నిజాయితీ పరుడనే అవగాహన తెచ్చుకున్నారని తెలిపారు. తన సోదరుడు ప్రధాని వద్దకు వెళ్లి ఆలింగనం చేసుకున్నారని, మీపై తనకు ఎలాంటి ద్వేషం లేదని చెప్పారని అన్నారు. సైద్ధాంతిక విభేదాలు ఉండవచ్చు కానీ ఒకరినొకరు ద్వేషించుకునేంత విద్వేషం మనలో లేదని అన్నారని ప్రియాంక గుర్తు చేశారు. తన తండ్రిని పార్లమెంటులో అవమానించారనీ, సోదరుడికి మీర్ జాఫర్ అనే పేరు పెట్టారనీ, ఇలా.. ఎన్నో సార్లు వాళ్లు తమ కుటుంబాన్ని అవమానించినా మౌనంగానే భరిస్తూ వచ్చామని చెప్పారు. "మీ ప్రధానే స్వయంగా నెహ్రూ పేరుపై వ్యాఖ్యలు చేశారు. కాశ్మీర్ పండిట్ల కుటుంబం మొత్తాన్ని ఆయన అవమానపరిచారు. తండ్రి చనిపోయిన తరువాత ఆయన కుటుంబం పేరును కొడుకు ముందుకు తీసుకెళ్లే సంప్రదాయం ఈ దేశంలో ఉంది" అని ఆమె అన్నారు.

రాహుల్ గాంధీ వేసే ప్రశ్నలకు బీజేపీ భయపడుతున్నదనీ, అందుకే ఆయనను వేధిస్తున్నదని విమర్శించారు. ఇటువంటి అహంకారపూరిత ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తే సమయం ఆసన్నమైందని ఆమె చెప్పారు. సంకల్ప సత్యాగ్రహ యాత్రలో కాంగ్రెస్ సీనియర్ నేతలు పి.చిదంబరం, సల్మాన్ ఖుర్షీద్, అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్, పవన్ కుమార్ బన్సల్, జైరాం రమేష్, ప్రతిభా వీరభద్ర సింగ్, జెడి శీలం, కుమారి సెల్జా తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమే : ఖర్గే

ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. " నీరవ్ మోడీ ఓబీసీనా? మెహుల్ చోక్సీ ఓబీసీనా? లలిత్ మోడి ఓబీసీనా? వీళ్లంతా పరారీలో ఉన్నవారు" అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లధనంతో పరారైన వ్యక్తుల గురించి రాహుల్ ప్రస్తావించారని తెలిపారు. దేశాన్ని, స్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఎలాంటి త్యాగాలు చేయడానికైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. రాహుల్‌ను రాజకీయాల్లో లేకుండా చేయాలని బీజేపీ చూస్తున్నదని, ఆయన గొంతును మూగబోయేలా చేయాలన్నదే బీజేపీ కుట్ర అని అన్నారు. రాహుల్ గాంధీకి బాసటగా నిలిచిన అన్ని ప్రతిపక్ష పార్టీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి తగ్గింది

(మొదటిపేజి తరువాయి)

అవుట్‌పుట్ ఈ ఏడాది జనవరిలో కిందటి నెలతో పోల్చితే పది శాతం పడిపోయింది. ఆ ట్రెండ్ ఫిబ్రవరిలో, మార్చిలోనూ కొనసాగుతున్నది. మార్చిలో ఇది మరింత దారుణానికి పడిపోయింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ద్వారా నిర్వహించబడుతున్న ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పోర్టల్‌లో ఈ విషయం వెల్లడైంది.

వెబ్ పోర్టల్ సమాచారం ప్రకారం.. గతేడాది డిసెంబర్‌లో 1.85 కోట్ల గ్రామీణ కుటుంబాలు ఈ పథకం కింద ఉపాధిని పొందాయి. అయితే, ఈ ఏడాది జనవరి నుంచి జాతీయ మొబైల్ పర్యవేక్షణ సేవ (ఎన్ఎంఎంఎస్) యాప్ ద్వారా హాజరును తప్పనిసరి చేశారు. దేశంలోని అనేక మారుమూల ప్రాంతాల్లో ఇంటర్నెట్ సౌకర్యాలు లేకపోవడంతో లబ్దిదారులు తమ హాజరు కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. పని చేసినప్పటికీ యాప్‌నకు సంబంధించి, ఇతర సాంకేతిక కారణాల కారణంగా యాప్ అటెండెన్స్‌లో వారు హాజరుకానట్టు చూపిస్తున్నది. దీంతో ఇప్పటి వరకు దాదాపు ఈ మూడు నెలల కాలంలో పనిలో తగ్గుదల కనిపించింది. ఈ తగ్గుదల కాలం(సీజనల్) ద్వారా వచ్చే తగ్గుదల కాదని విశ్లేషకులు తెలిపారు. యాప్ ఆధారిత హాజరులో లోపాలే పని తగ్గుదలకు కారణమై ఉండొచ్చని చెప్పారు. గత గణాంకాలను చూస్తే సాధారణంగా డిసెంబర్ మాసంతో పోలిస్తే జనవరి, ఫిబ్రవరి నెలల్లో పథకం కింద పని పెరుగుదల ఉంటుంది. 2018-19 గణాంకాల ప్రకారం.. 2018 కంటే 2019 జనవరిలో పని పెరుగుదల 9 శాతం నమోదు కావడం గమనార్హం.

16 శాతం మందికి అందని పని

ఇక తాజా గణాంకాలను చూస్తే ఈ ఏడాదిలో ఇప్పటి వరకు (మార్చి 25 నాటికి) పథకం కింద దాదాపు 10.24 కోట్ల మంది వ్యక్తులు పనిని కోరారు. వీరిలో 8.6 కోట్ల మంది పనిని పొందారు. 1.64 కోట్ల మందికి పథకం మొండి చేయిని చూపింది. పని కోరుకున్నవారిలో వీరి సంఖ్య 16 శాతం కావడం గమనార్హం. గతేడాది డిసెంబర్‌లో 1.85 కోట్ల కుటుంబాలు ఉపాధిని పొందగా.. జనవరికి అది 1.67 కోట్లకు పడిపోయి ఫిబ్రవరిలోనూ అదే సంఖ్యను నమోదు చేసింది. ఇక మార్చిలో (25వ తేదీ నాటికి) అది 1.15 కోట్లకు పడిపోవడం గమనార్హం.

రూ. 3630 కోట్ల చెల్లింపులు ఆలస్యం

ఈ ఏడాది ఉపాధి కార్మికులకు చేసే చెల్లింపులు కోట్ల రూపాయల మేర పేరుకుపోవడం ఆందోళనను కలిగిస్తున్నది. గతేడాదితో పోలిస్తే బకాయిలు 64 శాతం పెరిగాయి. గతేడాది ఆలస్యంగా (16 రోజులు లేదా అంతకంటే ఎక్కువ రోజుల తర్వాత) జరిపిన వేతనాల మొత్తం రూ. 2213 కోట్లుగా ఉంటే.. ఈ ఏడాది అది రూ. 3,630 కోట్లకు చేరటం గమనార్హం. ఇక నైపుణ్యం లేని కార్మికులకు పెండింగ్ బకాయిలు గతేడాది రూ. 424 కోట్లు ఉండగా.. అది ఈ ఏడాది రూ.1010 కోట్లకు (138 శాతం పెరుగుదల) చేరింది.

నిధుల తగ్గింపు

2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకానికి జరిపిన కేటాయింపులు రూ. 73,000 కోట్లు. అలాగే, ఏడాదిపాటు జరిపిన అదనపు కేటాయింపులు కలుపుకొని బడ్జెట్ సవరణ అంచనా రూ. 89,400 కోట్లకు చేరింది. అయితే, 2021-22లో వాస్తవ బడ్జెట్ రూ. 98,467.85 కోట్ల కంటే ఇది తక్కువ కావడం గమనార్హం. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన దాని కంటే రూ. 11,921 కోట్లు అధికంగా ఖర్చు కావడం గమనార్హం. అది అంతకు ముందు ఏడాది రూ. 4162 కోట్లుగానే ఉండటం గమనించాల్సిన అంశం.

ఇస్రో ఘన చరిత్ర

(మొదటిపేజి తరువాయి)

మొత్తం 36 ఉపగ్రహాలతో నింగిలోకి దూసుకెళ్లింది. దాదాపు 20 నిమిషాల ప్రయాణం తర్వాత భూమి ఉపరితలం నుంచి 450 కి.మి. చేరుకుంది. మోసుకెళ్లిన ఉపగ్రహాలను ఒక్కొక్కటిగా లియో ఆర్బిటల్ వృత్తాకార కక్ష్యలోకి రాకెట్ ప్రవేశపెట్టింది. ఈ ఉపగ్రహాల బరువు 5.8 టన్నులుగా శాస్త్రవేత్తలు తెలిపారు.

ఇస్రో వాణిజ్య విభాగం న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ రెండు దశల్లో 72 ఉపగ్రహాలను ప్రయోగించడానికి వన్‌వెబ్‌తో ఒప్పందం చేసుకున్నది. దీనిలో భాగంగా మొదటి 36 ఉపగ్రహాలను గతేడాది అక్టోబరు 23న ఇస్రో విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. తాజాగా రెండో విడత 36 ఉపగ్రహాలను పంపింది.

పీక్ సమయంలో 20శాతమా?

నవతెలంగాణ-సూర్యాపేట

పీక్ సమయంలో 20శాతం విద్యుత్ చార్జీలు పెంచాలంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ముమ్మాటికి ఆర్థిక ద్రోహానికి పాల్పడటమేనని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఈ నిర్ణయంతో సామాన్యున్ని విద్యుత్ వినియోగం నుంచి దూరం చేయడమేనని కేంద్రంపై నిప్పులు చెరిగారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పేదోడిపై పడే ఏ భారాన్ని అయినా ఒప్పుకునే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. ట్రూ అప్ చార్జీల విషయంలో సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయమే ఇందుకు నిదర్శనమన్నారు. ట్రూ అప్ చార్జీలు పెంచాలంటూ ఈఆర్సీ సిఫారసు చేసినా పట్టించుకోకుండా రూ.12,000 కోట్ల అదనపుభారాన్ని భరించయినా సామాన్యుడి మీద భారం పడకుండా చూసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. పీక్ డిమాండ్ అంటే ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వినియోగదారుడు ఎక్కువగా విద్యుత్ ఉపయోగించే సమయమని తెలిపారు. ఈ సమయాల్లో విద్యుత్‌ను ఎక్కువగా వినియోగించే వినియోగదారులపై భారం మోపుతామంటూ కేంద్రప్రభుత్వం తాఖీదులు జారీ చేస్తే భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని స్పష్టం చేశారు. పీక్ డిమాండ్‌లో 20శాతం పెంచడమంటే అటు గృహ వినియోగదారులతో పాటు పారిశ్రామికవేత్తలపై మోయలేని భారం మోపినట్టవుతుందని తెలిపారు. 2014 ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వస్తే దేశంలో విద్యుత్‌కాంతులు ప్రసరింపజేస్తామంటూ ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన మోడీసర్కార్ ఇప్పుడు విద్యుత్ వినియోగం నుంచి సామాన్యుడిని దూరం చేసే కుట్రలకు తెర లేపిందని విమర్శించారు. విద్యుత్ జీవితంలో భాగమైందని, విద్యుత్‌ను వినియోగించకుండా ఉండలేని పరిస్థితులు ఉత్పన్నమయ్యాయన్నారు. అటువంటి పరిస్థితుల్లో పేద ప్రజలకు ఇచ్చే సబ్సిడీలు ఎత్తివేసే చర్యలకు బీజేపీ ప్రభుత్వం రూట్ మ్యాప్ రెడీ చేసిందని ఆరోపించారు. తెలంగాణలో పెట్టిన ప్రతి కనెక్షన్‌కు మీటర్ పెట్టాలన్న కేంద్రప్రభుత్వ సిఫార్సులను వ్యతిరేకించినందుకు రాష్ట్ర ప్రభుత్వ ఫెర్ఫార్మెన్స్‌తో రావాల్సిన అప్పులను మోడీ ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. అందులో భాగంగానే ఎఫ్ఆర్‌బీఎంకు ఇచ్చే పరిమితుల్లో మోకాలొడ్డుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా అది పేదల పక్షంగానే ఉంటుందన్నారు. పీక్ డిమాండ్ సమయంలో 20శాతం చార్జీలు పెంచాలన్న కేంద్ర ప్రభుత్వ సిఫార్స్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెల్లడిస్తారని తెలిపారు. జేబులకు చిల్లులు పెట్టడం.. ప్రజలను చీకట్లోకి నెట్టడమే కేంద్రంలో కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వ ఆలోచన అని ఆరోపించారు. అటువంటి దుర్మార్గాలకు చెల్లు చీటి పాడి మోడీ పాలనకు చరమగీతం పాడే రోజులు ఎంతో దూరం లేవని హెచ్చరించారు.

కూపీ లాగుతున్న సిట్

(మొదటిపేజి తరువాయి)

అంశాలను సిట్ అధికారులు రికార్డ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్ని పోటీ పరీక్షలు రాశారు? ఎన్ని మార్కులు వచ్చాయనేదానిపై వివరాలు సేకరిస్తున్నారు. గతంలో టీఎస్‌పీఎస్సీ పరీక్షలు రాసి ఉంటే వాటి సమాచారం కూడా తీసుకుంటున్నారు. సమాచారం అనంతరం తిరిగి సంప్రదిస్తామని అభ్యర్థులకు సిట్ అధికారులు సూచిస్తున్నారు.

మతోన్మాద బీజేపీకి గోరికడదాం



అధికారం కోసం నానాగడ్డి కరుస్తున్న కాషాయపార్టీ

- అప్రజాస్వామికంగా రాహుల్‌గాంధీపై అనర్హత వేటు
- నమ్మి ఓట్లేస్తే.. ఢిల్లీ నేతల చెప్పులు మోస్తున్న కరీంనగర్ ఎంపీ బండి
- మోడీ దగ్గర, ఢిల్లీలో పతార్ ఉందని చెప్పుకునుడే తప్ప...
- నియోజకవర్గానికి రూపాయి తెచ్చిన మొఖం లేని సంజయ్
- ప్రజలంతా సంఘటితమై ఓటుతోనే బీజేపీకి బుద్ధిచెప్పాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'ప్రజల ఆస్తులను తెగనమ్ముతూ.. పేదలపై పన్నుల భారాన్ని మోపుతూ.. ప్రజల మధ్య మతచిచ్చు పెడుతూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్న మతోన్మాద బీజేపీకి గోరి కట్టే రోజులు దగ్గరపడ్డాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. ఆయా రాష్ట్రాల్లో అడ్డదారిన అధికారం చేపట్టి.. తెలంగాణలోనూ అధికారం కోసం ఏగడ్డి కరిచేందుకైనా సిద్ధపడి అడ్డదారుల్లో ఎమ్మెల్యేలను కొనే ప్రయత్నమూ చేసిందని విమర్శించారు. ప్రశ్నించేవారిపై దాడులు, అరెస్టులకు దిగుతున్న కేంద్రంలోని బీజేపీ.. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై అప్రజాస్వామికంగా అనర్హత వేటు వేసిందన్నారు. నమ్మి ఓట్లేసి గెలిపించిన కరీంనగర్ ప్రజలకు ఇక్కడి ఎంపీ సంజయ్ దగాకోరులా తయారయ్యాడని, ఢిల్లీ నేతల చెప్పులు మోస్తూ.. రాష్ట్రపార్టీ అధ్యక్ష పదవిని కాపాడుకుంటున్నారని ఆరోపించారు. మోడీ దగ్గర పతార్ ఉందని చెప్పుకునే సంజయ్.. నియోజకవర్గ ప్రజలకు రూపాయి తెచ్చిన మొఖం లేదని తెలిపారు. ప్రజలకు, శ్రామికవర్గానికి శత్రువులా తయారైన బీజేపీకి గోరికట్టి, మోడీ సర్కారుకు చరమగీతం పాడే సమయం ఆసన్నమయిందని స్పష్టంచేశారు. సీపీఐ(ఎం) చేపట్టిన జనచైతన్య యాత్ర ఆదివారం రాజన్నసిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో సాగింది. ఆయా ప్రాంతాల్లో బృందసభ్యులు ఆశయ్య, జయలక్ష్మి, స్కైలాబ్‌బాబు, జగదీష్, అడివయ్యకు కార్యకర్తలు, ప్రజలు నిరాజనాలు పలికారు. భారీ బైక్‌ర్యాలీలతో, బతుకమ్మలతో మహిళలు స్వాగతం, వీడ్కోలు పలికారు. కాగా, ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన బహిరంగసభలు, కార్నర్ మీటింగ్‌లలో వీరయ్య ప్రసంగించారు.

దేశ సంపదను ఆదానీ, అంబానీలకు కట్టబెడతూ దేశంలోని 46 కోట్ల మందిని దారిద్ర్యరేఖకు దిగువనే ఉంచారని అన్నారు. కార్మిక చట్టాలను హరిస్తూ వారిని శ్రమదోపిడికి గురయ్యేలా యజమానులకు అనుకూల చట్టాలు తీసుకొచ్చారని విమర్శించారు. ఇప్పటికే 8గంటల పని సమయం 12గంటలకు చేశారని, కనీసం వేతనం రూ.4628 ఉంటే సరిపోతుందనే అవగాహనకు రావడం వారు కార్మికులు, కర్షకులు, రైతాంగానికి శత్రువుకగా తయారైన పరిస్థితికి అద్దం పడుతుందన్నారు. మొత్తం ప్రజల సంపదను, ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్లకు దోచిపెట్టడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే దేశ ద్రోహులని అంటున్న బీజేపీ, దాని సన్నిహితుడు అదానీయే పెద్ద దేశద్రోహులని అన్నారు. పార్లమెంట్‌లో మెజార్టీ ఉన్న బీజేపీ అడ్డగోలుగా నల్ల చట్టాలు తీసుకొస్తూ ప్రజలను అధోగతిపాలు చేస్తున్నారని అన్నారు. అలాంటిదే విద్యుత్ బిల్లు కూడా అని, అది గనుక వస్తే.. సిరిసిల్ల పవర్‌లూమ్‌పైనా, రైతుల వ్యవసాయంపైనా పెనుభారం తప్పదని హెచ్చరించారు. కేంద్రంలో తొమ్మిదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ పాలనలో దేశం ప్రమాదంలో పడిందని, అందులోంచి బయటపడాలంటే బీజేపీ, ఆ పార్టీ అనుబంధ సంస్థలను ప్రజలు దగ్గరికి రానివ్వొదని కోరారు.

సమస్యలను విస్మరించిన ఎంపీ సంజయ్..

ఇక్కడి ప్రజలు నమ్మి పార్లమెంట్ సభ్యునిగా బండి సంజయ్‌ను ఎన్నుకుంటే.. ఆయన మాత్రం దగాకోరుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు 'ఢిల్లీలో మా సర్కారే అధికారంలో ఉందని, కరీంనగర్‌లో ఎయిమ్స్ తరహా వైద్యసంస్థను తీసుకొస్తామని చెప్పిన ఆయన కనీసం చిన్న ప్రాజెక్టును కూడా తీసుకురాలేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఆయన చేసిన పాదయాత్రలో ఎంత సేపు ప్రజల మధ్య మతవిద్వేషాల ప్రసంగాలే తప్ప.. తెలంగాణ ప్రజల గోసను పార్లమెంట్‌లో వినిపించింది లేదన్నారు. సిరిసిల్ల, వేములవాడ ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వే మార్గం, సిరిసిల్లలో శంకుస్థాపనకే పరిమితమైన ఈఎస్‌ఐ ఆస్పత్రి, కేంద్రీయ విద్యాలయ పక్కాభవనం, వరంగల్ - జగిత్యాల జాతీయ రహదారి, కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి రైల్వే ఫ్లైఓవర్ ఇలా.. చెప్పుకుంటూ పోతే అనేక సమస్యలు, డిమాండ్లు ఉన్న ఈ ప్రాంతవాసులకు పైసా పని చేసింది లేదని విమర్శించారు. ఇంకా మిగిలున్న ఏడాది పదవికాలంలో ఆయన చేసేదీ ఏం ఉండదని చెప్పుకొచ్చారు.



యాత్రకు మద్దతుగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు...

సీపీఐ(ఎం) జనచైతన్య యాత్రకు మద్దతుగా ఆయా ప్రాంతాల్లోని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మద్దతు పలికి కేంద్ర బీజేపీ సర్కారును ఎండగట్టారు. కరీంనగర్ సభలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయిన్‌పల్లి వినోద్ మాట్లాడుతూ.. మోడీ సర్కారును బొందపెట్టే రోజులు దగ్గర పడ్డాయని, మళ్లీ పైకి తేలకుండా అంటార్కిటికా మహాసముద్రంలో పడేయాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు మేనేని రోహిత్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు తీసుకొచ్చిన విద్యుత్‌బిల్లుల పెంపును నిరసిస్తూ ప్రాణాలొదిలిన చరిత్ర కమ్యూనిస్టులదని, ప్రజలకు కష్టాలు వచ్చినప్పుడు వారు మాత్రమే ముందు ఉంటారని అన్నారు. రాజన్న సిరిసిల్ల సభలో తెలంగాణ టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మెన్ గూడూరు ప్రవీణ్, సీపీఐ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణు, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ కంచర్ల రవి గౌడ్, తదితరులు ప్రసంగించారు.

మోడీ-షాల కుట్రలు సాగవు

ఇది కమ్యూనిస్టుల రక్తంతో తడిచిన గడ్డ

- లౌకిక విధానాన్ని వ్యతిరేకించే మతోన్మాదులను తరిమికొడుదాం : వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల జనచైతన్య యాత్రలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ



నవతెలంగాణ రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధులు / మహబూబ్‌నగర్

లౌకిక రాజ్యంలో అసమానతలకు తావు లేని రాజ్యాంగాన్ని చెరిచి మతోన్మాద మనుస్మృతిని అమలులోకి తేచ్చేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, తెలంగాణలో మోడీ-షాల కుట్రలు సాగవని, వారిని తరిమికొట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. ఇది కమ్యూనిస్టుల రక్తంతో తడిచిన గడ్డ అని, ఇక్కడ మనువాదులకు స్థానం లేదని స్పష్టం చేశారు. జాన్‌వెస్లీ ప్రాతినిధ్యం వహిస్తున్న సీపీఐ(ఎం) జన చైతన్య యాత్ర 3వ బృందం ఆదివారం వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట ప్రవేశించింది. యాత్రకు ఘన స్వాగతం పలికిమోమిన్‌పేట నుంచి వికారాబాద్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి పరిగికి యాత్ర వెళ్లింది. అక్కడ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం కుల్కచర్లకు అక్కడి నుంచి మహబూబ్‌నగర్ పట్టణానికి చేరుకుంది. ఆదివారం రాత్రి అక్కడే బస చేయనుంది. వికారాబాద్, మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన సభల్లో జాన్‌వెస్లీ మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ దేశ ప్రజలను మోసం చేసిందన్నారు. విదేశాల్లో ఉన్న స్వదేశీ డబ్బులు తెప్పించి ప్రజలకు పంచుతామని గొప్పలు చెప్పిన మోడీ దేశ సంపదను తన కార్పొరేట్ అనుచరులకు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని అమలుచేయకపోగా, ఉన్న ఉద్యోగాలు తొలగించి నిరుద్యోగం పెరగడానికి కారకులయ్యారని ఆరోపించారు. 16 పరిశ్రమలు మూసివేసి లక్షలాది మంది ఉద్యోగులను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, గిరిజన సంక్షేమాన్ని తుంగలో తొక్కి వారి బతుకులు దిగజార్చుతున్నారన్నారు. దేశంలో మత విద్వేశాలను రెచ్చగొట్టి.. కుల, మతల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ది పొందేందుకు పన్నాగాలు పన్నుతుందని తెలిపారు. రాష్ట్రాల హక్కులను హరిస్తూ.. వాటి అభివృద్ధికి సంకెళ్ల వేస్తోందన్నారు. తెలంగాణలో మతోన్మాదులను ప్రజలు తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు.

రైతులపై విద్యుత్ భారం మోపేందుకు కుట్ర : టీ.సాగర్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

రైతులపై భారం మోపేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.. సాగర్ అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తోందన్నారు. కేంద్రం తీసుకువస్తున్న విద్యుత్ సంస్కరణలతో రైతులపై విద్యుత్ భారం పడనుందన్నారు. రైతు పండించిన పంట కొనుగోలు చేసే వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కాగా, మోడీ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా మద్దతు ధర కల్పిస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చి నేటికీ అమలు చేయడం లేదని ఆరోపించారు. ఇలాంటి ప్రభుత్వాన్ని దేశ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఉపాధి హామీ చట్టాన్నీ నీరుగార్చేందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.30వేల కోట్ల నిధులు తగ్గించిందన్నారు. అన్నిరంగాల ప్రజల జీవన స్థితిగతులను దెబ్బగొట్టేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, ఇలాంటి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలందరూ చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు.

దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచి పెడుతున్నారు : వెంకట్రాములు, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను లూటీ చేస్తూ మోడీ అనుచరులైన అదానీ, అంబానీలకు దోచి పడుతున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు అన్నారు. దేశంలో ఆకలి చావులు పెరుగుతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తే సుస్థిరమైన పాలన వస్తోందని చెప్పారని, కానీ నేడు అస్థిరమైన పాలన కొనసాగుతుందని తెలిపారు. నిత్యవసర ధరలు నాలుగు రెట్లు పెరిగాయని ఆరోపించారు. రాష్ట్ర విభజనలో భాగంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణలో అధికారంలోకి వస్తామని బీజేపీ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ పార్టీ తెలంగాణ ఎంపీలు రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. కనీసం పాలమూరు-రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసురాలేని అసమర్థులని విమర్శించారు. మత చిచ్చుతో రాజకీయం చేయాలని చూస్తున్న బీజేపీ ఆటలు తెలంగాణలో సాగావని హెచ్చరించారు.

తెలంగాణ తేజం, బాక్సింగ్ సూపర్‌స్టార్ నిఖత్ జరీన్ చరిత్ర సృష్టించింది. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో రెండు పసిడి పతకాలు సాధించిన బాక్సర్‌గా ఎం.సీ మేరీకోమ్ తర్వాత స్థానంలో నిలిచింది. మహిళల 50 కేజీల పసిడి పోరులో రెండుసార్లు ఆసియా చాంపియన్‌ను మట్టికరిపించిన నిఖత్ జరీన్.. వరల్డ్ చాంపియన్‌గా టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఒలింపిక్ మెడలిస్ట్ లవ్లీనా బొర్గొహైన్ ఆసీస్ బాక్సర్‌ను చిత్తు చేసి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో తొలి పసిడి పతకం ముద్దాడింది. నాలుగు స్వర్ణాలు సాధించిన భారత్ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌ను ఘనంగా ముగించింది.

నిఖత్ బంగారం

- రెండోసారి ప్రపంచ చాంపియన్‌గా తెలంగాణ స్టార్
- ఫైనల్లో వియత్నాం బాక్సర్‌పై నిఖత్ పసిడి పంచ్
- లవ్లీనా బొర్గొహైన్‌కు తొలి వరల్డ్ చాంపియన్‌షిప్ స్వర్ణం

నవతెలంగాణ-న్యూఢిల్లీ

తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ పంచ్ పవర్ చూపించింది. 2022 వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో 52 కేజీల విభాగంలో పసిడి పతకం సాధించిన సూపర్‌స్టార్.. తాజాగా 2023 ఐబీఏ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో 50 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ గెల్చుకుంది. రెండు సార్లు ఆసియా చాంపియన్‌షిప్స్ విజేత, వియత్నాం బాక్సర్ న్యుయెన్ తి టామ్‌ను 5-0తో ఓడించిన నిఖత్ జరీన్ ఐదుగురు న్యాయమూర్తుల ఏకగ్రీవ చాంపియన్‌గా అవతరించింది. భారత బాక్సింగ్ దిగ్గజం ఎం.సీ మేరీకోమ్ తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో రెండు పసిడి పతకాలు నెగ్గిన భారత బాక్సర్‌గా నిఖత్ జరీన్ రికార్డు నెలకొల్పింది. టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్ సైతం బంగారు పతకం దక్కించుకుంది. మహిళల 75 కేజీల విభాగంలో ఆస్ట్రేలియా బాక్సర్ పార్కర్‌ను పాయింట్ల తేడాతో ఓడించిన లవ్లీనా బొర్గొహైన్ 5-2తో ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో కెరీర్ తొలి పసిడి పతకం ముద్దాడింది. నీతు గంగాస్ (48 కేజీలు), స్వీటీ బూర (81 కేజీలు), నిఖత్ జరీన్ (50 కేజీలు), లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు) పసిడి పోరులో పవర్‌ఫుల్ పంచ్‌లు సంధించగా 2023 ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో భారత్ నాలుగు స్వర్ణ పతకాలు సొంతం చేసుకుంది. 2006 ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో సైతం టీమ్ ఇండియా నాలుగు పసిడి పతకాలతో సత్తా చాటగా, ఇన్నేండ్ల అనంతరం భారత బాక్సర్ల అత్యుత్తమ ప్రదర్శన ఇదే కావటం విశేషం.





ఎదురులేని నిఖత్

ఫైనల్లో పసిడి ఫేవరేట్‌గా బరిలో నిలిచిన నిఖత్ జరీన్.. అంచనాలకు తగినట్టు పోరాడింది. తొలుత వియత్నాం బాక్సర్ క్లీన్ పంచ్‌లు విసిరింది. ఎత్తు ప్రత్యర్థి బాక్సర్‌కు కలిసొచ్చింది. నిఖత్ ఓ జబ్ విసిరింది. నిఖత్‌ను టామ్ కిందపడేసినా.. ఇదేమీ రెజ్లింగ్ కాకపోవటంతో ఎటువంటి నష్టం జరుగలేదు. ఐదుగురు న్యాయమూర్తులు నిఖత్ జరీన్‌కు పదేసి పాయింట్లు ఇవ్వగా.. టామ్‌కు తొమ్మిది చొప్పున పాయింట్లు ఇచ్చారు. 5-0తో తొలి రౌండ్‌లో నిఖత్ పైచేయి సాధించింది. ఇక రెండో రౌండ్లో నిఖత్ ఎల్లో కార్డ్ చవిచూసింది. ఎదురుదాడి చేసిన నిఖత్ లెఫ్ట్ హ్యాండ్ పంచ్‌లతో అదరగొట్టింది. వరుసగా మూడు క్లియర్ పంచులతో అదరగొట్టింది. రెండో రౌండ్‌లో ఇద్దరు జడ్జీలు నిఖత్‌కు ఆధిక్యం ఇవ్వగా.. ముగ్గురు జడ్జీలు ఇద్దరికీ సమానంగా పాయింట్లు ఇచ్చారు. కీలక మూడో రౌండ్లో ఇద్దరు బాక్సర్లు హోరాహోరీగా పోరాడారు. నిఖత్ రైట్‌హ్యాండ్ పంచ్‌లు విసరగా..టామ్ సైతం నిఖత్‌కు గట్టిగా ఓ పంచ్ ఇచ్చింది. మూడు రౌండ్ల అనంతరం ఐదుగురు న్యాయమూర్తులు నిఖత్ జరీన్‌ను 5-0తో ఏకగ్రీవ విజేతగా ప్రకటించారు. 28-27, 28-27, 28-27, 29-26, 28-27తో నిఖత్ జరీన్ స్పష్టమైన విజేతగా అవతరించింది.

లవ్లీనా లవ్లీ పంచ్

ఒలింపిక్ మెడలిస్ట్ లవ్లీనా బొర్గొహైన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో తొలి పసిడి పతకం సాధించింది. తొలిసారి 75 కేజీల విభాగంలో పోటీపడుతున్న లవ్లీనా బొర్గొహైన్.. గట్టి పోటీని ఎదుర్కొని బంగారు విజేతగా నిలిచింది. పసిడి పోరులో ఆస్ట్రేలియా బాక్సర్ కైట్లిన్ పార్కర్ నుంచి లవ్లీనా తీవ్ర పోటీ చవిచూసింది. తొలి రౌండ్లో ఇద్దరు బాక్సర్లు పంచ్‌లు విసురుకున్నారు. తొలి రౌండ్లో లవ్లీనా వైపు ముగ్గురు జడ్జీలు ఉండగా, పార్కర్ వైపు ఇద్దరు జడ్జీలు నిలిచారు. రెండో రౌండ్లో పార్కర్ దూకుడు చూపించింది. క్లియర్ పంచ్‌లు లేకపోయినా.. జబ్‌లు విసిరింది. రౌండ్ చివర్లో లవ్లీనా క్లీన్ హుక్ పంచ్‌తో మెరిసింది. అయినా, రెండు రౌండ్ల అనంతరం పార్కర్ 2-1తో ముందంజ వేసింది. నిర్ణయాత్మక మూడో రౌండ్లో లవ్లీనా అప్పర్ కట్ పంచ్ కోసం ప్రయత్నించి మిస్ అయ్యింది. పార్కర్ సైతం క్లియర్ పంచ్‌లు విసిరేందుకు ప్రయత్నించి విఫలమైంది. సమవుజ్జీల ఫైట్‌గా జరిగిన రౌండ్లో ఇద్దరూ ఆకట్టుకున్నారు. బౌట్ అనంతరం ఇద్దరు బాక్సర్ సంబురాలు చేసుకున్నారు. ఐదుగురు న్యాయనిర్ణేతలు నిర్ణయాన్ని సమీక్షకు పంపించారు. సమీక్షలో లవ్లీనా బొర్గొహైన్ 5-2తో విజయం సాధించింది. 75 కేజీల విభాగంలో వరల్డ్ చాంపియన్‌గా నిలిచింది.



ఆటలు



సాత్విక్ జోడీకి టైటిల్

స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్

బసెల్ : భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి డబుల్స్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రాంకీరెడ్డి, చిరాగ్ శెట్టి స్విస్ ఓపెన్ మెన్స్ డబుల్స్ చాంపియన్లుగా నిలిచారు. బసెల్‌లో ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో రెండో సీడ్ భారత జోడీ ఘన విజయం సాధించింది. స్విస్ ఓపెన్ సూపర్ 300 టైటిల్‌ను సొంతం చేసుకుంది. టైటిల్ పోరులో చైనా జంటను సాత్విక్, చిరాగ్ జోడీ వరుస గేముల్లో ఓడించారు. 21-19, 24-22తో 54 నిమిషాల థ్రిల్లర్‌లో డ్రాగన్ ద్వయానికి చెక్ పెట్టి టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నారు. తొలి గేమ్‌లో 11-8తో విరామ సమయానికి ముందంజ వేసిన మనోళ్లు.. ద్వితీయార్థంలోనూ దూకుడు తగ్గలేదు. 17-12తో ఆధిక్యంలోకి దూసుకెళ్లి తొలి గేమ్‌ను గెల్చుకున్నారు. సాత్విక్, చిరాగ్ ఇద్దరూ ఆకట్టుకున్నారు. రెండో గేమ్ ఉత్కంఠగా సాగింది. 8-8, 11-11తో థ్రిల్లర్‌ను తలపించింది. 20-18తో ముందున్న సాత్విక్, చిరాగ్‌లు చైనా జోడీకి మూడు మ్యాచ్ పాయింట్లు కాచుకునే అవకాశం కల్పించారు.

టైబ్రేకర్‌కు దారితీసిన గేమ్‌లో సాత్విక్, చిరాగ్ చివర్లో పుంజుకున్నారు. 24-22తో రెండో సెట్, స్విస్ ఓపెన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ఈ ఏడాది జనవరిలో మలేషియా ఓపెన్ సెమీస్‌కు చేరుకున్న భారత జోడీ.. ఇటీవల ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్స్‌లో రెండో రౌండ్లోనే నిష్క్రమించింది. ఈ ఏడాది సాత్విక్, చిరాగ్ జోడీకి ఇదే తొలి టైటిల్.



కిడ్స్ మారథాన్‌లో పి.టి ఉష

హైదరాబాద్ : చిన్నారులపై వేధింపులకు వ్యతిరేక ఉద్యమానికి మద్దతునిస్తూ ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన మెగా కిడ్స్ మారథాన్‌లో పరుగుల రాణి, భారత ఒలింపిక్ సంఘం (ఐఓసీ) అధ్యక్షురాలు పి.టి ఉష పాల్గొన్నారు. 'రన్ ఎగైనెస్ట్ చైల్డ్ అబ్యూజ్' మెగా మారథాన్‌ను పి.టి ఉష జెండా ఊపి ప్రారంభించారు. 2-10 ఏండ్ల వయసులోపు చిన్నారులు సుమారు 1500 మంది ఈ మెగా కిడ్స్ మారథాన్‌లో సందడిగా పాల్గొన్నారు. 'పిల్లలపై వేధింపులు చాలా తీవ్రమైన విషయం. చైల్డ్ అబ్యూజ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో భాగం కావటం సంతోషంగా ఉంది. పాఠశాలలు చిన్నారులపై వేధింపుల పట్ల జీరో టాలరెన్స్ విధానం పాటించాలని' పి.టి ఉష పేర్కొన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886